# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 3 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 87 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


ఆ చిత్రం వెల రూ.167 కోట్లు



2

Floccinaucinihilipilification

ఈ 'విలువ లేని' పదానికి ఎనలేని డిమాండ్




2



## అమరావతికి జై

- ఏపీ రాజధాని బిల్లు'కు రాజ్యసభ ఆమోదం
- శుభాకాంక్షలు తెలిపిన ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్

ఢిల్లీ, ఏప్రిల్ 2 : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. అంతకుముందు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఎంపీ రేణుకా చౌదరి చర్చ ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైకాపా వాకౌట్ చేసింది. ఇప్పటికే అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్ సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతికి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉంటాయన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో అమరావతి చట్టబద్ధత బిల్లు చట్టంగా మారనుంది. మొత్తం 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ బిల్లుపై చర్చలో పాల్గొనగా.. 10 పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.

## దుస్సాహసానికి పాల్పడితే..!

పాకిస్థాన్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక 9



# గ్యారంటీలపై డౌట్లుంటే తెలంగాణకొచ్చి పరీక్షించుకోండి

## అవినీతి, కుటుంబ పాలనలో కేసీఆర్, విజయన్ ఒక్కటే



కేంద్రం నిధులు మోడీ కరుణ కాదు..

కేరళం ప్రజల హక్కు

ఈ ఎన్నికల్లో తెలంగాణ మాదిరి మార్పు కేరళంలో తప్పదు

నిజాయితీ నేతల కూటమి.. యూనైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్

కొచ్చిలో యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 2, (మనం బ్యూరో) : యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు అవి ఎలా అమలవుతున్నాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన మంత్రులు రాష్ట్రానికి వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపిస్తామని పేర్కొన్నారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి గురువారం కొచ్చిలో యూడీఎఫ్ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళంలో విజయన్ హయాం ముగిసిందనీ, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం ప్రారంభమవుతుందన్నారు. దేశాన్ని, కేరళంను మోడీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోడీ, విజయన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికే రక్షణ లేకుండా పోయిందని పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా విజయన్ ...మిగతా 2లో

## సంక్షేమం, అభివృద్ధిలో రాజీ లేదు

ప్రజల ఆకాంక్షలు,అవసరాలే కేంద్రంగా పాలన

మేం పాలకులం కాదు, ప్రజా సేవకులం

99 రోజుల కార్యాచరణ కార్యక్రమం కాదు..ఒక దీక్ష

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సందేశం

హైదరాబాద్, ఏప్రిల్ 02 (మనం బ్యూరో) : గత పాలకుల తప్పిదాలను సరి చేస్తూ సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా పని చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. మేం పాలకులం కాదు...సేవకులం అనే భావనతో ప్రజల అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం ...మిగతా 2లో

సర్కారుకు భారీ ఊరట

## ఆధారాల్లేవ్...అడ్డుకోలేం

### మూసీ సుందరీకరణకు ఎన్‌జీటీ గ్రీన్ సిగ్నల్

- బీఆర్ఎస్ నాయకుని పిటిషన్ డిస్మిస్




హైదరాబాద్,ఏప్రిల్ 2(మనం,ప్రత్యేక ప్రతినిధి) : మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. ఈ ప్రాజెక్టును సవాలు చేస్తూ బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ డిస్మిస్ చేసింది. దీంతో మూసీ ప్రక్షాళన పనులకు ఉన్న ప్రధాన న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయినట్లయింది. మూసీ సుందరీకరణ, గాంధీ సరోవర్ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని కార్తిక్ రెడ్డి ఎన్జీటీలో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ పిటిషన్‌ను విచారించిన ట్రిబ్యూనల్ పిటిషనర్ తన వాదనలకు సంబంధించి ఎటువంటి సరైన సాంకేతిక లేదా శాస్త్రీయ ఆధారాలను సమర్పించలేదని ఎన్జీటీ పేర్కొంది. కేవలం అనుమానాలతో ప్రాజెక్టును అడ్డుకోలేమని, పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారని ట్రిబ్యూనల్ అభిప్రాపడుతూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఇది కేవలం రాజకీయ దురుద్దేశమేనన్న ప్రభుత్వ న్యాయవాదుల వాదనతో ఏకీభవించింది. దీంతో న్యాయపరమైన అడ్డంకులు తొలగి, మూసీ ప్రక్షాళన పనులకు ...మిగతా 2లో

## ప్రతి సర్వే నంబరుకు భూధార్

వీలైనంత త్వరగా సాదాబైనామాలకు పరిష్కారం

బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం బ్యూరో) : రాష్ట్రంలోని ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించి అవసరమైన మార్పులతో జిల్లాకో మండలంలో ప్రవేశ పెడతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని మిఠాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను మంత్రి పొంగులేటి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. ఏ పేదోడు ఏ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఏ అధికారి దగ్గరికి వెళ్లి ప్రాధేయ పడాల్సిన అవసరం లేదు. తన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్‌తో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌లో లాగిన్ అయితే అన్ని సేవలు లభిస్తాయని తెలిపారు. గత ప్రభుత్వ పాలకులు ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదా బైనామా దరఖాస్తులకు దిక్కు లేకుండా పోయిందని ఇప్పుడు ఈ పేదల ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని తెలిపారు. సాగు చేస్తూ వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకుని వారికే భూమి పట్టాను ఖరారు చేస్తామన్నారు.దీని కోసం వారం రోజుల క్రితం భూ భారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని వెల్లడించారు. అంతేగాక గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాలిటీగా మారిన ప్రాంతాలకు ఈ సాదా బైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖలో గణనీయమైన మార్పులు తెస్తున్నామనీ, దీనిలో భాగంగా అక్రమాల ధరణిని బంగాళాఖాతంలో కలిపి భూ భారతి తెచ్చామన్నారు. ఆధార్ నెంబర్‌లా ప్రతి భూమికి భూధార్ కేటాయిస్తామనీ, చెప్పారు. సర్వే విషయంలో కూడా పాత పద్ధతులకు స్వస్తి పలికి ఇప్పటికే 411 రోవర్లతో కచ్చితమైన సర్వే చేయిస్తున్నామన్నారు. త్వరలో మరో 400 రోవర్లు రాబోతున్నాయని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

పౌరసత్వం తనిఖీ

## ఈసీ పని కాదు

'సర్' పై ఎంఐఎం నేత అసదుద్దీన్



కోల్‌కతా, ఏప్రిల్ 2 : భారత ఎన్నికల సంఘం (ఈసీ) చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై (సర్) ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభ్యంతరం వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని తనిఖీ చేయడం ఈసీ పరిధిలో లేదని, అది హోం మంత్రిత్వశాఖ బాధ్యతని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో ...మిగతా 2లో

## కిషన్ రెడ్డి X సురేశ్ రెడ్డి



ఢిల్లీ, ఏప్రిల్ 2 : కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్ రెడ్డిఅభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై ...మిగతా 2లో

ప్రాజెక్టులన్నీ ప్రజల సొమ్ముతోనే కట్టినం 2

## 'గ్రూప్-1'లో జోక్యం చేసుకోలేం

అభ్యర్థుల పిటిషన్ డిస్మిస్ చేసిన 'సుప్రీం'

హైదరాబాద్,ఏప్రిల్ 2(మనం,ప్రత్యేక ప్రతినిధి) : ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు ఇంతకుముందు హైకోర్టును ఆశ్రయించారు. మూల్యాంకనంలో తప్పులున్నాయని, నోటిఫికేషన్ రద్దు చేసి.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్.. గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కనిపించలేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు తీర్పునిచ్చిందని కోర్టుకు వివరించారు. మూడుసార్లు మూల్యాంకనం జరిగిందని టీజీపీఎస్సీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్రమాలకు తావులేకుండా నియామక ప్రక్రియ చేపట్టినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్ డిస్మిస్ చేసింది.

రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై

## అతి భీకర దాడులు చేస్తం

హర్మూజ్ మా బాధ్యత కాదు అవసరమున్న వారే దాన్ని కాపాడుకోవాలె

గందరగోళ ప్రకటనలు చేస్తున్న ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 2 : రానున్న రెండు, మూడు వారాల్లో ఇరాన్ పై భీకర దాడులు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఇరాన్ తమతో ఒప్పందానికి రావాలని.. లేకపోతే ఆ దేశాన్ని రాతియుగానికి తీసుకెళ్తామని హెచ్చరించారు. యుద్ధం ఇప్పట్లో ...మిగతా 2లో

### అమెరికా ప్రజలకు ఇరాన్ అధ్యక్షుడి బహిరంగ లేఖ



టెహ్రాన్, ఏప్రిల్ 2 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు విపరీతమవుతోన్న నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అమెరికా ప్రజలనుద్దేశించి బహిరంగ లేఖ రాశారు. తమకు ...మిగతా 2లో

## అమెరికా లొంగిపోయే వరకు యుద్ధం చేస్తం

ప్రకటించిన ఇరాన్ మిలిటరీ కమాండ్ హెడ్ క్వార్టర్స్

టెహ్రాన్, ఏప్రిల్ 2 : ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని.. వారి నాయకత్వాన్ని తీవ్ర స్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ సైన్యం దీటుగా స్పందించింది. తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని స్పష్టం చేసింది. అంతేకాదు, అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి చేసిన ప్రకటనను అక్కడి అధికారిక మీడియా ప్రసారం చేసింది.

తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తిస్థాయి సమాచారం లేదని ఇరాన్ పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, ...మిగతా 2లో

## ఇరాన్‌లో ఇంకా సాధించేముంది?

అమెరికానుద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించిన ఆస్ట్రేలియా ప్రధాని



కాన్‌బెర్రా, ఏప్రిల్ 2 : 'ఇరాన్‌లో ఇంకా సాధించాల్సింది ఏముందంటూ' పశ్చిమాసియా యుద్ధంపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ వ్యాఖ్యానించారు. యుద్ధం ముగింపు ఎలా ఉంటుందనే దానిపై స్పష్టత ఉండాలన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు, దాని పొరుగుదేశాలకు హాని కలగకుండా ఉండేందుకు ఆ దేశ సైనిక సామర్థ్యాలను తగ్గించాలనే ప్రాథమిక లక్ష్యాలకు అమెరికాకు తాముకూడా మద్దతిచ్చినట్లు అల్బనీస్ తెలిపారు. యుద్ధంలో ఆ లక్ష్యాలు నెరవేరాయన్నారు. అయినా.. యుద్ధం కొనసాగించడానికి ఇంకా అక్కడ ...మిగతా 2లో

ఇరాక్‌లో అమెరికా జర్నలిస్టు కిడ్నాప్ 9

# ఆ చిత్రం వెల రూ.167 కోట్లు

## రాజా రవివర్మ పెయింటింగ్‌ను సొంతం చేసుకున్న సైరస్ పూనావాలా

ముంబై, ఏప్రిల్ 2 : విఖ్యాత చిత్రకారుడు రాజా రవివర్మ పెయింటింగ్ ఒకటి రూ.167.2 కోట్లకు అమ్ముడు పోయి అరుదైన రికార్డు సృష్టించింది. యశోద, చిన్ని కృష్ణుడు ఉన్న ఆయిల్ పెయింటింగ్ ను బుధవారం ముంబయిలో సాఫ్రాన్ ఆర్ట్స్ స్ప్రింగ్ లైవ్ సంస్థ నిర్వహించిన వేలంలో ఈ చిత్రాన్ని దక్కించుకొనేందుకు అనేకమంది పోటీపడ్డారు. పారిశ్రామిక వేత్త, సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు సైరస్ పూనావాలా దీన్ని దక్కించుకొన్నారు. 1890లలో గీసిన దీన్ని రూ.167 కోట్లకు కొనుగోలు చేశారు. గతేడాది చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ గీసిన ఓ పెయింటింగ్ రూ.118 కోట్లకు అమ్ముడై అత్యంత ఖరీదైన భారతీయ కళా ఖండం అత్యంత ఖరీదైన పెయింటింగ్ గా సృష్టించిన రికార్డును ఈరాజా రవివర్మ చిత్రం బ్రేక్ చేయడం విశేషం.

## Floccinaucinihilipilification

# ఈ 'విలువ లేని' పదానికి ఎనలేని డిమాండ్

ఢిల్లీ, ఏప్రిల్ 2 : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై దాఖలైన పరువునష్టం కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి ఉపయోగించిన ఓ ఇంగ్లిష్ పదం ఇప్పుడు తెగ ట్రెండ్ అవుతోంది. అదే 29 అక్షరాల **Floccinaucinihilipilification**. ఈ పదాన్ని చూసి ఆశ్చర్యపోయిన నెటిజన్లు.. దాని అర్థమేంటీ? ఎలా పలకాలి? ఎక్కడ ఉపయోగిస్తారని నెట్టింట వెతికేస్తున్నారు. ఇంతకీ ఏంటీ పదం..? న్యాయమూర్తి ఎందుకు ఈ మాట అన్నారో తెలుసుకుందాం..!

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌పై ఆమ్‌ఆద్మీ పార్టీ నేత సోమనాథ్ భారతి భార్య లిపికా మిశ్రా గతంలో పరువు నష్టం దావా వేశారు. 2024 ఎన్నికల సమయంలో ఓ మీడియా సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. తమ వైవాహిక విభేదాలను ప్రస్తావిస్తూ పరువుకు భంగం కలిగేలా మాట్లాడారని దావాలో పేర్కొన్నారు. అయితే, ఈ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు బుధవారం కొట్టేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'ఫ్లాక్సినాసినిహిలపిలఫికేషన్' అనే పదాన్ని ప్రయోగించారు. లిపికా మిశ్రా ఆరోపణల్లో నిజం లేదని, ఈ పిటిషన్‌కు ఎలాంటి అర్హత లేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

**ఫ్లాక్సినాసినిహిలపిలఫికేషన్ అంటే..**

ఏదైనా ఒక విషయాన్ని నిరుపయోగమైనదిగా పరిగణించే సమయంలో ఈ పదాన్ని ఉపయోగిస్తారు. అంటే ఆ విషయం అంతగా విలువలేనిది.పనికిరానిదని అర్థం. లాటిన్ మూలాల నుంచి ఈ పదం వచ్చింది. **flocci, nauci, nihili, pili** అనే నాలుగు పదాలను కలిపి దీన్ని రూపొందించారు. వీటన్నింటి అర్థం 'విలువ లేదు' అనే..! అయితే, చూడటానికి చాలా పొడవుగా.. పలకడానికి చాలా క్లిష్టంగా ఉండటంతో రోజువారీ సంభాషణల్లో దీన్ని ఎక్కువగా ఉపయోగించడం లేదు. కొన్నేళ్లక్రితం కాంగ్రెస్ నేత శశిథరూర్ ఈ పదాన్ని ఉపయోగించారు. ఇప్పుడు తాజాగా కోర్టు తీర్పులో ఈ పదాన్ని ప్రయోగించడంతో 'ఫ్లాక్సినాసినిహిలపిలఫికేషన్'పై ఆసక్తి ఏర్పడింది.

# ఆధారాల్లేవ్...అడ్డుకోలేం

(మొదటి పేజీ తరువాయి)

మార్గం సుగమమైంది. ఇదిలావుండగా హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో మూసీ నదిని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో సుందరీకరించాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిన విషయం తెలిసిందే.ఈ క్రమంలోనే సుమారు రూ.50 వేల కోట్లతో భారీ ప్రాజెక్టును చేపట్టింది. నేషల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఇచ్చిన తాజా తీర్పుతో ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనుల్లో వేగం పెంచే అవకాశం ఉంది. ఇందులో భాగంగా ఇప్పటికే మూసీ నదిలో మురుగునీరు కలవకుండా ఎస్టీపీ ల నిర్మాణం, నది పరివాహక ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, చెక్ డ్యామ్‌ల ఏర్పాటు వంటి పనులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**అసెంబ్లీలో చర్చ :**

ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్‌జీటీలో పిటిషన్ ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సూచించారు. హైదరాబాద్ నగరం సుందరీకరణకు వ్యతిరేకంగా సబిత కుమారుడు కార్తీక్‌రెడ్డి పిటిషన్ వేయడంపై సీఎం సూటి ప్రశ్నలు సంధించాడు. అభివృద్ధి నిరోధకుల మాటలకు విని కార్తీక్ రెడ్డి దారి తప్పుతున్నాడని సీఎం హితవు పలికారు. మూసీ పునర్జీవానికి రాజకీయాలకు అతీతంగా అందరూ ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు.

## రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై

# అతి భీకర దాడులు చేస్తం

(మొదటి పేజీ తరువాయి)



ఆగే పరిస్థితి లేదన్నారు. ఇరాన్‌పై నిర్దేశించుకున్న అన్ని లక్ష్యాలను పూర్తి చేసే దిశగా తాము ముందుకుసాగుతున్నామని ట్రంప్ పేర్కొన్నారు.

ఇరాన్ అణ్వాయుధాలు కలిగిఉండేందుకు వీలులేదని పునరుద్ఘాటించారు. ఇరాన్ చమురును లక్ష్యంగా చేసుకొని ఇప్పటివరకు తాము దాడి చేయలేదని ట్రంప్ పేర్కొన్నారు. కానీ, అవసరమైతే తాము వాటిని కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. అమెరికా భద్రత కోసమే ఈ 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని ప్రారంభించామని వ్యాఖ్యానించారు. యూఎస్ ను అంతం చేయాలని ఇరాన్ కోరుకుంటోందని ట్రంప్ ఆరోపించారు.

**ట్రంప్ గందరగోళ మాటలు..**

ఈ సందర్భంగా ఇరాన్ పై యుద్ధాన్ని త్వరలోనే ముగిస్తామన్నట్లు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. అమెరికా తన లక్ష్యాలను చేరుకుందని.. ఇది అతి త్వరలోనే ముగుస్తుందని అన్నారు. యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరలు పెరగడంపై కూడా ఆయన మాట్లాడారు. ఇది తాత్కాలికమేనని అన్నారు.

**హర్మూజ్ మా బాధ్యత కాదు.. వారే చూసుకోవాలె..**

ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి నుంచి వచ్చే చమురుపై యూఎస్ ఆధారపడటం లేదని.. భవిష్యత్తులో కూడా దాని అవసరం మాకు లేదు. అందువల్ల, ఆ జలసంధిపై ఆధారపడిన దేశాలే.. ధైర్యాన్ని కూడగట్టుకొని జలసంధిని ఇరాన్ నుంచి కాపాడుకోవాలన్నారు.

# అమెరికా లొంగిపోయే వరకు యుద్ధం చేస్తం

(మొదటి పేజీ తరువాయి)

సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతోపాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామన్న ట్రంప్ వాదనలను ఖండించింది. మరోవైపు, ఇరాన్ ను రాతియుగంలోకి పంపిస్తామని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించింది. రాతియుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి అమెరికా తీసుకొస్తోందని.. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలను ఆధునిక ప్రపంచంలోకి తెస్తోందని విమర్శించింది.

**భారత మిత్రులు సురక్షితంగానే**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ భారత్లోని ఇరాన్ రాయబార కార్యాలయం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత మిత్రులు సురక్షితంగానే ఉన్నారని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని పేర్కొంది. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. అంతకుముందు.. హర్మూజ్ భవిష్యత్తును ఇరాన్, ఒమన్లు మాత్రమే నిర్ణయిస్తాయని దక్షిణాఫ్రికాలోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. దక్షిణాఫ్రికా పౌరులు సురక్షితమేనని పేర్కొంటూ పోస్టు చేయగా.. దీనికి భారత్లోని ఇరాన్ రాయబార కార్యాలయం స్పందించింది.

## అమెరికా ప్రజలకు ఇరాన్ అధ్యక్షుడి బహిరంగ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

అమెరికన్లపై ఎలాంటి శత్రుత్వం లేదని స్పష్టంచేశారు. అనేకసార్లు ఒత్తిళ్లు, ఆంక్షలు ఎదురైనప్పటికీ.. తాము ఎన్నడూ యుద్ధానికి దిగలేదన్నారు. తమపై చేస్తోన్న దాడులను దృఢంగా, ధైర్యంగా తిప్పికొడుతున్నామన్నారు. 'అమెరికా ఫస్ట్' అనేది ప్రస్తుత పరిపాలనలో ఉందా అని ఆయన వారిని ఆయన ప్రశ్నించారు. యుద్ధంపై వారిని పునరాలోచించుకోవాలని ఆయన సూచించారు.

## పౌరసత్వం తనిఖీ ఈసీ పని కాదు

(మొదటి పేజీ తరువాయి)

రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. బెంగాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'సర్ ప్రక్రియకు మేం వ్యతిరేకం. సుప్రీంకోర్టులో మా రిట్ పిటిషన్ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. పౌరసత్వాన్ని తనిఖీ చేసే అధికారం ఎన్నికల సంఘానికి లేదు. ఇది హోం మంత్రిత్వశాఖ బాధ్యత. మేం చెప్పేది ఇంతే. బెంగాల్లో ఓటర్ల జాబితా తుది ప్రకటన ఆలస్యమవుతోంది. వివాదాస్పద జాబితాలో ఉన్న పేర్లను వెంటనే ఖరారు చేయాలి. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ఇలాంటి ఆలస్యం తగదు. దీనిని సరిదిద్దాల్సిన అవసరం ఉంది' అని ఒవైసీ స్పష్టం చేశారు. నౌడాలో ఏజేయూపీ అభ్యర్థికి మద్దతుగా అసదుద్దీన్ ఒవైసీ ప్రచారం చేశారు. గత 50 ఏళ్లలో ముస్లింలను కాంగ్రెస్, లెఫ్ట్, తృణమూల్ మోసం చేశాయని ఆరోపించారు.

## గ్యారంటీలపై డౌట్లుంటే తెలంగాణకొచ్చి

# పరీక్షించుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం కొనసాగుతోందనీ, అలాగే, 2014 నుంచి తెలంగాణను కేసీఆర్ పదేళ్ల పాటు పరిపాలించారన్నారు. పినరయ్ కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో విజయన్, కేసీఆర్ మధ్య అనేక పోలికలు ఉన్నాయని విమర్శించారు. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటు చేసుకుంటుందనీ, విజయన్ ప్రభుత్వాన్ని ఈ సారి ప్రజల గద్దె దింపడం ఖాయమని వ్యాఖ్యానించారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా "పో మోనే విజయా" వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన సీఎం రేవంత్ విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అనీ, మోడీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చే నిధులు ప్రధాని మోడీ కరుణ కాదనీ, అవి కేరళం ప్రజల హక్కు అని స్పష్టం చేశారు. యూడీఎఫ్ కార్మికుల కూటమి అనీ, కూటమిలో నిజాయితీ కలిగిన నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. కాగా, సీఎం యూడీఎఫ్ మేనిఫెస్టోలో భాగంగా ఇందిరా ఐదు గ్యారంటీలను విడుదల చేశారు. వీటిలో కేరళం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, కాలేజీ చదువుతున్న విద్యార్థినులకు నెలకు రూ.1000 ఆర్థిక సాయం, సంక్షేమ పింఛన్లు నెలకు రూ.3 వేలు పెంపు, మాజీ సీఎం ఉమేన్ చాందీ పేరుతో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమాతో పాటు యువతకు స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షల వడ్డీ లేని రుణాలు ఉన్నాయి.



## గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక పాఠశాలలు

### రానున్న విద్యా సంవత్సరమే అడ్మిషన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 2 : గిరిజన విద్యా ర్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందించే దిశగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 16 ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలల్లో చదువు తున్న గిరిజన విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు ఈ పాఠశాలల్లో ప్రవేశం కల్పించి ప్రత్యేక బోధన అందించనున్నారు.

**ప్రతిభా ఆధారంగా ప్రవేశాలు..**

ఏప్రిల్ మొదటి లేదా రెండో వారంలో ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నారు. అందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

# సంక్షేమం, అభివృద్ధిలో రాజీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నామన్నారు. ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్దతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలంటే కాగితాలపై కాదు, ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నదే మా సంకల్పమనీ, ఆ ఉద్దేశంతోనే ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించామని వెల్లడించారు. ఈ కార్యక్రమం గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో ఒక ఉద్యమంలా సాగాలనీ, ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలన్నారు. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలన్నారు. మహాలక్ష్మి, ఉచిత బస్సు సౌకర్యం, రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలన్నారు. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు, ఒక దీక్ష, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామ్యం కావాలనీ, ఈ దిశగా మీ అందరి సహకారం కావాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన గ్రామ సభలు**

99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. ఈ గ్రామ సభలో వార్డు స్థాయి నుంచి ఎంపీ వరకు ప్రభుత్వం భాగస్వాములను చేసింది. ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అధికారులు ఈ సందర్భంగా గ్రామ సభలలో ప్రజలకు వివరించారు. అలాగే, ప్రతి నియోజకవర్గంలో వేలాది ఇందిరమ్మ ఇళ్లు, జూన్ 2 నుంచి ప్రారంభించనున్న అందరికీ ఆరోగ్య బీమా, మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరంటు వంటి పథకాలను ప్రజలకు అధికారులు వివరించారు.

# కిషన్ రెడ్డి X సురేశ్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్‌ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు. 'కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్ ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారు' అని కిషన్‌రెడ్డి అన్నారు.

కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్ రెడ్డిఅన్నారు. 'ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోడీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి.

## ఇరాన్లో ఇంకా సాధించేముంది?

(మొదటి పేజీ తరువాయి)

సాధించాల్సింది ఏముందని ఆయన ప్రశ్నించారు. యుద్ధం ముగింపు ఎలా ఉంటుందనే దానిపై స్పష్టత లేదన్నారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే.. ప్రపంచ ఆర్థికవ్యవస్థపై దాని ప్రభావం అంత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే ప్రశ్నకు.. ఇది ప్రారంభమవడానికి ముందు తమను ఎవరూ సంప్రదించలేదని అల్బనీస్ బదులిచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. దీనికి ముందు అల్బనీస్ చేసిన మరో ప్రసంగంలో.. రానున్న నెలలు మరింత క్లిష్టంగా ఉండవచ్చని హెచ్చరించారు. ఈ యుద్ధంలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం కాదన్నారు. కానీ, దీనివల్ల తాము అధిక మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన అన్నారు.

## ఇరాక్‌లో అమెరికా జర్నలిస్టు కిడ్నాప్

బాగ్దాద్, ఏప్రిల్ 2 : అమెరికాకు చెందిన మహిళా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షెల్లీ కిటెల్సన్ మంగళవారం ఇరాక్ రాజధాని బాగ్దాద్ లోని ఓ హోటల్ వెలుపల దుండగులు కిడ్నాప్ చేశారు. ఈ వ్యవహారంలో ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. అతడికి ఇరాన్ తో సన్నిహితంగా ఉండే కతైబ్ హెజ్బొల్లా బృందాలతో సంబంధం ఉన్నట్లు తెలిపింది. కిటెల్సన్ గత వారం సిరియా నుంచి ఇరాక్లోకి ప్రవేశించే ప్రయత్నం చేశారని, అయితే అప్పుడు ఆమెను వెనక్కి పంపించామని ఇరాకీ అధికారులు తెలిపారు. ఆ తర్వాత 60 రోజులు చెల్లుబాటయ్యే సింగిల్ ఎంట్రీ వీసాతో ఆమె ఇరాక్లో ప్రవేశించినట్లు వెల్లడించారు. కిటెల్సన్ చాలా ఏళ్లు ఇరాక్, సిరియాల్లో పనిచేశారు.

# ప్రాజెక్టులన్నీ ప్రజల సొమ్ముతోనే కట్టినం

- **తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలి?**
- **కేంద్రం ఏ నిధులు ఇవ్వలేదు?..**
- **బీఆర్‌ఎస్ వెల్లడించిన బీఆర్‌ఎస్ ఎంపీలు**
- **బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాల్సిందే**
- **ప్రతి జిల్లాకు ఒక నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం ఇవ్వాలి?**
- **ఆదిలాబాద్, వరంగల్ , కొత్తగూడెం ఎయిర్ పోర్టులు త్వరగా పూర్తిచేయండి**
- **లోక్ సభలో బీఆర్‌ఎస్ సభ్యుల డిమాండ్**

హైదరాబాద్, మనం ప్రతినిధి : అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో బీఆర్‌ఎస్ సభ్యులు, వద్దిరాజు రవీచంద్ర మద్దతు ప్రకటించారు. అదేవిధంగా ఏపీ రీఆర్గనైజేషన్ చట్టం ప్రకారం తెలంగాణ రావాల్సిన పథకాల గురించి ప్రస్తావించారు. మొదటిసారి విజయవాడలో అమరావతి కట్టుకున్నప్పుడు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అక్కడికి వెళ్లి అక్కడి ప్రజలను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారని తెలిపారు. తెలంగాణ, ఏపీ ఉమ్మడిగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని అన్నారు. అయితే రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక, ఏపీ రీఆర్గనైజేషన్ ప్రకారం తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో ఒక్క ప్రాజెక్ట్‌కైనా జాతీయ హోదా ఇవ్వాలని పదేపదే కోరుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. తెలంగాణలో ప్రజల సొమ్ముతునే ప్రాజెక్టులను కట్టుకున్నామని ,కేంద్రం ఇచ్చిన నిధులతో ఏవి లేవని బీఆర్‌ఎస్ ఎంపీలు సభకు వివరించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టును సైతం ప్రజా పన్నులు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా సేకరించి కట్టుకున్నామని వెల్లడించారు. 60 లక్షల టన్నుల ధాన్యం పండించే రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టుతో 3 కోట్ల టన్నుల ధాన్యం పండిస్తున్న ఘనత కేసీఆర్దేనని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కైనా, పాలమూరు ఎత్తిపోతల పథకానికైనా జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. విభజన సమయంలో తెలంగాణలోని ఏడు మండలాలను ఏకపక్షంగా ఆంధ్రలో విలీనం చేయడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని , ముఖ్యంగా భద్రచలం ఆలయానికి చెందిన 5 గ్రామాల్లో ఉన్న భూములు,ఆస్తుల విషయంతో సమస్యలు వస్తున్నాయని వివరించారు. తెలంగాణ బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని ప్రతి జిల్లాకు ఒక నవోదయ పాఠశాలను, ఒక్కో జిల్లాకు ఒక కేంద్రీయ విద్యాలయం ఇవ్వాలని కోరారు. ఆదిలాబాద్, వరంగల్ , కొత్తగూడెం ఎయిర్ పోర్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# భాధ్యతగా... భద్రత

- **ఘనంగా ఐ ఎస్ డబ్ల్యు ఆవిర్భావ వేడుకలు**
- **'జీరో ఎర్రర్' విధానంతో పని చేయాలి**
- **ఓఎస్డీ బి.వి. కమలాసన్ రెడ్డి పిలుపు**



హైదరాబాద్, ఏప్రిల్ 2(మనం,ప్రత్యేక ప్రతినిధి) : వీఐపీల భద్రతలో భాధ్యతాయుతంగా పనిచేసే తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ సిబ్బందికి ఓఎస్డీ బి.వి. కమలాసన్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈక్రమంలో ఐ ఎస్ డబ్ల్యు కార్యాలయంలో గురువారం ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓఎస్డీ బి.వి. కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ భద్రతా రంగంలో అప్రమత్తత అత్యంత కీలకమని, ఒక్క చిన్న తప్పు జరిగినా అది పూర్తి వైఫల్యంగానే పరిగణించబడుతుందన్నారు. భద్రతా దళాలు 'జీరో ఎర్రర్' విధానంతో పని చేయాలన్నారు. 1984లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యతో పాటు అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న పీడబ్ల్యూజీ దాడుల నేపథ్యంలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 1985 ఏప్రిల్ 2న ఈ విభాగం ఏర్పాటైందన్నారు. ఈ విభాగంలో పనిచేసే సిబ్బంది తమ విధుల్లో విశేష ప్రతిభ కనబరిస్తే 'ఐ ఎస్ డబ్ల్యూ ఛాంపియన్ ట్రోఫీ' అందజేస్తామని ప్రకటించారు. సీఎంఎస్జీ సెక్యూరిటీ అధికారి జి. చక్రవర్తి మాట్లాడుతూ ఐఎస్‌డబ్ల్యూ అత్యంత రహస్యమైన, కీలకమైన విభాగమన్నారు. ఈ నేపథ్యంలో వి.ఐ.పిల భద్రతలో తెలంగాణ అధికారులు ప్రదర్శిస్తున్న నైపుణ్యాన్ని ఇతర రాష్ట్రాలు సైతం ప్రశంసిస్తున్నాయని కొనియాడారు. కమ్యూనికేషన్స్ ఎస్పీ శ్రీనివాస చారి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో శారీరక దాడుల కంటే సాంకేతిక దాడుల ముప్పు పెరుగుతోందని, డ్రోన్ టెక్నాలజీ, సిగ్నల్ జామర్ల వంటి ఆధునిక పరికరాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల వి.ఐ.పిలు సైతం తెలంగాణ భద్రతా వ్యవస్థపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని, దీనికి పీఎస్ఓల అంకితభావమే కారణమని ఎస్పీ సయ్యద్ బాషా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.


# కరెంట్ 'ఛార్జీల పెంపు నో'

- **తెలంగాణ విద్యుత్ వినియోగదారులకు రెండు శుభవార్తలు**
- **ఇకపై షాక్‌తో చనిపోతే రూ.8 లక్షలు..**
- **భాదిత కుటుంబాలకు 2 నెలల్లోనే పరిహారం చెల్లింపు**

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో విద్యుత్ వినియోగదారులకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఒకేసారి రెండు శుభవార్తలు అందించింది. రాష్ట్రంలో ఎవరైనా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు ఈ ఏడాది కరెంట్ ఛార్జీల పెంపు ఉండబోదని స్పష్టం చేసి ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన టారిఫ్ ఆర్డర్ను తాజాగా ఈఆర్సీ విడుదల చేసింది.

**2 నెలల్లోనే పరిహారం చెల్లింపు**

ఇప్పటివరకు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుండగా, దానిని మరో రూ.3 లక్షలు పెంచి రూ.8 లక్షలు చేసింది. ఈ పెంచిన పరిహారం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. బాధితుడి కుటుంబానికి రెండు నెలల్లోపే ఈ సొమ్మును అందించాలని, జాప్యం జరిగితే అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా వివరించాలని డిస్కంలను ఆదేశించింది. వినియోగదారుడి తప్పిదం వల్ల ప్రమాదం సంభవించినా ఈ పరిహారం వర్తిస్తుందని స్పష్టం చేయడం గమనార్హం.



**పాత ఛార్జీలే కొనసాగింపు..**

ఇదిలాఉంటే, మరో ఏడాది పాటు పాత కరెంట్ ఛార్జీలనే కొనసాగించాలని నిర్ణయించగా... ఛార్జీల పెంపుపై ఎలాంటి ప్రతిపాదన లేదని ఈఆర్సీ చెప్తోంది. దీంతో పాటు ఇళ్ల పైకప్పులపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్లాంట్ల వినియోగదారులకు ఊరట కల్పించింది. అదనపు యూనిట్ల వాడకంపై అధిక శ్లాబుల ప్రకారం వసూలు చేసిన అదనపు మొత్తాన్ని రాబోయే మూడు నెలల బిల్లుల్లో సర్దుబాటు చేయాలని డిస్కంలను ఆదేశించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలుకు రూ.49,230 కోట్లకు, ఇతర వ్యయాలతో కలిపి మొత్తం రూ.64,950 కోట్లకు ఈఆర్సీ ఆమోదం తెలిపింది. అయితే, టీఎస్ఎన్‌పీడీసీఎల్, టీఎస్ఎస్పీడీసీఎల్‌ల ఆదాయ, వ్యయాల మధ్య సుమారు రూ.15,106 కోట్ల లోటు ఏర్పడుతుందని ఈఆర్సీ అంచనా వేసింది. ఈ లోటును భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.14,000 కోట్ల ఆర్థిక సహాయం అందించడానికి అంగీకరించిందని తెలిపింది. మిగిలిన లోటును డిస్కంల రెగ్యులేటరీ ఆస్తిగా పరిగణించాలని సూచించింది.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



- అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి, ఏప్రిల్ 2 మనంప్రతినిధిః రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని , పేదల అభ్యున్నతే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గ్రామసభ తెలంగాణ గీతంతో ప్రారంభమైంది. అనంతరం రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని గ్రామ ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల లబ్ధిదారుల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ



ప్రతి గ్రామంలో మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని 28 స్వయం సహాయక సంఘాలకు రూ.3.50 కోట్ల రుణాలు అందించగా, రూ.2.50 లక్షల వడ్డీ సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, రైతు భీమా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఎన్నో అమలు చేస్తున్నట్లు చెప్పారు. అల్మాయిపేట గ్రామంలోని సర్వే నం. 513లో కొత్త కాలనీ ఏర్పాటు చేస్తే రహదారులు, నీటి ట్యాంక్, విద్యుత్ సౌకర్యాలు, ఇళ్ల నిర్మాణం వంటి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, హైవే నుండి అల్మాయిపేట-కొన్యాల వరకు బీటీ రహదారి, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు మంజూరు చేస్తామని తెలిపారు. మంజూరైన 7 ఇందిరమ్మ ఇళ్లలో 4 మాత్రమే నిర్మించబడిన నేపథ్యంలో మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన ఆర్థిక సహాయం అందించడమే కాకుండా వ్యక్తిగతంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఇల్లు నిర్మించేందుకు ముందుకు వచ్చే వారికి కొత్తగా ఇళ్ల మంజూరు కూడా చేస్తామని తెలిపారు. అందోల్ ప్రాంతంలో ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని కోరారు. ఆందోల్ నియోజకవర్గంలో త్వరలో ఫార్మసీ కళాశాల స్థాపన జరుగుతుందని, సంగుపేట గుట్ట వద్ద రెండు మూడు పరిశ్రమలు రానున్నట్లు వెల్లడించారు.

పేదలకు చెందిన సుమారు 40 ఎకరాల అసైన్డ్ భూమి తప్పుగా రిజిస్ట్రేషన్ అయిన విషయంపై ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేసి, రిజిస్ట్రేషన్ రద్దు చేసి భూములను అసలు లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే రెండు నెలల్లో 10 శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం తో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని , ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడంతో పాటు కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కొత్తగా పిల్లలకు పోషకాహారంతో కూడిన రాగి జావాతో బ్రేక్ఫాస్ట్ పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకాలను ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు గృహ నిర్మాణానికి మంత్రి, కలెక్టర్ కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్, ఉప సర్పంచ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పిల్లల మేలైన భవిష్యత్తు కోసం ఆటిజంలో ముందస్తు గుర్తింపు జోక్యం తప్పని అవసరం




రంగారెడ్డి ఏప్రిల్ 2(మనం న్యూస్): ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా మానస చిన్నారుల ఆరోగ్య , వైకల్యాల అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో ఆటిజంలో ముందస్తు గుర్తింపు , జోక్యం - జీవిత మార్గాలను మార్చే దిశగా అనే అంశంపై సెమినార్ నిర్వహించబడింది.

మెదడు , వెన్నెముక శస్త్ర వైద్య నిపుణుడు డా. టి. కృష్ణమూర్తి మాట్లాడుతూ, ఆటిజం ఉన్న పిల్లల్లో ఇంద్రియ స్పందన విధానం భిన్నంగా ఉంటుందని తెలిపారు. శిశువుల్లో కంటి సంబంధం, స్పందన, పరస్పర చర్యలలో మార్పులను గమనించడం ద్వారా తల్లిదండ్రులు తొందరగా ఆటిజాన్ని గుర్తించవచ్చని చెప్పారు. అలాగే, తల్లిదండ్రుల ద్వారా గుర్తింపు, పిల్లల వైద్యుల ద్వారా నిర్ధారణ, ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా జోక్యం సమన్వయంతో జరగాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఇంటి వద్ద తల్లిదండ్రుల సహకారంతో చికిత్స కొనసాగించడం ఎంత ముఖ్యమో చెప్పారు. పిల్లల జీవన నాణ్యత మెరుగుపడటంలో తల్లిదండ్రులు, వైద్యులు, శిక్షణ నిపుణుల పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు. విద్యా సలహాదారు ఆర్. బృజానంద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పిల్లవాడికి సాధారణ పాఠశాలలో చదివే హక్కు ఉందని తెలిపారు. తన అనుభవాన్ని పంచుకుంటూ, ఆటిజం ఉన్న పిల్లలను తరగతుల్లో చేర్చినప్పుడు ఇతర విద్యార్థులు వారిని అంగీకరించి, వారి అభ్యాసాన్ని మెరుగుపరచడంలో సహకరించారని చెప్పారు. ఆటిజం ఉన్న పిల్లలను వేరుగా కాకుండా సమగ్ర వాతావరణంలో భాగం చేయడం అత్యవసరం అని ఆయన అన్నారు.

## క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేష్ రంజన్

- ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఏప్రిల్ 02 ( మనం బ్యూరో ) రాష్ట్ర ప్రభుత్వం పాలనా యంత్రాంగంలో స్వల్ప మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాణి ప్రసాద్‌ను పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం, కొత్త పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ఆమె దృష్టి సారిస్తారు. అలాగే, ఐటి, పరిశ్రమల శాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న జయేష్ రంజన్‌ను క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారులకు ప్రోత్సాహం అందించే దిశగా బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు.

# ఫ్యూచర్ సిటీ కార్యాలయం త్వరగా పూర్తి చేయండి

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం




హైదరాబాద్, ఏప్రిల్ 2(మనం బ్యూరో): ఫ్యూచర్ సిటీ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కేరళ పర్యటన ముగించుకుని తిరిగి రాష్ట్రానికి చేరుకున్న సీఎం ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కాగా రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో 20 ఎకరాల్లో రూ.19 కోట్లతో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి గత ఏడాది సెప్టెంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పునాది రాయి వేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు భారీ ప్రోత్సాహకాలను ప్రకటించింది.

ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో ప్రాతిపదికన అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది.

## పవన పుత్రుడి దీవెనలు అందరిపై ఉండాలి

- చిలుక ఉపేందర్ రెడ్డి



రంగారెడ్డి ఏప్రిల్ 2(మనం న్యూస్): ఆంజనేయ సమి ఆశీస్సులు దీవెనలు అందరిపై ఉండాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ పరిధిలోని హనుమాన్ జన్మోత్సవ (విజయోత్సవం) సందర్భంగా శ్రీ రామకృష్ణా పురం ఐ టి డి ఇ ఎస్ కోపరేటివ్ సొసైటీ, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం స్వామివారికి ప్రత్యేకమైన తమలపాకుల మాలతో అలంకరణ చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా వేద పండితులు ఆశీర్వదించారు. దేవాలయ కమిటీ డైరెక్టర్ సాయి కుమార్ మర్యాద పూర్వకంగా శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, ముప్పిడి లింగ స్వామి గౌడ్, పెద్దవూర సైదులు, వినయ్, వసుదేవుల నాగేష్, కాళిదాసు, రాధ, అర్చన, నాగమణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సైలెంట్‌గా.. సైబర్ నేరాలు




## వృద్ధులే లక్ష్యంగా డిజిటల్ మోసాలు
## అప్రమత్తత కోసమే..సైబర్ జాగరుకత దివాస్
## సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి

హైదరాబాద్ : ఏప్రిల్ 2(మనం,ప్రత్యేక ప్రతినిధి): :వృద్ధులే లక్ష్యంగా సాగుతున్న సైలెంట్‌గా జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టం చేశారు. ఈక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా గురువారం నిర్వహించిన 'సైబర్ జాగురుకత దివస్'ను పురస్కరించుకుని శిఖాగోయల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నెలను ప్రత్యేకంగా వృద్ధుల సైబర్ అవగాహన మాసంగా అంకితం చేస్తున్నామన్నారు. వృద్ధులు తమ జీవితకాల కష్టార్జితాన్ని సైబర్ నేరగాళ్లకు చిక్కి కోల్పోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, అందుకే వారిని చైతన్య పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'గ్రామ సభ' కార్యక్రమాల్లో భాగంగా 281 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. వయో వృద్ధులు ఆత్మవిశ్వాసంతో, భయం లేకుండా డిజిటల్ సేవలను వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఆన్‌లైన్ ఆన్ ఫెయిర్డ్ అనే నినాదంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లు వృద్ధులను దోచుకోవడానికి ప్రధానంగా 'డిజిటల్ అరెస్ట్' వంటి మార్గాలను ఎంచుకుంటున్నారని, ముఖ్యంగా పోలీసులమని నమ్మించి వీడియో కాల్స్ ద్వారా భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని వివరించారు. దేశంలో ఏ చట్ట సంస్థ కూడా వీడియో కాల్ ద్వారా అరెస్టులు చేయదని, ఇలాంటి మోసాలకు స్పందించి నేరగాళ్లకు డబ్బులు పంపవద్దన్నారు.

**ఆశకు పోతే...!**

ఆన్‌లైన్‌లో అధిక లాభాల ఆశ చూపే నకిలీ పెట్టుబడి పథకాలు, క్రిప్టో కరెన్సీ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వివరించారు. ఆన్‌లైన్, సోషల్ మీడియాలో వచ్చే వాటిపై ఏవైనా అనుమానాలు ఉంటే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. రిమోట్ యాక్సెస్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని, బ్యాంక్ కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే నకిలీ సందేశాలను నమ్మి ఓటీపీలు, పిన్ నంబర్లు ఎవరికీ చెప్పవద్దని ఆమె స్పష్టం చేశారు. ఈ క్రమంలో కుటుంబంలోని యువత తమ వంతు బాధ్యతగా పెద్దలకు సాంకేతికతపై అవగాహన కల్పించి, డిజిటల్ నేరాల బారిన పడకుండా రక్షించాలని శిఖా గోయల్ పిలుపునిచ్చారు. సైబర్ మోసానికి గురైన వెంటనే, 'గోల్డెన్ అవర్'లో అంటే మొదటి గంటలోనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. సురక్షితమైన తెలంగాణను నిర్మించడంలో ప్రజలందరూ తమ వంతు భాద్యతగా సహకరించాలని కోరారు.

# మెట్ల గూడెంలో రాక్షస గుహలు

- పరిశీలించిన హెరిటేజ్ నిపుణుల బృందం



హైదరాబాద్, మనం ప్రతినిధి : ములుగు జిల్లా, దామరవాయి మండలం, మొట్లగూడెం గ్రామంలో స్థానికులు అందించిన సమాచారం మేరకు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీ జయేష్ రంజన్ గారి ఆదేశాలనుసారం, ఆచార్య అర్జున్ రావు (డైరెక్టర్), డా. పి. నాగరాజు (డిప్యూటీ డైరెక్టర్), ఎ. రాజు (ఖ్రీ) గారి ఆధ్వర్యంలో టెక్నికల్ బృందం మొట్లగూడెం గ్రామాన్ని సందర్శించింది. చంద్రునిపై మనిషి అడుగుపెట్టి, ప్రపంచవ్యాప్తంగా 5ఎ వేగంతో సమాచార మార్పిడి జరుగుతున్న ఆధునిక కాలంలో, పాతరాతి యుగానికి చెందిన విశేషాలు వెలుగులోకి రావడం ఆశ్చర్యకరంగా భావించవచ్చు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఇటీవల గుర్తించబడిన ప్రాచీన మానవ సమాధులు, ఆ కాలంలో మానవుల ఉనికిని మాత్రమే కాకుండా, వారి జీవన విధానం, ఆచారాలు, వృత్తులు, సామాజిక నిర్మాణం వంటి అంశాలపై విలువైన చారిత్రక ఆధారాలను అందిస్తున్నాయి. వరంగల్ నగరం నుండి సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం, మొట్లగూడెం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఈ మానవ నిర్మిత సమాధులు సుమారు గా వంద ఎకరాలలో విస్తరించి ఉన్నాయి. స్థానికులు వీటిని రాక్షస బండలు, రాక్షస గుహలు వంటి పేర్లతో పిలుస్తున్నారు. కాలక్రమేణా కొన్ని సమాధులు శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని సమాధుల రాళ్లను స్థానికులు గృహనిర్మాణ అవసరాల కోసం వినియోగించారు. సమాధులలో ఉన్న రాతి తొట్లను పశువులకు నీటి కోసం ఉపయోగించారు. ఒకప్పుడు మానవుని స్మారక స్థలాలుగా ఉన్న ఈ ప్రదేశాలు ప్రస్తుతం అటవీ ప్రాంతాలుగా మారి, అడవి మృగాల ఆవాసాలుగా మారుతున్నాయి. ఏటూరు నాగారం ఏజెన్సీ ప్రాంతంలో దామరవాయి, జగ్గారం, గంగారం, రంగాపురం, కామారం, మంగపేట మండలంలోని మల్లూరు గుట్ట, మొట్లగూడెం, కొమురారం, చెట్టుపల్లి, కాంచనపల్లి, గలభ, దొంగతోగు, గుండాల తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఈ రకమైన సమాధులు కనిపిస్తున్నాయి. సమాధి చుట్టూ నాలుగు పెద్ద రాళ్లను నిలబెట్టి, వాటిపై భారీ రాతి పలకను కప్పుగా అమర్చారు. ప్రతి సమాధిలో ఒక చిన్న రాతి తొట్టి (సార్కోఫాగస్) వంటి నిర్మాణం ఉంటుంది. అదేవిధంగా, సమాధి ఒక మూలలో ఖాళీ ప్రదేశం వదిలి, చుట్టూ సుమారు పది అడుగుల వ్యాసార్థంలో రాళ్లతో ప్రహరీ గోడ నిర్మించారు. ఒక్కో సమాధి మధ్య 5 నుండి 100 అడుగుల వరకు దూరం ఉండటం గమనార్హం. ఈ నిర్మాణాలను పరిశీలిస్తే, ఒక ప్రణాళికా పద్ధతితో నిర్మించిన నగర నిర్మాణంలా కనిపించడం విశేషం. ప్రతి సమాధిపై ఉంచిన క్యాప్ స్టోన్ సుమారు 10 నుండి 20 టన్నుల బరువుతో ఉంటుంది. కప్పలయ గుట్ట ప్రాంతంలో ఈ సమాధులు సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. ఈ నిర్మాణాలు, ఈజిప్ట్ పిరమిడ్లలాగే, మరణానంతరం పునర్జన్మపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తాయని భావిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో ఇటువంటి సమాధులు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ మరియు తెలంగాణ రాష్ట్రాలలో విస్తృతంగా కనిపిస్తాయి. తెలంగాణ ప్రాంతంలో ఇలాంటి అపూర్వ వారసత్వ నిర్మాణాలు ఉండటం మనందరికీ గర్వకారణం. ఈ కార్యక్రమం లో ృట ఇః నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్, అ. రాజు, ఒన్ట్, మరివు ఖీ. సాంబశివరావు, ఇః క్రాంతి కుమార్ పాల్గొన్నారు

## క్రైస్తవ సోదరులకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు



హైదరాబాద్ : ఏప్రిల్ 2(మనం): తెలంగాణలోని క్రైస్తవ సోదరులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు త్యాగం, ధైర్యం సీఎం గుర్తు చేసుకున్నారు. యేసు ప్రభు ప్రేమ, కృప కటాక్షాలు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని అభిలాషించారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రపంచానికి ప్రేమతత్వం బోధించిన దయామయుడు, సిలువపై యేసుక్రీస్తు త్యాగం మహోన్నతమైనదని 'గుడ్ ఫ్రైడే' సందేశం సందర్భంగా సీఎం వెల్లడించారు. యేసు క్రీస్తు త్యాగాలకు జ్ఞాపకంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర సోదరీమణులందరూ ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# ట్రాన్స్కోలో ఉద్యోగ నియామకాలపై బీసీ కమిషన్ విచారణ

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఈరోజు బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి మరియు సభ్య కార్యదర్శి శ్రీమతి బాల మాయ దేవి, ఐఏఎస్ గార్లు హైదరాబాద్లోని ట్రాన్స్కో కార్యాలయాన్ని సందర్శించి సంస్థలో రిజర్వేషన్ల అమలులో బీసీలకు జరిగిన అన్యాయాలు మరియు ఇతర అంశాల గురించి సుదీర్ఘంగా విచారించడం జరిగింది. ఈ విచారణ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ సిఎండి డి. కృష్ణ భాస్కర్ (ఐఅఖి), డైరెక్టర్లు వి. శ్రీనివాసులు, డి. లత వినోద్ అలాగే తెలంగాణ ఎలక్ట్రిసిటీ బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె. కుమారస్వామి, వెంకన్న గౌడ్, ట్రాన్స్కో అధ్యక్ష కార్యదర్శులు ఎం. అశోక్ కుమార్, కె. ప్రవీణ్ మరియు ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు. గతంలో 2014 నుంచి 2026 మధ్యన జరిగిన నియామకాల వివరాలను 15 రోజులుగా బీసీ కమిషన్కు ఇవ్వవలసిందిగా కమిషన్ ఆదేశాలు జారీ చేయడం జరిగింది. వివిధ పెండింగ్ కోర్టు కేసులకు సంబంధించిన వివరాల గురించి సంస్థ ఒక కమిటీ వేసి ఉద్యోగుల ప్రమోషన్లు, సీనియార్టీ మరియు ఇతర అంశాలను పరిశీలించాలని కోరడం జరిగింది. అలాగే 2014 నుండి డైరెక్టర్లుగా పనిచేసిన వారి వివరాలు వారి సామాజిక వర్గంతో సహా కమిషన్కు అందజేయాలని కోరడం జరిగింది. సంస్థలో బిసి సెల్ ఏర్పాటు చేసి తగిన వసతి సౌకర్యాలు కల్పించాలని ఛైర్మన్ గారు ఆదేశించడం జరిగింది. ఈ సమావేశంలో బీసీ కమిషన్ సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రిసెర్చ్ అసోసియేట్ లక్ష్మీ నారాయణ మరియు ఇతర సిబ్బంది కూడా పాల్గొన్నారు.




## కేసీఆర్.. హనుమాన్ జయంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : యావత్ దేశ, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీసీతారామచంద్రమూర్తి భక్తుడుగా, బలం, జ్ఞానం, వాక్చాతుర్యం అన్నీకలిసి, అరుదైన వ్యక్తిత్వం కలిగిన జ్ఞానిగా, హిందూ పురాణాలు హనుమంతుడిని కీర్తిస్తాయని కేసీఆర్ తెలిపారు. సంత్ తులసీదాస్ తన రామచరిత మానస్లో చెప్పినట్టు అంజనీ సుతుడు జ్ఞానినాం అగ్రగణ్యం., అంటే జ్ఞానుల్లో అత్యున్నతుడు..అని కేసీఆర్ పేర్కొన్నారు. వాల్మీకి రామాయణంలో శ్రీరాముడు అన్నట్టు న వాక్యదోషం నచ అపశబ్దం..అంటే., ఎటువంటి దోషాలు లేని భాషతో, ఉచ్చారణతో, వ్యాకరణం మీద పట్టుతో వాక్ శుద్ధితో ప్రసంగించే గొప్ప వక్త హనుమంతుడు అని కేసీఆర్ కొనియాడారు. వారి ఆచరణ ఎల్లకాలం ఆదర్శనీయమని, నేటి యువతరానికి ఆచరణీయమని కేసీఆర్ తెలిపారు. ఆదర్శవంతమైన ఆలోచనలతో, దూరదృష్టితో, తమ జీవితాలను తీర్చిదిద్దుకునే శక్తిని హనుమంతుడు రాష్ట్ర ప్రజలకు అందించాలని, ప్రగతి తిరిగి పుంజుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని కేసీఆర్ ప్రార్థించారు.

మనం Manam



## తొలివసంతంలో వ్రాసిన పంక్తులు

తోటలో నేను వెనక్కొరిగి విశ్రాంతిక కూర్చున్నవేళ,
వేల కలబోతల భిన్నవిభిన్న స్వరాలను విన్నాను;
వసంతమధురధోరణిలోని ఆహ్లాదకరాలోచనలు
నా మనస్సులోకి వేదనాలోచనలనూ తెచ్చాయి!
వసంతానికి సౌందర్య,ప్రేమ,శ్రావ్యతాది సృష్టులు
ప్రకృతిసంబంధంగా జరిగినట్టివి,
అసంతృప్తమైన మనిషి ఆత్మ
నన్ను తోసేసి పరుగెత్తింది
ఇది నా హృదయా న్నెంతో దుఃఖింపజేసి
(సౌందర్య,ప్రేమ,శ్రావ్యతాదుల విధ్వంసం తప్ప)
మనిషి- మనిషి కోసం ఏం సృష్టించాడు? అనీ
నన్నాలోచింపజేసింది!
ఆమనిలో తొట్టతొలుతగ పూచే అడవిపూలచెట్ల
చిగుళ్ల సిగముడులున్న పచ్చని పొదరిళ్ళ ద్వారా,
లాగికట్టినట్లున్న బిళ్ళగన్నేరు పూలగుత్తుల ద్వారా
మరి నా నమ్మక మేమిటంటే ప్రతిపువ్వా గాలిని-
సంతోషానుభూతితో ఊపిరిగా పీల్చుకుంటోంది!
నా చుట్టూ పక్షులు ఎగురతూ ఆడుతున్నాయి,
వాటి ఆలోచనలను నేను కొలవలేను మరి,
కానీ వాటిలో అతితక్కువైన చిన్న కదలిక సైతం-
ఆనందాల పులకరింతగా అగుపిస్తోంది!
హాయిగొలిపే మందపవనాన్ని పట్టుకోవడానికి
క్రొత్తగా పుట్టుకొచ్చిన చెట్లకొమ్మల వింజామరలు
విచ్చుకుని విస్తరించాయి;
నేను ఆలోచించాలి,నాకు
చేతనైనంతగా ఆలోచించి
అక్కడ(తోటలో) ఆనందం
విలసిల్లేదనీ చెప్పాలి!

ఇదంతా స్వర్గం నుండి
పంపబడిం దనే విశ్వాసం
ఉన్నట్లైతే, ఇవన్నీ ప్రకృతిపవిత్రప్రణాళికే అయితే
విలపించడానికి నాకూ కారణం ఉండదా...
(సౌందర్య,ప్రేమ,శ్రావ్యతాదుల విధ్వంసం తప్ప)
మనిషి- మనిషి కోసం ఏం సృష్టించాడు???

ఆంగ్లమూలం : విలియం వర్డ్సువర్త్
**స్వేచ్ఛానువాదం: 'రఘువర్మ'**
9290093933

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# సివిల్స్ కొలువుకు సవాళ్లెన్నో..



దేశ అత్యున్నత పరిపాలనా వ్యవస్థకు వెన్నెముక వంటి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఎంపిక చేసే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాలు ఈసారి ఆనందంతో పాటు అనేక సందేహాలను, చర్చలను రేకెత్తించాయి. ఒకే పేరుతో ఇద్దరు అభ్యర్థులు విజేతలుగా ప్రచారంలోకి రావడం నుంచి, రిజర్వేషన్ల కోటా దుర్వినియోగం వరకు వెలుగులోకి వచ్చిన అంశాలు వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపు తున్నాయి. రాజ్యాంగబద్ధమైన ఈ సంస్థ విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రభుత్వంపై ఉంది. ఇటీవలి కాలంలో ఐపీఎస్ హోదాలో ఉండి కూడా మళ్ళీ పరీక్ష రాస్తూ, కేటగిరీలను మార్చుకోవడం వంటి ఉదంతాలు విస్మయానికి గురిచేస్తున్నాయి. ఒక ఏడాది జనరల్ కేటగిరీలో ఎంపికైన అభ్యర్థి, తర్వాతి ఏడాది ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోటాలోకి ఎలా మారతారనేది మింగుడుపడని ప్రశ్న. గతంలో మహారాష్ట్రకు చెందిన పూజా ఖేద్కర్ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నకిలీ ధ్రువీకరణ పత్రాలు, గిరిజన కోటా పేరిట నగరాల్లో పెరిగిన వారు పేదల హక్కులను హరించడం వంటివి సామాజిక న్యాయానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నాయి. ముఖ్యంగా 73 మంది గిరిజన అభ్యర్థుల్లో 30 శాతం మంది ఒకే తెగకు చెందిన వారు కావడం, రిజర్వేషన్ల ఫలాలు అట్టడుగు వర్గాలకు అందుతున్నాయా లేదా అనే అనుమానాలకు తావిస్తోంది.

సివిల్స్ పరీక్షల్లో ఇంగ్లీష్ మీడియం అభ్యర్థుల ఆధిపత్యం ఏటా పెరుగుతూనే ఉంది. ఈసారి ఎంపికైన వారిలో దాదాపు 95 శాతం మంది ఇంగ్లీష్ మాధ్యమానికి చెందిన వారు కావడం శోచనీయం. ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాసే వారి సంఖ్య కేవలం ఐదు శాతానికే పరిమితం కావడం మాతృభాషలో చదువుకున్న గ్రామీణ విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. మరోవైపు, ఇంటర్వ్యూ మార్కులలో కనిపిస్తున్న భారీ వ్యత్యాసాలు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. రాత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు సాధించని వారు కూడా ఇంటర్వ్యూలో 65 శాతానికి పైగా స్కోర్ చేయడం వెనుక ఉన్న హేతుబద్ధత ఏమిటో యూపీఎస్సీ స్పష్టం చేయాలి. దేశంలో తలసరి వైద్యుల లభ్యత అత్యల్పంగా ఉన్న తరుణంలో, కోట్లాది రూపాయల ప్రజా ధనంతో తయారైన ఎంబీబీఎస్ వైద్యులు సివిల్స్ వైపు పరుగులు తీయడం దేశ నిర్మాణ ప్రక్రియపై ప్రభావం చూపుతుంది. అలాగే ఐఐటీల వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి వచ్చిన ఇంజనీర్లు తమ మూల సబ్జెక్టులను వదిలేసి ఆంత్రోపాలజీ, సోషియాలజీ వంటి అంశాలను ఐచ్ఛికాలుగా ఎంచుకోవడం చూస్తుంటే, మన విద్యా వ్యవస్థ, సివిల్స్ పరీక్షా నిర్మాణం మధ్య సమన్వయం




లోపించిందని స్పష్టమవుతోంది. ఇది మేధో వలసను ప్రోత్సహించడమే కాక, ప్రత్యేక నైపుణ్యాలు గల వ్యక్తులు ఆయా రంగాలకు దూరం కావడానికి కారణమవుతోంది. 1979లో ఏర్పాటైన దౌలత్ సింగ్ కొఠారి కమిటీ సిఫార్సులు నేటి ఆధునిక కాలానికి ఎంతవరకు సరిపోతాయనేది లోతుగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. పెరుగుతున్న సాంకేతికత, మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక ప్రక్రియలో సమూల మార్పులు రావాలి. అధికారుల్లో కేవలం మేధస్సు మాత్రమే కాదు.. ప్రజా సేవ పట్ల అంకితభావం, నిజాయితీ, సరళత ఉండేలా ఎంపిక విధానాన్ని రూపొందించాలి. వ్యవస్థపై సామాన్యుడికి ఉన్న నమ్మకాన్ని కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలి.

మరోపక్క సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విజయం సాధించి, దేశ సేవకు సిద్ధమవు తున్న అభ్యర్థులకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. 2025 సివిల్ సర్వీసెస్ ఫలితాల అనంతరం ఎంపికైన అభ్యర్థుల కోసం కమిషన్ ఒక వివరణాత్మక సలహాను విడుదల చేస్తూ, సోషల్ మీడియా వినియోగంపై కఠిన నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం పెరిగిన నేపథ్యంలో, కొత్తగా ఎంపికైన అధికారులు తమ వ్యక్తిగత బ్రాండింగ్ కోసం వెంపర్లాడటంపై కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆవేశపూరిత ప్రకటనలు, స్వీయ ప్రచారానికి దూరంగా ఉండాలని సూచించింది. వృత్తివిరుద్ధమైన ప్రవర్తన కేవలం వారి వ్యక్తిగత సర్వీసునే కాకుండా, మొత్తం వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తుందని హెచ్చరించింది. ప్రజా సేవలో నిష్పక్షపాతం, నిజాయితీ, సంయమనం అత్యంత కీలకమని, ఆ విలువలను కాపాడుకోవాలని గుర్తు చేసింది.

ప్రతి ఏటా ఫలితాలు రాగానే కోచింగ్ సంస్థలు టాపర్ల ఫోటోలను తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం.. సర్వసాధారణమై పోయింది. ఈ ధోరణిని అరికట్టేందుకు యూపీఎస్సీ ఈసారి మరింత పకడ్బందీగా వ్యవహరిస్తోంది. అభ్యర్థులు తమ విజయాలను వాణిజ్య సంస్థల ప్రచారం కోసం ఉపయోగించుకోనివ్వకూడదు. 'ఎటువంటి సంస్థాగత సిఫార్సులకైనా వృత్తిపరమైన దూరం పాటించడం వివేకం' అని కమిషన్ స్పష్టం చేసింది. గ

త కొన్నేళ్లుగా కొంతమంది అభ్యర్థులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో సెలబ్రిటీ హోదాను కోరుకుంటూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా కోచింగ్ సెంటర్ల ప్రకటనల్లో భాగస్వాములు కావడం, తప్పుడు సంకేతాలు పంపడం వంటి అంశాలను సీరియస్‌గా తీసుకున్న అధికారులు, అభ్యర్థులు విధుల్లో చేరకముందే వారి బాధ్యతను గురుతుచేయాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. పారదర్శకతను పెంచడం ద్వారానే ఏ సంస్థ ప్రతిష్ట అయినా నిలబడుతుంది. కాబట్టి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పారదర్శకతను పెంచాల్సిన వసరం ఎంతైనా ఉంది. పూజా ఖేద్కర్ వంటి ఉదం తాలు పునరావృతం కాకుండా ఉండాలంటే, అభ్యర్థులు సమ ర్పించే కుల, ఆర్థిక, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను కేవలం కాగితాల మీద కాకుండా, క్షేత్రస్థాయిలో డిజిటల్ డేటాబేస్ ద్వారా క్రాస్-వెరిఫై చేయాలి. ఇంగ్లీష్ మీడియం ఆధిపత్యాన్ని తగ్గించడానికి, ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాసే వారికి ప్రశ్నపత్రాల అనువాదంలో లోపాలు లేకుండా చూడాలి. ఇంటర్వ్యూలలో అనువాదకుల నాణ్యతను పెంచి, గ్రామీణ అభ్యర్థుల్లో ఆత్మ విశ్వాసం నింపాలి. డాక్టర్లు, ఇంజనీర్లు తమ వృత్తిని వదిలి రావడం వల్ల దేశానికి జరుగుతున్న మేధో నష్టం పై అధ్యయనం చేయాలి. సిలబస్ను మార్చి, అభ్యర్థులు తమ మౌలిక సబ్జెక్టులను ఎంచుకునేలా ప్రోత్సహించాలి. ఇంటర్వ్యూ మార్కులలో ఉండే భారీ వ్యత్యాసాలను తగ్గించడానికి శాస్త్రీయమైన పద్ధతులను అవలంబించాలి. రాత పరీక్షలో ప్రతిభ చూపిన వారు ఇంటర్వ్యూలో వెనుకబడటానికి గల కారణాలను విశ్లేషించాలి.

ఎంపికైన అధికారులు..అధికారం అనేది హోదా కాదు, అది ఒక బాధ్యత అని గుర్తించాలి. సోషల్ మీడియాలో 'ఇన్‌ఫ్లూయెన్సర్' కావాలనే కోరికను పక్కన పెట్టాలి. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు వచ్చే గుర్తింపు శాశ్వతం. రిజర్వేషన్లు అనేవి సామాజిక న్యాయం కోసం ఉద్దేశించినవి. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మరొక అర్హుడి అవకాశాన్ని లాక్కోవడం రాజ్యాంగ విరుద్ధమే కాదు, అనైతికం కూడా. సివిల్స్ అభ్యర్థులు..ఎంచుకున్నది 'ఉద్యోగం' కాదు, 'సేవ' అనే విషయం మరువరాదు.

టాపర్లుగా నిలిచినప్పుడు వాణిజ్య ప్రకటనలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారకుండా, సివిల్స్ అభ్యర్థులు తమ విజయాన్ని కేవలం మార్గదర్శకత్వానికే పరిమితం చేయాలి. కేవలం సివిల్స్ మాత్రమే అత్యున్నతమైనది అనే భావనను మార్చి, వైద్యం, పరిశోధన, ఇంజనీరింగ్ రంగాల్లో కూడా సమానమైన గౌరవం, అవకాశాలు కల్పించాలి. రిజర్వేషన్ల ఫలాలు అట్టడుగున ఉన్న గిరిజన, దళిత వర్గాలకు అందుతున్నాయా లేదా అనే అంశంపై ప్రభుత్వం 'క్రీమీ లేయర్' లేదా అంతర్గత రిజర్వేషన్ల వంటి అంశాలపై తటస్థ చర్చ జరపాలి. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దేశానికి ఉక్కు చట్రం వంటి వారు. ఆ చట్రం తుప్పు పట్టకుండా ఉండాలంటే ఎంపిక ప్రక్రియలో కఠినత్వం, అధికారుల ప్రవర్తనలో నిరాడంబరత ఉండాలి.

**- పసుపులేటి . శ్రీలక్ష్మి**
9100365111

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి


డెన్మార్క్ దేశానికి చెందిన ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత హాన్స్ క్రిస్టియన్ ఆండర్సన్ ఏప్రిల్ 2 1805 న జన్మించాడు. ఆయన పుట్టిన రోజును అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవంగా ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్ (IBBY) అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది. 1967 నుంచి అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.

'చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ తదితరాలు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు.

మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుది వరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి' పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం' హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాల లాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వసాహిత్యాన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు




ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించుకున్నాక, ప్రపం చంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది.

ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తదితర విశ్వ విద్యాలయాలలో భద్రపరచబడి, కొన్ని విదేశీ దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విషాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధమయ్యే సౌలభ్యం ఏర్పడింది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర ఒకటేమిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# సరఫరాలో కనిపించని శ్రమ

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ ప్రసరణ వ్యవస్థను నిర్వహిస్తున్న ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సంస్థ రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఈ సంస్థ ప్రసరణ ఒప్పందిత సామర్థ్యం 22,510.68 మెగావాట్లు. రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుండి పంపిణీ సంస్థలకు విద్యుత్‌ను సురక్షితంగా, నిరంతరంగా సరఫరా చేస్తూ కీలక బాధ్యతను నిర్వహిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, సాగునీటి పథకాలు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా వంటి కార్యక్రమాలన్నీ ఈ సంస్థ పనితీరుపైనే ఆధారపడి ఉన్నాయి.

ఈ సంస్థ గతంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. 2024లో దేశంలోనే ఉత్తమ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (SLDC)గా అవార్డు అందుకోవడం, 2018లో స్కోచ్ కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డు సాధించడం సంస్థ సామర్థ్యాన్ని చాటుతున్నాయి. 2026 మార్చి 27న తెలంగాణలో అత్యధికంగా 18548 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించడం కూడా ఈ సంస్థ శక్తిని తెలియజేస్తోంది. సాంకేతిక పనితీరు పరంగా పరిశీలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రసరణ నష్టాలు అనుమతించబడిన స్థాయి 2.48 శాతం ఉండగా, వాస్తవంగా అవి 2.19 శాతానికి మాత్రమే పరిమితమయ్యాయి. అలాగే ప్రసరణ వ్యవస్థ అందుబాటు శాతం గత రెండు సంవత్సరాల్లోనూ అనుమతించబడిన 99.9 శాతానికే సమానంగా 99.9 శాతంగా కొనసాగడం గమనార్హం. ఈ గణాంకాలు సంస్థ సాంకేతికంగా అత్యుత్తమ పనితీరును ప్రదర్శిస్తూ, రాష్ట్రానికి నాణ్యమైన మరియు నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తున్నదని నిరూపిస్తున్నాయి.

తాజా వార్షిక టారిఫ్ వినతిపత్రంలో వెల్లడైన గణాంకాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంస్థకు 3,138.99 కోట్లుగా అంచనా వేసిన మొత్తం వ్యయ అవసరం ఉండగా, వాస్తవ వ్యయం 2,603.65 కోట్లకే పరిమితమైంది. అదే సమయంలో సంస్థకు వచ్చిన ఆదాయం 3,994.



41 కోట్లకు చేరడంతో మొత్తం 1,390. 76 కోట్ల అధిక నిల్వ నమోదైంది. మొదట ఈ గణాంకాలు సంస్థ ఆర్థికంగా బలంగా ఉన్నదనే భావన కలిగించినా, లోతుగా పరిశీలిస్తే ఈ అధిక నిల్వ ప్రధానంగా ఖర్చుల తగ్గింపుల వల్ల వచ్చినదని స్పష్టమవుతుంది. ప్రత్యేకంగానిర్వహణ, సంరక్షణ వ్యయాలు గణనీయంగా తగ్గాయి. 1,299.52 కోట్ల నుంచి 1,135.01 కోట్లకు పడిపోవడంతో 164.50 కోట్ల తగ్గుదల నమోదైంది. ఇందులో ఉద్యోగులపై ఖర్చు 1123.60 కోట్ల నుంచి 1005.50 కోట్లకు తగ్గడం, అలాగే మరమ్మత్తులు, సంరక్షణ ఖర్చులు 111.14 కోట్ల నుంచి 55.01 కోట్లకు పడిపోవడం గమనార్హం. ఈ గణాంకాలు సంస్థలో ఖాళీలు భర్తీ కాకపోవడం, కొత్త నియామకాలు జరగకపోవడం, నిర్వహణ పనులు తగ్గించడం వంటి అంశాలను స్పష్టంగా సూచిస్తున్నాయి. ఇక మరో వైపు, సంస్థ భారీ స్థాయిలో విస్తరణ కార్యక్రమాలను కొనసాగిస్తోంది. 2026-27 సంవత్సరానికి 4,432.61 కోట్ల పెట్టుబడులు ప్రతిపాదించబడినాయి. అధిక వోల్టేజ్ లైన్లు, ఉపకేంద్రాలు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన విద్యుత్ వ్యవస్థలు వంటి అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అయితే ఈ విస్తరణకు సరిపడా మానవ వనరులు లేకపోతే, వ్యవస్థ నిర్వహణ, భద్రత, పనితీరు వంటి అంశాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో మానవ వనరుల ప్రాముఖ్యతను విస్మరించడం తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఉన్న సిబ్బందితోనే ఎక్కువ పనులు చేయించడం లేదా సిబ్బంది సంఖ్యను తగ్గించడం వల్ల ఉద్యోగులపై పని భారం పెరగడం, ప్రమాదాల అవకాశాలు అధికమవడం, భవిష్యత్తులో నైపుణ్య లోటు ఏర్పడే పరిస్థితులు తలెత్తవచ్చు.

ముఖ్యంగా సహాయక ఇంజనీర్ స్థాయి ఉద్యోగులు సంస్థకు ప్రధాన స్తంభాలుగా ఉంటారు. ఫీల్డ్ స్థాయిలో నిర్వహణ, లోపాల నివారణ, వ్యవస్థ స్థిరత్వం వంటి కీలక పనులన్నీ వీరి పైనే ఆధారపడి ఉంటాయి. వీరి లోటు ఏర్పడితే వ్యవస్థ పనితీరు క్రమంగా క్షీణించే అవకాశం ఉంది. అందువల్ల తాత్కాలికంగా ఖర్చులను తగ్గించడం ద్వారా లాభాలను చూపించడం కన్నా, సమయానుకూలంగా అన్ని స్థాయిలలో నియామకాలు చేపట్టడం అత్యవసరం. ముఖ్యంగా సహాయక ఇంజనీర్ స్థాయిలో నియామకాలు చేపట్టడం అవసరం. లేని పక్షంలో భవిష్యత్తులో పనితీరు క్షీణత, ఆర్థిక ఒత్తిడి, సేవల నాణ్యత తగ్గుదల వంటి సమస్యలు తలెత్తి సంస్థ స్థిరత్వం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇది క్రమంగా ప్రైవేటీకరణకు దారితీసే పరిస్థితులను సృష్టించవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యుత్ అనేది ప్రతి పరిశ్రమ, వ్యవసాయం, సేవా రంగం అభివృద్ధికి ప్రాథమిక ఆధారం. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వృద్ధి మొత్తం విద్యుత్ రంగంపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పంపిణీ సంస్థలకు నిరంతర సరఫరా కొనసాగాలంటే ప్రసరణ వ్యవస్థ బలంగా ఉండటం అత్యవసరం. ఈ నేపథ్యంలో ఈ సంస్థ స్థిరత్వం కేవలం ఒక సంస్థ ప్రయోజనం కాకుండా, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అవసరమైన అంశం.రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఈ కీలక సంస్థను బలోపేతం చేయడానికి మానవ వనరులపై తక్షణ దృష్టి పెట్టి, నియామకాలు చేపట్టడం అత్యంత అవసరం.

**- గువ్వల పవన్ కుమార్**
ప్రసిడెంట్, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్

# డబ్బుతో నిద్రను కొనలేం




కళ్ళు మూసుకుని ప్రశాంతంగా కూర్చుని, నా మనసు ఇప్పుడు కుదురుగా ఉందా? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకున్నారా? దురదృష్టవశాత్తు, మనలో చాలామందికి ఆ ప్రశ్నకు సమాధానం వెతికే తీరిక కూడా లేదు. మనం ఎంత వేగంగా బతుకుతున్నామంటే, మన నీడ కూడా మనల్ని అందుకోలేనంత ఆత్రుతగా పరిగెడుతున్నాం. ఈ పరుగు పందెంలో మనం కోల్పోతున్నది ఖచ్చితంగా మనశ్శాంతి మాత్రమే. కానీ విచిత్రమేమిటంటే, మనం దాని కోసం కాకుండా, దానికి అడ్డుపడే వస్తువుల కోసమే జీవితాంతం శ్రమిస్తాం. శాంతి అనేది బయటి మార్కెట్లో దొరికే వస్తువు కాదు, అది మీ లోపలి నిశ్శబ్దం నుండి జనించే ఒక సహజ ప్రక్రియ. ఈ మాట వినడానికి కొంచెం కఠినంగా ఉన్నా నిజం డబ్బు జీవితాన్ని సులభం చేస్తుంది కానీ సుఖమయం చేయలేదు. పేదరికంలో ఉండి శాంతి గురించి మాట్లాడటం ఆచరణాత్మకం కాదు. ఆకలి కడుపుతో ఉన్నవాడికి ఆకలి తీరడమే పెద్ద శాంతి. కానీ, ఒక స్థాయి దాటిన తర్వాత మరిన్ని కోట్లు రావడం వల్ల మరింత శాంతి వస్తుందా? అక్కడే అసలు చిక్కు ఉంది. నేటి ప్రపంచంలో లక్షల కోట్లు ఉన్న కుబేరులు కూడా నిద్రపట్టక నిద్రమాత్రలపై ఆధారపడుతున్నారు. కోటి రూపాయల పడకను కొనవచ్చు కానీ, కంటి నిండా నిద్రను కొనలేం. పోయిన ఆరోగ్యాన్ని, ముక్కలైన బంధాలను తిరిగి అతికించడానికి నోట్ల కట్టలు సరిపోవు. అందుకే Money can buy a bed, but not sleep అన్న ఆంగ్ల సామెత నిత్యసత్యం. మన పెద్దలు ఒక విచిత్రమైన మాట అంటుంటారు పిచ్చివాడు తనలో తాను సుఖంగా ఉంటాడు, కానీ జ్ఞాని లోకపు బాధలతో దుఃఖపడతాడు అని. అయితే నిజమైన జ్ఞాని ఎప్పుడూ కుంగిపోడు, అతను స్వీకరణ అనే అస్త్రాన్ని ధరిస్తాడు. మనసు ప్రశాంతంగా ఉండాలంటే మనల్ని మనం లోతుగా అర్థం చేసుకోవాలి. అసలు మన భయాలేమిటి? మన అసంతృప్తికి మూలం ఎక్కడ ఉంది? పక్కవాడి ఎదుగుదల చూసి మనం ఎందుకు చిన్నబోతున్నాం? ఇలాంటి ప్రశ్నలకు నిజాయితీగా జవాబులు వెతికినప్పుడే శాంతి వైపు మొదటి అడుగు పడుతుంది. ఈ ప్రపంచంలో మనం అనుకున్న వన్నీ జరగవు. కొన్ని ఓటములు కూడా ఎదురవుతాయి. కొన్ని ఆత్మీయ బంధాలు అర్థాంతరంగా వీడిపోతాయి. కొన్నిసార్లు అన్యాయం జరుగుతుంది. వీటిని ఇలా ఎందుకు జరిగింది? అని నిరంతరం ప్రశ్నిస్తూ కూర్చుంటే మనసు చిందరవందర అవుతుంది. ఇవన్నీ జీవితంలో భాగమని అంగీకరించిన మరుక్షణం మనసు ఒక నిశ్చలమైన సరస్సులా మారిపోతుంది. గౌతమ బుద్ధుడు లోకానికి ఇచ్చిన గొప్ప సందేశం వర్తమానం లో జీవించడం . మన మెదడు ఎప్పుడూ గతంలో జరిగిన తప్పుల గురించి కుమిలిపోతూ ఉంటుంది, లేదా భవిష్యత్తులో ఏం జరుగుతుందో అనే భయంతో వణికిపోతూ ఉంటుంది. ఈ రెండింటి మధ్య ప్రస్తుతం అనే అందమైన క్షణం నలిగిపోతోంది. ఒక చిన్నారి నవ్వులో ఉండే స్వచ్ఛతను చూసి మురిసిపోవడానికి, సాయంత్రం వేళ ఆకాశంలోని రంగులను ఆస్వాదించడానికి, పడుతున్న వర్షపు చినుకుల సవ్వడిని వినడానికి ఏ బ్యాంక్ బ్యాలెన్స్ అవసరం లేదు. కేవలం ఆ క్షణంలో అక్కడ మీరు ఉంటే చాలు. ఇతరుల జీవితాలతో మనల్ని మనం పోల్చుకోవడం ఒక మానసిక వ్యాధిలా మారుతోంది. వాళ్ళు అంత ఖరీదైన కారు కొన్నారు, వాళ్ళు స్విట్జర్లాండ్ వెళ్లారు, వాళ్ళ జీవితం ఎంత కలర్‌ఫుల్‌గా ఉంది అనే భ్రమలో పడి మన దగ్గర ఉన్న అద్భుతమైన జీవితాన్ని తక్కువ చేసుకుంటున్నాం. అంతేకాదు, 24 గంటల వార్తా ఛానళ్లు, రాజకీయ గొడవలు, ప్రపంచ దేశాల మధ్య యుద్ధ భయాలు ఇవన్నీ మన ప్రమేయం లేకుండానే మన మెదడులోకి చొరబడి నిరంతరం ఆందోళనను పెంచుతున్నాయి. అందుకే ప్రతిరోజూ కనీసం 20 నిమిషాల పాటు గ్యాడ్జెట్స్‌ను పక్కన పెట్టి, కేవలం మీతో మీరు గడపండి. అది ధ్యానం కావచ్చు, పుస్తక పఠనం కావచ్చు లేదా కనీసం ఏమీ చేయకుండా మౌనంగా కూర్చోవడం కావచ్చు. ఇది విలాసం కాదు, ఇది మీ మానసిక ఆరోగ్యానికి అత్యవసరమైన ఆహారం. మనశ్శాంతి అనేది అదృష్టవశాత్తు వచ్చేది కాదు, అది మనం నిర్మించుకోవాల్సింది. దానికి మూడు బలమైన పునాదులు అవసరం బంధాల బలం మనం ఎంత సంపాదించినా, తిరిగి ఇంటికి వచ్చినప్పుడు ప్రేమగా పలకరించే మనుషులు లేకపోతే ఆ సంపాదనంతా వ్యర్థమే. మీ కుటుంబానికి, మీ ప్రాణస్నేహితులకు సమయాన్ని కేటాయించండి. అది మీరు మీ కోసం చేసుకునే అతిపెద్ద ఇన్వెస్ట్‌మెంట్. నిస్వార్థ సేవ మనకన్నా కష్టాల్లో ఉన్నవారికి ఒక చిన్న సహాయం చేసినప్పుడు కలిగే తృప్తి వెలకట్టలేనిది. ఒక ఆకలి తీర్చడం లేదా ఒకరికి దారి చూపడం వల్ల కలిగే పాజిటివ్ ఎనర్జీ మీ మనసులోని ఒత్తిడిని మాయం చేస్తుంది. కరుణ ఉన్న చోట అశాంతి నిలవదు. కృతజ్ఞత మన దగ్గర లేని వస్తువుల జాబితాను తయారు చేయడం మానేసి, మన దగ్గర ఉన్న వనరులకు కృతజ్ఞత తెలపడం నేర్చుకోవాలి. ఈ రోజు మనం క్షేమంగా నిద్రలేచాం, మనకు తిండి దొరుకుతోంది, మనకు తోడుగా కొందరు ఉన్నారు ఈ ప్రాథమిక విషయాలే గొప్ప అదృష్టాలు అని గుర్తించినప్పుడు, అశాంతికి తావుండదు. మహాత్మా గాంధీ గారు ఒక అద్భుతమైన మాట చెప్పారు ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరి అవసరానికి సరిపడా వనరులు ఉన్నాయి, కానీ ఒక్కడి దురాశకు సరిపడా కూడా లేవు. ఇది మనసుకు కూడా వర్తిస్తుంది. మన అవసరాలు తక్కువ కొంచెం ప్రేమ, కొంత గౌరవం, కాస్త ఆరోగ్యం. కానీ మన దురాశలు అనంతం మరింత అధికారం, మరింత డబ్బు, మరింత కీర్తి. ఈ మరింత అనే తపన మనల్ని ఎప్పటికీ శాంతిగా ఉండనివ్వదు. మిత్రమా! మనశ్శాంతి అనేది ఏదో హిమాలయాల్లోనో లేదా ఖరీదైన ఆశ్రమాల్లోనో దొరికే వస్తువు కాదు. అది ఒక మొబైల్ యాప్ కాదు డౌన్లోడ్ చేసుకోవడానికి. అది మీ అంతరంగంలోనే నిగూఢంగా ఉన్న ఒక నిధి. ఈ క్షణమే ఒక్కసారి లోతైన శ్వాస తీసుకోండి. పక్కనే ఉన్న ఫోన్ను కొద్దిసేపు దూరంగా పెట్టండి. మీరు ఎక్కడ ఉన్నారో, ఆ ప్రదేశాన్ని పూర్తిగా అనుభూతి చెందండి. లోపల ఉండే ఆ నిశ్శబ్దాన్ని వినడానికి ప్రయత్నించండి. అక్కడే ఉంది మీరు వెతుకుతున్న శాంతి. గుర్తుంచుకోండి శాంతం పరమం సుఖం. ప్రపంచాన్నంతా జయించినా మనసును గెలవలేకపోతే మీరు ఓడిపోయినట్లే. ఈ రోజే, ఇప్పుడే ఆ శాంతి వైపు మీ పయనాన్ని మొదలుపెట్టండి.

**- డా. సూర్యదేవర రామకృష్ణ**
9490754169

# అందరికీ అండగా ప్రజా ప్రభుత్వం

- త్వరలో ఇందిరమ్మ భీమా పథకం అమలు చేస్తాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ,ఏప్రిల్ 2(మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా గురువారం గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించగా, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామం గ్రామ సభ, వేములవాడ పట్టణంలోని 25 వార్డులో ₹వార్డు సభ₹ లు నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. వ్యవసాయ యాంత్రీకరణ కింద పలు యంత్రాలను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. చెక్కపల్లి గ్రామం, వేములవాడ పట్టణంలోని 25 వార్డులో ఆరు గ్యారంటీల అమలు, వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందుతున్న వారి వివరాలు చదివి వినిపించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు రుణ మాఫీ, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్లు, ఇతర ప్రభుత్వ పథకాలతో లబ్దిపొందుతున్న వారు తమకు జరుగుతున్న మేలు వివరించారు. వివిధ పథకాల ద్వారా ఆదా అవుతున్న డబ్బులను తమ పిల్లల ఉన్నత చదువులకు, పొదుపు వైపు మళ్ళిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు అండగా ఉన్నారని తెలిపారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలిచిందని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కోటి 15 లక్షల మంది రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు త్వరలో 5 లక్షల జీవిత బీమా కల్పించనున్నామని పేర్కొన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డు ఇస్తున్నామని వివరించారు. రూ.14, 600 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో రేషన్ కార్డు దారులకు సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇటీవల సన్న బియ్యం పంపిణీ చేసి సంవత్సరం అయిన సందర్భంగా అసెంబ్లీ లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు సన్నం బియ్యంతో భోజనం చేశారని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం... వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో వంగ హారిక ఇందిరమ్మ ఇల్లు పూర్తి కాగా, గృహ ప్రవేశ వేడుకకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్దిదారుకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, జిల్లా పంచాయతి అధికారి షర్ఫుద్దీన్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చెక్కపెల్లి సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా స్థాయి రీడింగ్ ఛాంపియన్షిప్ పోటీలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఏప్రిల్ 02 (మనం ప్రతినిధి):** జిల్లాస్థాయి రీడింగ్ ఛాంపియన్షిప్ పోటీలు ఘనంగా జరిగాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రీడింగ్ కాంపిటీషన్ 2026 లో మంచి ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎఫ్.ఎల్.ఎన్ లో భాగంగా గురువారం జిల్లా పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 14 మండలాల నుంచి 22 మంది విద్యార్థులు ఈ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని, విద్యార్థులకు తెలుగు ఆంగ్లం ఉర్దూ భాషల్లో ధారాళంగా చదవడం కథలు చెప్పడం వంటి అంశాలలో పోటీలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రీడింగ్ చాంపియన్షిప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రీడింగ్ కాంపిటీషన్ నిర్వహించి పిల్లలకు బహుమతులు అందించాలని వినూత్నంగా ఆలోచించిన ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ ఉండాలని అప్పుడే వారు మంచి విజయాలు సాధిస్తారని కలెక్టర్ సూచించారు. సబ్జెక్టుల వారిగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి బహుమతులు జ్ఞాపికలు ప్రశంస పత్రాలను అందిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పిఎం షేక్ జిల్లా రిసోర్స్ టీం అధికారి గడ్డం జగదీశ్వర్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల ఏప్రిల్ 02 (మనం ప్రతినిధి):** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గత 24 నెలల కాలంలో నేరెళ్ల గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 134.90 కోట్ల నిధులు అందించామని తెలిపారు. రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతున్నదని మంత్రి వివరించారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో ఉదయం టిఫిన్ సౌకర్యం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో ఆర్థిక భారం తగ్గించేందుకు ఇందిరమ్మ జీవిత ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి.రాజ గౌడ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, డి ఆర్ డి ఓ రఘువరన్, గ్రామ సర్పంచ్ బాల గౌడ్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. నేరెళ్ల గ్రామంలో రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. పేద మరియు గ్రామీణ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## చిన్న హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**జగిత్యాల, ఏప్రిల్ 2( మనం ప్రతినిధి ):** చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా జగిత్యాల రూరల్ మండలం చల్గల్ గ్రామంలో జరిగిన వేడుకలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలం అంతర్గం గ్రామంలో చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయంలో ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా మంజూరైన హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం రూ. 5 లక్షలు,మడేలేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కొరకు రూ. 3 లక్షల ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నిర్వాహక సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక



- 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ అభివృద్ధికి చర్యలు

**రామగిరి, ఏప్రిల్ 02 (మనం న్యూస్):** ప్రజల భాగస్వామ్యంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరిట ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తుందని అన్నారు. 99 రోజుల స్పెషల్ ప్రోగ్రాం క్రింద పారిశుధ్య నిర్వహణ, పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, వైద్యశాఖ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు, రోడ్డు భద్రత పై అవగాహన, వ్యవసాయం , మహిళా సంక్షేమం వంటి వివిధ రంగాలపై ప్రత్యేక కార్యక్రమాలు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టే కార్యక్రమాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు నేడు గ్రామ సభ నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల సంబంధించి ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాల ను ప్రభుత్వానికి అందించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో గ్రామపంచాయతీ ఎన్నికలు విజయవంతంగా ముగిసి పాలక వర్గాలు ఏర్పడ్డాయని, 15 వ ఆర్థిక సంఘం సంబంధించి పెండింగ్ నిధులు ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు.గ్రామాల వద్ద అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ అవసరాల మేరకు చేపట్టాలని, గ్రామ సభ కార్యక్రమంలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు అనే అంశం పై చర్చించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికులకు ఎపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

- ఆర్టిజన్స్, అన్ మ్యాన్ కార్మికుల ధర్నా



**పెద్దపల్లి, ఏప్రిల్ 02 (మనం న్యూస్):** తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్, అన్ మ్యాన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిజన్స్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్ రద్దు చేసి ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, అన్ మ్యాన్ కార్మికులను ఆర్టిజన్స్ గా గుర్తించి సంస్థలో విలీనం చేసుకోవాలని, మీటర్ రీడర్స్ మిగిలి ఉన్న పీస్ రేటు కార్మికులు అందరికీ (జీ ఓ 11)ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో రెండుసార్లు సర్కిల్ ఆఫీస్ ముందు వంట వార్పు నిర్వహించి నిరసన తెలిపిన యాజమాన్యం నుండి ఏలాంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం తక్షణమే మా డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 7 న టీజీఎన్పీడిసిఎల్ కంపెనీ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అప్పటికి యాజమాన్యం స్పందించకుంటే ఈనెల 8 నుంచి నిరవధిక సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఆందోళనలో ఆర్టిజన్ జేఏసీ జిల్లా చైర్మెన్ మల్ల కిషన్ రెడ్డి, ఎల్లయ్య, దాసరి కోటి, గోపతి తిరుపతి, ఆది కొండల్, రాపోలు సురేష్, ఖలీం, భాస్కర్, అన్ మ్యాన్ జిల్లా అధ్యక్షులు ఇరుగురాల రమేష్, వెంకటేష్, హాజర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు

- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక గొప్ప కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్




**జగిత్యాల ఏప్రిల్ 02( మనం ప్రతినిధి):** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక గొప్ప కార్యక్రమం అని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలోని జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామ సభను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. అలాగే వీడియోను ప్రదర్శించారు. అనంతరం ఈ కార్యక్రమంలో గ్రామముకు సంబంధించి వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం - ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ పథకాల లబ్ధిదారులు ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను తెలియజేస్తూ.. ప్రజా ప్రభుత్వంలో నిరుపేద లైన తమకి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి. నరేష్, డి.పి.ఆర్.వో పి.నరేష్, తహసీల్దార్ వరందన్, ఎంపిడివో రమా దేవి , గ్రామ సర్పంచ్ శంకరయ్య, వివిధ స్థాయిల ప్రజా ప్రతినిధులు, వివిధ స్థాయిల అధికారులు, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో కంటి శాస్త్ర చికిత్సలు ప్రారంభం



- మొదటి కాట్రెక్ సర్జరీ విజయవంతంగా నిర్వహణ

**పెద్దపల్లి, ఏప్రిల్ 02 (మనం ప్రతినిధి):** గోదావరిఖని (రామగుండం)జనరల్ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్సలను ప్రారంభించామని, అవసరమైన ప్రజలు వీటిని వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆప్తామాలజిస్ట్ విభాగం లో శస్త్ర చికిత్సలను బుధవారం ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. ఆప్తమాలజిస్ట్ డాక్టర్ గోపికృష్ణ ఆధ్వర్యంలో నిన్న ఒక కాట్రేక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రజలు, గోదావరిఖని పరిసర ప్రాంతాల ప్రజలు కాట్రేక్ ఆపరేషన్లు అవసరం అయితే గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి రావాలని, ఇక్కడ అవసరమైన అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## ప్రత్యేక గ్రామ సభలో పాలు పంచుకున్న విద్యుత్ శాఖ




**జగిత్యాల ఏప్రిల్ 02(మనం న్యూస్):** 99 రోజుల ప్రగతి ప్రణాళికలో బాగంగా ప్రతీ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల అనుసారం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభలకు గ్రామ సర్పంచి అధ్యక్షత వహించగా అన్ని శాఖల అధికారులు గ్రామ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వాటి లబ్ది గురించి వివరించారు , కార్యక్రమంలో భాగంగా గుల్లపేట గ్రామంలో జరిగిన కార్యక్రమానికి జగిత్యాల జిల్లా సూపరింటెండ్ ఇంజనీర్ సుదర్శనం హాజరు అయ్యి విద్యుత్ శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు 200యూనిట్లు ఉచిత విద్యుత్ గృహ జ్యోతి , అగ్రికల్చర్ సర్వీసులకు కేవలం రోజుకు 1రూపాయికే నిరంతర విద్యుత్తు , గత నెల విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదించి అందిస్తున్న కేవలం ఎస్ ఎల్ సి చార్జి కట్టినట్టు ఐతే 1 కి.మీ లోపు లైన్లు , ట్రాన్స్ఫార్మర్లు ఉచితంగా అందిస్తున్నామని , ఏప్రిల్ 1వ తేదీ నుండి విద్యుత్ ప్రమాదాల వల్ల 5లక్షల రూపాయల ఎగ్జ్రేషియా 8లక్షల రూపాయలకు పెంచడం జరిగింది అని తెలుపుతూ , ప్రజలందరూ విద్యుత్ పరికరాలతో జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా ఈ వేసవిలో ఇనుప కూలర్లు ఎర్తింగ్ చేయించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని , ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్న 1912 టోల్ ఫ్రీ నంబరు కి పిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ గంగారామ్ మరియు సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ స్వీపింగ్ కార్మికులను తొలగించడం చాలా అన్యాయం

- రోడ్డున పడ్డ దళిత మహిళ కార్మిక కుటుంబాలు



**మంథని, ఏప్రిల్ 2 (మనం న్యూస్):** ఆర్టీసీ యాజమాన్యం తొలగించిన స్విపింగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి పిఏ ఆకుల చంద్రశేఖర్ కు స్వీపింగ్ కార్మికులతో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ మంథని పట్టణంలోని ముత్యాలమ్మ వాడకు చెందిన నిరుపేద దళిత మహిళలు గత 20 సంవత్సరాలుగా ఆర్టీసీ డిపో,బస్టాండ్ ప్రాంగణంలో స్లీపింగ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగాల కుదింపు పేరుతో ఆర్టీసీ యాజమాన్యం కార్మికులను తొలగించడం చాలా అన్యాయమని అన్నారు.అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ పనిచేస్తున్న కార్మికులను తొలగించడం సరికాదన్నారు.దీంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, దిక్కు దోచని స్థితిలో నిరుపేద దళిత కార్మిక కుటుంబాలు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు వెంటనే స్పందించి నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన మహిళ కార్మికులను విధుల్లోకి తీసుకొని యధావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏల్పుల సురేష్, కెవిపిఎస్ నాయకులు మంథని లింగయ్య, డివైఎఫ్ఐ నాయకులు గొర్రెంకల సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబురవి,స్వీపింగ్ కార్మికులు రాజమణి, రాజేశ్వరి, వెంకటమ్మ, శంకరమ్మ, రాజేశ్వరి, మమత,స్వరూప, పాల్గొన్నారు.

# అమరావతిపై వైసీపీ వైఖరి సిగ్గుచేటు



- బొమ్మిడి నాయకర్, పొత్తూరి రామరాజు

నరసాపురం, ఏప్రిల్ 2 (మనం న్యూస్)**:** ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో అమరావతిని దేశం లోనే గర్వించదగ్గ రాజధానిగా నిర్మించడానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బొమ్మిడి నాయకర్, పొత్తూరి రామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతౌల్యంతో పరిపాలన కొనసాగిస్తోందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళానికి గురిచేసి ఆంధ్రప్రదేశ్ను రాజధాని లేని స్థితికి తీసుకెళ్లారని విమర్శించారు. అమరావతే రాజధాని అని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానానికి పార్లమెంటు సాక్షిగా దేశంలోని అన్ని పార్టీల మద్దతు లభించగా అమరావతికి వ్యతిరేకంగా వైసీపీ ఎంపీలు వాకౌట్ చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మునికోటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, ఏఎంసీ వైస్ చైర్మన్ దేశినీడి గంగాధర్, మొగల్తూరు సొసైటీ అధ్యక్షుడు నిప్పులేటి తారక రామారావు, అంబటి అరుణ, కొలచన పద్మ, బొక్క చంటి, నియోజకవర్గ జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# ఐ-ప్యాక్‌పై ఈడీ ఎటాక్




## హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలో సోదాలు
## కీలక పత్రాలు, హార్డ్ డిస్క్‌ల స్వాధీనం
## పశ్చిమ బెంగాల్ బొగ్గు అక్రమ రవాణా దర్యాప్తు
## మనీ లాండరింగ్ కోణంలో విచారణ
## ఎన్నికల వేళ...తనికీల గోలపై చర్చ

హైదరాబాద్,ఏప్రిల్ 2(మనం,ప్రత్యేక ప్రతినిధి)**:** పశ్చిమ బెంగాల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ ఈడీ దాడులు కలకలం రేపుతున్నాయి. ప్రముఖ పొలిటికల్ కన్సల్టెన్సీ ఐ ప్యాక్ కార్యాలయాల్లో ఈడీ గురువారం సోదాలు నిర్వహించింది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలో ఈడీ ఏకకాలంలో తనికీలు చేపట్టింది. ఐ ప్యాక్ సహ వ్యవస్థాపకులు రిషి రాజ్ సింగ్ నివాసంతో పాటు ఐ ప్యాక్‌తో సంబంధం ఉన్న పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పశ్చిమ బెంగాల్ బొగ్గు అక్రమ రవాణా కేసు సంబంధించి దర్యాప్తులో భాగంగా ఐ ప్యాక్‌తో సంబంధం ఉన్న పలు ప్రదేశాలతో తనికీలు చేసిన ఈడీ కీలక పత్రాలను స్వాధీనం చేసుకుంది. బెంగళూరులోని రిషి రాజ్ సింగ్‌కు చెందిన కార్యాలయాలలో సైతం కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్,పెన్‌డ్రైవ్‌లతో పాటు పలు డాక్యూమెంట్లను సీజ్ చేసినట్లు తెలిసింది.

**ఎన్నికల వేళ :**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఈడీ సోదాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి ఐ-ప్యాక్ పొలిటికల్ కన్సల్టెన్సీ సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ వ్యూహాలు, ఐటీ, మీడియా కార్యకలాపాలను నిర్వహించడంలో ఐ-ప్యాక్ కీలక పాత్ర పోషిస్తుంది. టీఎంసీ తన ఎన్నికల వ్యూహాలను మెరుగుపరచుకోవడానికి, ఓటర్లతో సంబంధాలను మెరుగుపరుచుకోవడాని సహాయపడే విధంగా ప్రణాళికలను అందిస్తుంది.

**జనవరిలోనూ :**

ఈ ఏడాది జనవరిలో ఐ ప్యాక్ కార్యాలయాలు, ప్రమోటర్ల నివాసాలపై ఈడీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ దాడులలో కోల్‌కతాలోని లౌడన్ స్ట్రీట్లో ఉన్న ఐ ప్యాక్ ప్రమోటర్ ప్రతీక్ జైన్ నివాసం, సాల్ట్ లేక్‌లోని ఐ-ప్యాక్ కార్యాలయంలో బొగ్గు రవాణా కేసుకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించారు. కాగా ఈడీ దాడులు జరుగుతున్న సమయంలోనే మమత పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ప్రతీక్ జైన్ ఇంటికి వెళ్లి కీలక పత్రాల్ని తాను తీసుకున్నటు తెలిపారు. తమ పార్టీకి సంబంధించిన అభ్యర్థుల వివరాలు, రాజకీయ, ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకే ఈడీ ఈ దాడులు చేస్తోందని ఆమె ఆరోపించారు. తాము కూడా బీజేపీ ఆఫీసుపై దాడులు చేస్తే ఎలా ఉంటుందని ఒకచేతిలో ఫైల్ పట్టుకుని మమత మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. అయితే బొగ్గు రవాణా కేసులో మనీ లాండరింగ్ కోణంలో విచారణ చేపడుతున్నట్లు ఈడీ వర్గాలు తేల్చిచెప్పాయి. అయితే ఈడీ దాడులు జరుగుతున్న వ్యక్తి ఇంటికి సీఎం వెళ్లడాన్ని ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికార్ ఖండించడంతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థల విధులకు మమత ఆటంకం కలిగించడం పనిగా పెట్టుకుందని, ఆమెపై ఈడీ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కిషన్‌రెడ్డి నోటా రేవంత్‌రెడ్డి మాట



**పార్లమెంట్ సాక్షిగా తెలంగాణకు 'కిషన్‌రెడ్డి' ద్రోహం**

**బయటపడ్డ కిషన్‌రెడ్డి వికృతత్వం : హరీశ్ రావు ధ్వజం**

హైదరాబాద్, మనం ప్రతినిధి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభలో ఆయన పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి అని ఆరోపించారు. పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. తెలంగాణకు చేందిన ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు, తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం కూడా అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమే అన్నారు. ఈ పాపంలో కిషన్ రెడ్డి పాత్ర కూడా ఉందని అన్నారు. ఉవ్వేత్తున ఎగసిపడుతొన్న ఉద్యమం సమయంలో సైతం ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి, మీరు చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మరిచిపోయారా అని కిషన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. ఇది తెలంగాణపై వారిద్దరి కుట్రకు నిదర్శనమని హరీశ్‌రావు తనదైన శైలీలో తీవ్రంగా విమర్శించారు.

**రేవంత్ తప్పుడు ప్రచారాన్నే..కోనిసాగిస్తున్న కిషన్ రెడ్డి...**

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి సైతం పార్లమెంట్‌లో వ్యాఖ్యానించడంపై.. కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని ఆరోపించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్దమా? అని నిలదీశారు. 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? ఈరోజు, ఈ నిమిషానికి మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధమో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం వచ్చేందుకు మీకు దమ్ముందా? అని సవాల్ చేశారు. మీరు క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా? అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని దుయ్యబట్టారు. మీ బిజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదార్లు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. ఆ పైసలు దుబాయ్‌లో ముద్రిస్తున్నారా? లేక మీ జేబుల్లో నుండి ఖర్చు చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలాఉంటే, కాళేశ్వరం వల్ల ఉపయోగంలేదని కిషన్‌రెడ్డి గొంతు చించుకున్నారని ఆరోపించారు. కానీ, గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలు నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్దమా? లేక అవివేకమా? అని ప్రశ్నించారు. అయితే, నిన్నగాక మొన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' రిపోర్ట్ ప్రకారం, '2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం ఉంది. 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే' అని కుండబద్దలు కొట్టిందని అన్నారు. ఇది కిషన్ రెడ్డి కళ్లకు కనబడటం లేదా? అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి చెప్పింది మాత్రమే ఆయన చెవుల్లోకి వెళుతున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పూటకో తీరు మాట్లాడటం రాజనీతి కాదని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని మా ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడితే??, మీరు దాన్ని సమర్ధించకపోగా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా ఈరోజు సభలో పలికింది కిషన్ రెడ్డే?..కానీ, పలికించింది మాత్రం రేవంత్ రెడ్డేనని హరీశ్ వ్యాఖ్యానించారు.

చేరో 8 మంది బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఉండి కూడా ఇక్కడి గడ్డపై పుట్టి కూడా తెలంగాణ వాదాన్ని వినిపించకపోవడం సిగ్గుచేటు హరీశ్ రావు పేర్కొన్నారు.

# తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు

- లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధం
- త్వరలో భారీ శుభవార్త చెప్పనున్న రేవంత్ సర్కార్
- కుప్పలుగా పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తులు
- అధికారులకు పెను సవాల్‌గా మారిన అసలైన అర్హుల గుర్తింపు




హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం కళ్లు కాయలుకాసేలా చాల ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మంది త్వరలో ఓ తీపి కబురు వినబోతున్నారు. మేనిఫెస్టో, ఎన్నికలకు ముందు ఇచ్చిన హమీలతో బాగంగా సీఎం రేవంత్ సర్కార్ భారీ శుభవార్త చెప్పనున్నారు. ఇందుకోసం 'చేయూత పథకం' కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ఇందుకు అనుగుణంగానే ఇటీవల 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధం చేసింది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అసలైన అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.

**ఇప్పటికే 42.23 లక్షల మందికి చేయూత పెన్షన్లు..**

అయితే, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. అయితే, గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తగా... దీనికి తోడు, ఒక్క గురువారం నాడే రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామసభల్లో కూడా భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన కీలక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. గత దరఖాస్తులతో పాటు తాజాగా ఇ(వ)చ్చినవి అందులో అసలైన భాదితులు ఎవరికి ఇవ్వాలి పరిశీలించి అంచనా వేస్తున్నారు. అత్యంత పకడ్బందిగా అన్ని ఫిల్టర్ చేసి, ఫైన్‌ల్ చేశాక... అందులో ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు ఉండగా.. ఇప్పటి వరకు పెండింగ్‌తో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటిందని సమాచారం. ఇందులో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున వచ్చిన ఈ 12 లక్షలు దరఖాస్తుల నుంచి ఇందులో కేవలం 2 లక్షల మందిని అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారిం(ది)దని మేధావులు, రాజకీయ విశ్లేషకులు చేప్తున్న మాట. అయితే, ప్రభుత్వం ఇవ్వనున్న కొత్త పెన్షన్ 'చేయూత పథకం' క్రింద ఎవరు అర్హులు?, ఎవరు అనర్హులు? అనేది త్వరలో తెలనుం(ది)దా?.. ఒకవేళా రేవంత్ ప్రభుత్వం ఊహించిన స్థాయిలో ఫలితం దక్కకపోతే? తాము అనుకున్నట్లుగా అంత సవ్యంగా జరుగపోదే? రేండున్నరేళ్ల సర్కార్ ప్లాన్ సాధ్యం కాకపోతే? ప్రజలు ఊహించిన స్థాయిలో ప్రభుత్వం నేరవేర్చకపోతే? ఫలితం దక్కకపోతే? ప్రభుత్వం మరో తేనే తుట్టను కలిపినట్లేనని కొందరు తలపండిన వృద్ధ రాజకీయ నేతలు చెప్తున్న మాట. ప్రభుత్వం సైతం అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని ఎవరు దీనికి అర్హులు, అసలైన లబ్దిదారులో కులంకుశంగా కుణ్ణంగా పరిశీలించి ఎంతమంది లబ్ధిదారులుంటారో అందరికి కొత్త పెన్షన్ 'చేయూత పథకం' క్రింద చేయూతనందివ్వాలని 'మన(దినపత్రిక సైత)ం కోరుకుం(టొంది)దాం.

# అమర్నాథ్ యాత్రగా పిలువబడుతున్న సలేశ్వరం జాతరకు పోటెత్తిన భక్తజనం

- నల్లమల్ల దట్టమైన అడవుల్లో మారుమ్రోగుతున్న శివయ్య లింగమయ్య స్వామి నామస్మరణం
- లక్షలలో తరలి వెళ్తున్న భక్తులు
- భక్తుల సౌకర్యార్థం కోసం జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణతో పాటు పకడ్బందీ ప్రణాళిక ఏర్పాట్లు
- రేపటితో ముగియనున్న సలేశ్వరం జాతర ఉత్సవాలు

- సహోసోపేతంగా ఎత్తైన కొండలు లోయలు దిగుతూ భక్తుల పాదయాత్ర

ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 2 (మనం బ్యూరో)**:** తెలంగాణ రాష్ట్రంలో మరో అమరనాథ్ యాత్రగా పిలువబడుతున్న సలేశ్వరం లింగమయ్య జాతరకు భక్తులు రోజుకు లక్షలలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీస్తుంటారు. ఈ ఉత్సవాలు గత నాలుగైదు సంవత్సరాల నుండి ప్రతి ఏటా మూడు రోజులకు కుదించడంతో భక్తుల తాకిడి మరింత పెరుగుతుంది. పౌర్ణమి రోజున స్వామివారిని ధరించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని నమ్మకంతో భక్తులు రాత్రి పగళ్ళు అని లెక్కచేయకుండా దాదాపు కాలినడకన 5 కిలోమీటర్ల మేర ఎత్తైన కొండలు లోయల నడుమ నడుచుకుంటూ స్వామివారి చెంతకు చేరుకొని మొక్కులు తీర్చుకుంటారు. నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండల పరిధిలోని రాంపూర్ చెంచుపెంట సమీపంలో ఉన్న సలేశ్వరం లింగమయ్య జాతర బారులు చేస్తుంటారు. గురువారం సాయంత్రం నుండి రాత్రి వరకు భారీ ఎత్తున భక్తులు లింగమయ్య దర్శనం కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొన్నది. నల్లమల్ల అడవుల్లో సలేశ్వరం లింగమయ్య దారి పొడవున హర హర మహదేవ శంభో శంకర అంటూ భక్తులు కేకలు వేస్తూ లింగమయ్య దర్శనానికి ముందుకు వెళ్తున్నారు.

**కొండ కోనలు లెక్కచేయకుండా భక్తులు బారులు తీసుకున్నవైనం..**

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో దట్టమైన అడవిలో సలేశ్వరం లింగమయ్య జాలువారి జలపాతం దగ్గర ఓ గుహ దగ్గర స్వామి వారు వెలిశారు. ప్రతి ఏటా చైత్ర మాసం పౌర్ణ శుద్ధమి రోజున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు లక్షలాదిగా తరలి వస్తుండడం విశేషం. కాలినడకన కొండలు గుట్టలు వంకలు లోయలు అని లెక్కచేయకుండా స్వామివారిని స్మరించుకుంటూ భక్తుల కేరింతలతో స్వామివారి దగ్గరికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. గతంలో సలేశ్వరం ఉత్సవాలు వారం రోజులపాటు కొనసాగుతుండడంతో భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని వీలుండేది. అటవీ హక్కుల చట్టం ప్రకారం, వన్యప్రాణుల సంరక్షణ కోసం గత నాలుగైదు సంవత్సరాల నుండి సలేశ్వరం జాతర మూడు రోజులపాటు జాతరకు అనుమతించడం పట్ల భక్తుల అలజడి మరింత పెరిగింది. అదేవిధంగా కొండ అనుసరించుకుని లోయ మార్గం వెంట వేలాదిగా భక్తులు తరలి వెళుతుండడంతో తోపులాట సందర్భంగా అక్కడక్కడ భక్తులు మృతి చెందడం జరుగుతుంది. మరికొంతమంది భక్తులు తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏడాదికి ఒకసారి కొనసాగే అమర్నాథ్ సలేశ్వరం లింగమయ్య స్వామి ఉత్సవాలను సడలించవద్దని పలువురు చెప్పుకొస్తున్నారు.

**సలేశ్వరం ఉత్సవాలంటేనే అధికారులకు ఒక సవాల్..**

సలేశ్వరం లింగమయ్య స్వామి ఉత్సవాలు దగ్గర పడుతున్నాయి అంటే జిల్లా సంబంధించిన శాఖల అధికారులకు ఓ పెద్ద సవాల్గా మారుతుంది. ఈ ఉత్సవాలు ముగిసేతవరకు భక్తుల సౌకర్యార్థం కోసం అన్ని శాఖల అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుంటుంది. జిల్లా కలెక్టర్ బాదావత్



సంతోష్ సలేశ్వరం ఉత్సవాలు భక్తుల సౌకర్యార్థం కోసం సంబంధిత జిల్లా శాఖ అధికారులు పకడ్బందీగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఎత్తున 300 మంది పోలీసులను రంగంలోకి దింపడం జరిగింది. అదేవిధంగా 100 మంది అటవీశాఖ అధికారులు మరో 150 మంది వాలంటీర్లతో ట్రాఫిక్ నియంత్రణ కొరకు భక్తుల సౌకర్యార్థం శ్రేయస్సు కొరకు జాతరలో నిమగ్నం అయ్యారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కడ జరగకుండా అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన స్వచ్ఛంద సంస్థ వారు లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

**ఇక్కడ నేటికీ చెంచులే పూజారులు..**

సలేశ్వరం లింగమయ్య స్వామి దగ్గర ఆనాటి నుండి నేటి వరకు చెంచులే పూజారులుగా వ్యవహరిస్తున్నారు. ఆ దట్టమైన అడవి ప్రాంతంలో అన్ని చెంచుల సమక్షంలోని ఈ ఉత్సవాలు కొనసాగుతుంటాయి. ప్రతి ఏటా సలేశ్వరం లింగమయ్య స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వస్తున్నారని చెంచు పూజారులు తెలుపుతున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పలు జాగ్రత్తలు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆ ప్రాంత ప్రజలు,



పెద్దలు చెప్పుకొస్తున్నారు. నల్లమల్ల అందాలను తిలకించేది ఒక ఎత్తు అయితే, ప్రకృతి వాతావరణం ఎలా ప్రదేశంలో ప్రకృతి ఒడిలో సేద తీర్చుతూ, అడవి అందాలను తిలకించేందుకు భక్తులు సలేశ్వరం జాతరకు రావడానికి మక్కువ చూపిస్తుంటారు. శుక్రవారం భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉండడం పట్ల జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం మన్ననూరు గ్రామంలో అదేవిధంగా ఫలహాబాద్ చౌరస్తా సమీపంలో భక్తుల తాకిడిని చూసి వాహనాలను లోనికి ప్రవేశం కల్పిస్తున్నారు. మరో రోజు సలేశ్వరం అమర్నాథ్ యాత్ర ఉండడం పట్ల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చే అవకాశం ఉందని జిల్లా ఉన్నతాధికారులు తెలుపుతున్నారు.

# సర్వాయి పాపన్న ఆశయాలను నెరవేర్చాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్



ఖమ్మం, ఏప్రిల్ 2(మనం న్యూస్): సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. గురువారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద గల ఆయన విగ్రహానికి అదనపు కలెక్టర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి తరాలకు మార్గదర్శకమని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమన్నారు.

ఈ కార్యక్రమంలో బిసి సంఘ నాయకులు, తెలంగాణ జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, బచ్చు విజయ్ కుమార్, నూతి సత్యనారాయణ గౌడ్, డి.సి.సి. అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అమరగాని వెంకన్న, వడ్డెబోయిన నరసింహ గౌడ్, మార్కం లింగయ్య గౌడ్, ఉడుగు శ్రీనివాస గౌడ్, డాక్టర్ శ్రీనివాస గౌడ్, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, కోడి లింగయ్య, పగడాల నాగరాజు, షేక్ షకినా, అంబాల వెంకటేశ్వరరావు, తోడేటి దుర్గాప్రసాద్, పెరుగు వెంకటరమణ యాదవ్, జక్కుల వెంకటరమణ, బెల్లం కొండ శరత్, బండి నాగేశ్వరరావు, పెల్లూరి విజయ్ కుమార్, రమణ కుమార్, రవి కుమార్, కొప్పెల్లి శ్రీనివాస్, సమ్మయ్య, బోడపట్ల సుదర్శన్, యాదాల నాగేశ్వరరావు, జ్యోత్స్న నాయక్, బత్తిని రాజు, మురళీ కృష్ణ, గంగరాజు, రామకృష్ణ, మాధవి, సతీష్, ముత్యాల రావు, వీరయ్య, మొగలయ్య, చందర్ రావు, రామకృష్ణ, బిసి కుల సంఘ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ అంకిత్




భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 02 (మనంప్రతినిధి): జిల్లాలో భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూభారతి కింద పెండింగ్లో ఉన్న దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి పెండింగ్ దరఖాస్తులపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి భూ సమస్యలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రతి సమస్యను ప్రాధాన్యంగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను బీఎల్ఓల వారీగా, మండలాల వారీగా విభజించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని, ప్రతి బీఎల్ఓకు లక్ష్యాలను నిర్దేశించి సమయానికి పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జనగణనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, తహసీల్దారుల ఐడీ క్రియేషన్ను వేగవంతం చేయాలని, జనగణన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, ఇసుక రీచ్ల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రీచ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ఇప్పటి వరకు నమోదు చేసిన కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ పురోగతి, పెండింగ్ కోర్టు కేసులపై కూడా సమగ్ర సమాచారం కోరారు. వచ్చే వారంలో జిల్లాలోని అందరు తహసీల్దారులతో భూభారతి, ప్రజావాణి దరఖాస్తులు, ఎస్ఐఆర్ మ్యాపింగ్, జనగణన, భూసేకరణ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఇందుకు అవసరమైన పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఈ సెక్షన్ సూపర్డెంట్ స్వర్ణలత, ఏడి మైన్స్ దినేష్, భూసేకరణ అధికారి యాసిన్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నంద తండా గ్రామపంచాయతీలో ఘనంగా గ్రామసభ నిర్వహణ




- అభివృద్ధి దిశగా కీలక చర్చలు
- పంచాయతీని అభివృద్ధి చేసి చూపుతాం
- సర్పంచ్ మాలోత్ బలరాం హామీ

చుంచుపల్లి, ఏప్రిల్ 2 (మనం న్యూస్) : నంద తండా గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన ముఖ్య అంశాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల సమస్యలు వంటి విషయాలపై విస్తృతంగా చర్చించారు.గ్రామసభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ మాలోత్ బలరాం మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ మరియు అభివృద్ధి పథకాలు గ్రామంలో ఎలా అమలవుతున్నాయో వివరించారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సమగ్ర అభివృద్ధి సాధనకు గ్రామస్థుల సహకారం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధి కోసం అన్ని శాఖల సమన్వయం అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సెక్రెటరీ భూమిక గ్రామంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను వివరించడంతో పాటు, ఇంకా చేపట్టాల్సిన పనులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామసభకు హాజరైన ప్రజల నుంచి వివిధ సమస్యలు, వినతులు స్వీకరించి, వాటిని ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామసభలో అంగన్వాడి సిబ్బంది, పల్లె దవాఖాన వైద్యులు, ఆర్టీసీ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, గ్రామ దీపిక మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొని తమ తమ విభాగాలకు సంబంధించిన సేవలు, సవాళ్లు, అభివృద్ధి చర్యలపై వివరించారు.

గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి తగిన పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ఈ సమావేశం వేదికగా మారింది. అంతేకాకుండా, గ్రామ ప్రజల నుండి వచ్చిన అభ్యర్థనలు, సమస్యలను సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ మాలోత్ బలరాం హామీ ఇచ్చారు. గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, ఆరోగ్యం, విద్య, రవాణా వంటి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు. గ్రామాభివృద్ధి దిశగా ఈ గ్రామసభ ఒక కీలకమైన అడుగుగా నిలిచింది.

# ప్రజా శ్రేయస్సు కోసం 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- పిల్లల సంక్షేమ పర్యవేక్షణకు గ్రామ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఏర్పాటు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలి
- ముష్టికుంట్ల గ్రామసభలో పాల్గొన్న అదనపు కలెక్టర్



మధిర, ఏప్రిల్ 2(మనం న్యూస్): ప్రజా శ్రేయస్సు కోసం 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న వివిధ పథకాలు, ప్రభుత్వం అమలు చేయబోయే వివిధ పథకాలను వివరించేందుకు గ్రామ సభ ఏర్పాటు చేసుకున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటికి 5 లక్షల బీమా కల్పించే దిశగా ప్రభుత్వం ఇందిరమ్మ బీమా పథకం ప్రవేశ పెడుతుందని అన్నారు.నూతన రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని బ్యాంకు లింకేజీ రుణాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. వివిధ శాఖల ద్వారా గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా గ్రామసభలో చర్చ జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పేరిట ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ తీసుకుందని అన్నారు. వైద్య శాఖ, రోడ్డు భద్రత, మహిళా సంక్షేమం, యువజన క్రీడా శాఖ, త్రాగునీటి సరఫరా, వ్యవసాయం వంటి వివిధ శాఖల ద్వారా జూన్ 12 వరకు వివిధ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు.వైద్య శాఖ ద్వారా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహణ, గ్రామాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఏప్రిల్ 13 నుంచి 18 వరకు అరైవ్ అలైవ్ ప్రోగ్రాం ద్వారా రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పన, ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్ స్పాట్ గుర్తించి అక్కడ అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టాలని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, మనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు దృష్టిలో ఉంచుకొని రాబోయే 5 సంవత్సరాలలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలో ప్రాధాన్యత ప్రకారం ఎంపిక చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా లబ్దిదారులకు లబ్ది చేకూరే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాలలో ఏఎన్ఎం, ఆశా, తల్లితండ్రులు, సర్పంచ్, ఉపసర్పంచ్, ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో గ్రామ చైల్ వెల్ఫేర్ కమిటీ ఏర్పాటు చేయాలని, బాల్య వివాహాలను అడ్డుకోవడం, పిల్లలందరూ చదువుకునేలా చూడటం, పిల్లలకు మంచి పోషకాహారం అందేలా చూడటం వంటి చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాలల వద్ద కోతుల సమస్య పరిష్కరించడం కోసం దశల వారీగా సోలార్ ఫెన్సింగ్ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేయాలని అన్నారు. మన పిల్లల భవిష్యత్తు చాలా కీలకమని, పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడవద్దని, బయట ఇచ్చే చాక్లెట్, చిరు తిండ్లను పిల్లలు తినకుండా అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం గ్రామసభలో పంచాయతీ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ది పొందిన ప్రజల వివరాలు ప్రదర్శించి, లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల ఎంపిడివో రమాదేవి, తహశీల్దార్ రమాదేవి, ముష్టికుంట గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్కె సైదులు, ఎఇఓ త్రివేణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు సత్వర పరిష్కారమే గ్రామ సభల నిర్వహణ

- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలి
- 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




మణుగూరు, ఏప్రిల్ 2(మనం న్యూస్): మణుగూరు మండలం సింగారం గ్రామపంచాయతీలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.గ్రామ ప్రజలతో స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని, ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితిని సమీక్షించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే,పాయం వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజల భాగస్వామ్యం లేకుండా గ్రామాభివృద్ధి సాధ్యం కాదు అని స్పష్టం చేశారు.గ్రామ ప్రజల అభిప్రాయాలే అభివృద్ధికి మార్గదర్శకాలని తెలిపారు.ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సక్రమంగా చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.గ్రామంలో తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజలకు వివరించి, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రజలు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజక వర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిం చారు.అలాగే గ్రామ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలనే ఆశతో దరఖాస్తులను స్వయంగా ఎమ్మెల్యేకు అందజేసి, తమ బాధలను వినిపించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రతి దరఖాస్తును స్వీకరించి, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు తహసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడి ఓ వెంకటేశ్వరరావు, స్పెషల్ ఆఫీసర్ స్వర్ణ జ్యోతి లెనిన్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ ఈ అరుంధతి, అగ్రికల్చర్ ఆఫీసర్ హారిక, ఎలక్ట్రికల్ ఏ ఈ లారెన్స్, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ భద్రమ్మ, విద్యాశాఖ అధికారి నరసయ్య, సూపరింటెండెంట్ గౌరీ ప్రసాద్, ఏ పి ఎం ఐ కె పి సత్యనారాయణ,మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు,14 టైర్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి,సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు రహీం పాషా, మాదాటి రాజేష్, కొలపిన్ని మానస, కృష్ణవేణి, శ్రీదేవి, మంగతాయారు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, మాజీ సర్పంచ్ కాటబోయిన నాగేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య, గణేష్, సిపిఎం నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



దమ్మపేట, ఏప్రిల్ 02 (మనం న్యూస్): దమ్మపేట మండలం, కొడిసెల గూడెం, గ్రామంలో కుంజా బాలరాజు - లక్ష్మి,ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు జారె ఆదినారాయణ,పాల్గొని వారి చేతులమీదుగా గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ నియోజకవర్గ పరిశీలకులు జీ.రాము, అంకంపాలెం సర్పంచ్ మోకాళ్ళ గురుమూర్తి , ఉప సర్పంచ్ పెనుబల్లి కుమారి, దమ్మపేట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాక రమేష్ , గ్రామ శాఖ అధ్యక్షులు వాడే వెంకటరావు,వార్డు సభ్యులు పెనుబల్లి లక్ష్మి , కాంగ్రెస్ పార్టీ నాయకులు పెనుబల్లి వెంకటేష్, సోయం ముత్యాలరావు, కాక వెంకటేష్,కారం బాలకృష్ణ, నందిగం గౌతమ్, పెనుబల్లి రామ్మూర్తి , కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసన్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బొల్లి వెంకటరాజు




భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 02 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ కార్యాలయం ముందు తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ టివిఎఇ జెఎసి ఆధ్వర్యంలో ఈరోజు ధర్నా వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలో 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులు గత ప్రభుత్వం పర్మినెంట్ చేయకుండా, ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్ 1 గ్రేడ్ 2 రేట్ 3 గ్రేడ్ 4 అని పెట్టి స్టాండింగ్ ఆర్డర్స్ ఇచ్చారని, విద్యుత్ సంస్థ లో పర్మిట్ కార్మికులకు ఎపిఎస్ఇబి రూల్స్ వర్తింపజేస్తూ ఆర్టిజన్లకి సపరేటుగా సర్వీస్ రూల్స్ ఉండడం వలన ఈ కార్మికుల తీరని అన్యాయం జరిగిందని, కొత్తగూడెం సర్కిల్ కార్యాలయం ముందు వంటా వార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలగాని రమేష్ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి భూక్య రమేష్ , 327 యూనియన్ నాయకులు రాజేష్, 114 యూనియన్ నాయకులు హేమంత్, టి జి యు ఇ ఇయు- సిఐటియు కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి పులి గణేష్ బాబు, విద్యుత్ మహిళా ప్రతినిధి శివరంజని కార్మికుల ఉద్దేశించి మాట్లాడి సంఘీభావం తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు అన్ మ్యాన్ వర్కర్స్, పీస్ రేట్ కార్మి పాల్గొనడం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జేఏసీ చైర్మన్ కూనరాజు శ్రీనివాస్, ఒఅఇ మహిళా నాయకురాలు రేఖా, గ్లోరీ పూర్ణిమ, కె. నీలవేణి, విజయలక్ష్మీ టి వి ఎ ఇ - జెఎసి నాయకులు, బి మోతరామ్, రాంబాబు, జె రాజేందర్, శరత్ , కోటి, గాంధీ శ్రీనివాస్ ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వామ్యమవ్వాలి

- నియోజకవర్గం అభివృద్ధిలో దమ్మపేటకు 2వ ప్రాధాన్యత
- సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందాలి
- ఎంఎల్ఏ జారె ఆదినారాయణ



దమ్మపేట, ఏప్రిల్ 02(మనం ప్రతినిధి): దమ్మపేట గ్రామసభను 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం సర్పంచ్ పగడాల రమాదేవి అధ్యక్షతన ప్రత్యేక అధికారి ఎంపీడీవో రవీందర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ బండి అనంత్ కుమార్, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్న ఈ గ్రామసభలో అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసేటటువంటి ప్రతి పథకం అట్టడుగు వర్గాలు ఉన్నటువంటి ప్రజలకు అందజేయటమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గ్రామ సమస్యలు, ప్రాధాన్యతను బట్టి గ్రామసభలో నమోదు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుడు కొయ్యల ప్రసాద్, గృహజ్యోతి పథకం గురించి పానుగంటి లక్ష్మణ్ గౌడ్, వివిధ పథకాల గురించి దేవయ్య మాట్లాడారు. తదనంతరం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, గ్రామసభలో పాల్గొని గ్రామసభ నిర్వహిస్తున్న స్థలం పంచాయతీ స్థలమని తెలిసి ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తే ఎమ్మెల్యే నిధుల నుండి పది లక్షల వరకు కేటాయిస్తామన్నారు. అర్బన్ కాలనీ అనుకోని ఉన్న రాంజీకుంటను సుందరీకరణ చేసే నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు. డ్రైనేజ్ వ్యవస్థను క్రమబద్ధీకరించాలి అని పాలకవర్గ సభ్యులకు చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రతీ పేదవాడికి పథకాలు చేరవేయడంలో పాలకవర్గ సభ్యులు, నాయకులు స్వార్థం లేకుండా చేయాలి అన్నారు. స్థలం లేని నిరుపేదలకు మల్లారం దగ్గర్లో ప్రభుత్వ స్థలం ఉంది అని త్వరలో స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాము అన్నారు. ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ముఖ్యంగా హెల్మెట్లు ధరించాలని అలాగే గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ బారిన పడకుండా ప్రజలు అనవసర కాల్స్ కి, లింక్స్ ని మొబైల్ లో ఓపెన్ చేయకూడదన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు సేఫ్టీ రూల్స్ పాటించాలి అని అన్నారు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏఈ సాయి కిరణ్ మాట్లాడుతూ గృహ జ్యోతి అనేది నిరంతర ప్రక్రియ అని ఎవరికైనా ఈ పథకం అమలు కావాల్సిన వారు ఎంపీడీఓ కార్యాలయంలో సర్వీస్ నెంబర్, రేషన్ కార్డు లింకు చేసి స్కీమ్ అమలు అయ్యే విధంగా చేస్తాము అన్నారు. గ్రామంలో గల నివాసాల పైన గల కరెంటు తీగలను త్వరలోనే తీసే ఏర్పాటు చేస్తామని, రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంటు స్తంభాల ప్రస్తావన ప్రజలు కంప్లెంట్ చేయడంతో త్వరలోనే తొలగిస్తామని తెలియజేశారు. ఏఈఓ దీప్తి మాట్లాడుతూ రైతు భరోసా, రైతు బీమా, భూసార పరీక్షలు, పంట మార్పిడి గురించి మాట్లాడారు. అంగన్వాడి టీచర్ శాంతి మాట్లాడుతూ 13 అంగన్వాడి కేంద్రాల సమస్యల గురించి 9 అంగన్వాడి కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి అని, గ్రామంలో ఉన్న బాలింతలు గర్భిణీలు పిల్లలు అలాగే ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగూడెం, జనగాం జిల్లాలకు మాత్రమే రక్తహీనత తగ్గించడానికి యుక్త వయసుగల బాలికలకు పల్లి, మిలిటెంట్ చెక్కీలను అందిస్తుందని తెలియజేశారు, దమ్మపేట హై స్కూల్ ఫిజికల్ సైన్స్ టీచర్ మాట్లాడుతూ దమ్మపేట పంచాయతీ పరిధిలో ప్రాథమిక పాఠశాలలో గల విద్యార్థులకు ప్రభుత్వం అందించే వివరాలు తెలియజేశారు. పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే సంవత్సరం నుండి 12వ తరగతి పాఠశాలలోనే క్లాసులు జరుగుతాయి అన్నారు. రూమ్స్ కొరత ఉందని తెలియజేశారు. జీపీవో పాపయ్య మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, గ్యాస్ కనెక్షన్లు, పి.యం ఉజ్వల పథకం గురించి తెలియజేశారు. 53 కొత్తగా అర్హులైన వారి జాబితా తొందరలోనే వస్తుందని కార్యదర్శి బండి అనంత కుమార్ తెలియజేశారు. తదనంతరం గ్రామస్తులు అత్యం వెంకటేశ్వరరావు, యార్లగడ్డ ఈశ్వరరావు, షేక్ గౌరీ, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, గట్ల నాగరాజు తదితరులు దమ్మపేట ప్రధాన సెంటర్లో గల బస్టాండ్ ను ప్రజా సౌకర్యాలకు వాడాలని వ్యాపారాలకు వినియోగించకూడదని అక్కడ నిర్మించిన పెట్రోల్ బంకుకి ఎటువంటి గ్రామసభ, పంచాయతీ తీర్మానం లేకుండా నిర్మాణం చేపట్టారని ఎట్టి పరిస్థితుల్లోనూ బంకు నిర్వహించకూడదని గ్రామ సభలో పాల్గొన్న ప్రజలచే పెట్రోల్ బంకు వద్దు అని చేతులెత్తించారు. వర్షాకాలంలో గాయత్రి నగర్ పశువుల ఆసుపత్రి షాదీఖానా తదితర ప్రాంతాలను ముంచెత్తుతున్న వరద నీటిని మళ్లించడానికి కాలవను, డ్రైనేజీ సిస్టంను మెరుగుపరచాలని, గ్రామంలో గల ఇళ్లపై గల హై టెన్షన్ వారి తొలగించాలని తగిన 4.5 లక్షల రూపాయల డీడీ తాలుఖా అమౌంట్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహకారంతో సమకూర్చుతామని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్ తెలియజేశారు. చిన్నశెట్టి ముత్తు, మధు పంచాయతీ కార్యాలయం నుండి గ్రామస్తులకు కావలసిన సర్టిఫికెట్లు, మ్యుటేషన్ తదితర వాటికి ఎంత డబ్బులు చెల్లించాలి అని ఎంపీడీవో కార్యదర్శి నుండి వివరాలు తీసుకున్నారు. తదనంతరం గ్రామసభకు వచ్చిన ప్రజల వద్ద నుండి వినతి పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లను సర్పంచ్ పగడాల రమాదేవి, ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు తీసుకున్నారు. ఈ సభలో ఆశాలు, అంగన్వాడి టీచర్లు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, అధికారులు, రాజకీయ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar మహబూబ్ నగర్

# నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- మనం ఎడిటర్ రమేష్ కుమార్



గజ్వేల్, ఏప్రిల్ 2 మనం న్యూస్: నిరుపేదలకు స్వల్ప ఫీజులతో మెరుగైన వైద్యం అందించాలని మనం దినపత్రిక ఎడిటర్ రమేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈక్రమంలో బాచుపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ఎన్ టి కేర్ సెంటర్ ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మనం ఎడిటర్ మాట్లాడుతూ డాక్టర్ రోజా రాణి మంచి ప్రతిభగల ఇ ఎన్ టీ స్పెషలిస్ట్ అని అన్నారు. పేదలకు సహాయం చేయాలనే ఉద్దేశంతోనే మల్లంపేట వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా హాస్పిటల్ ప్రారంభించడం జరిగిందని ఆయన డాక్టర్ రోజా రాణి సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ రోజా రాణి మాట్లాడుతూ చెవి ముక్కు గొంతు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు అత్యాధునిక పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహించి పేదలకు సహాయ సహకారాలు అందించడమే లక్ష్యమని అన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ఈఎన్ టీ కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని పేదలకు స్వల్ప మొత్తాలతో ధరలోనే చికిత్స లు చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఈ సందర్భంగా డాక్టర్ రోజా రాణి తెలిపారు.కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరకు తరలివస్తున్న భక్తజనం

- మరో బద్రీనాథ్ ఆలయంగా పిలవబడుతున్న సలేశ్వరం
- భక్తుల దృష్ట్యా జాతరలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- భక్తుల సౌకర్యార్థం కోసం విస్తృత ఏర్పాట్లు
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్





ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 2 (మనం బ్యూరో): బుధవారం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నల్లమల అటవీ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి జాతర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్. నల్లమల్ల దట్టమైన అడవిలో వెలిసిన సలేశ్వరం లింగమయ్య స్వామి ఉత్సవ ఏర్పాట్లను రాత్రి వేళలో జిల్లా కలెక్టర్ దగ్గరుండి భక్తుల సౌకర్యార్థం కోసం అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. తధానంతరం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ మాట్లాడుతూ. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలంలోని సుందరమైన నల్లమల అడవులు మధ్య వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సలేశ్వరం లింగమయ్య స్వామి జాతర బుధవారం ఉదయం భక్తి శ్రద్ధల మధ్య కన్నుల పండుగగా, అంగరంగ వైభవంగా ఘనంగా ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం జరిగే ఈ జాతరకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు తరలివస్తుండటం విశేషంగా చెప్పుకోవచ్చు. ప్రకృతి సోయగాల నడుమ జరిగే ఈ జాతర భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతుందన్నారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ సలేశ్వరం లింగమయ్య స్వామి మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందస్తుగా విస్తృత ఏర్పాట్లు చేపట్టిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అన్నదానం, విశ్రాంతి మండపాలు, తాత్కాలిక నివాస సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నరాన్నరు. సలేశ్వరం జాతర ఉత్సవాలు ఏర్పాట్లపై భక్తులతో కలెక్టర్ ఆరా తీశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కలెక్టర్ దగ్గరుండి సమీక్షించారు. అలాగే సీసీ కెమెరాల ద్వారా నిఘా వ్యవస్థను బలోపేతం చేసి భద్రతను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. వైద్య సేవల పరంగా కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే చికిత్స అందించేందుకు మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సదుపాయాలు భక్తుల కోసం సిద్ధంగా ఉంచారన్నారు. అడవి ప్రాంతం కావడంతో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. జాతర ఉత్సవాల సందర్భంగా ఎక్కడైనా ఏమన్నా ఇబ్బందులు ఉంటే తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తెలపాలని కలెక్టర్ భక్తులను కోరారు. భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా జాతరలో పాల్గొనేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జాతర మూడు రోజుల పాటు కొనసాగుతుండడంతో అధికారులు 24 గంటలు పర్యవేక్షణ కొనసాగిస్తారన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ కూడా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, భక్తుల రద్దీ ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భద్రత పరంగా ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరకు కఠిన నిబంధనలు భక్తులకు సమయ పరిమితి



- ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకే అనుమతి
- అచ్చంపేట డిఎస్పీ పల్లె శ్రీనివాస్.



అచ్చంపేట ఏప్రిల్ 2 (మనం న్యూస్): నాగర్కర్నూల్ జిల్లా నల్లమల్ల లోతట్టు అటవీ ప్రాంతంలో జరుగుతున్న సలేశ్వరం జాతరకు భక్తుల రద్దీ రోజురోజుకు అధికమవుతోంది. ఈ నేపథ్యంలో భక్తుల భద్రత దృష్ట్యా ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు అచ్చంపేట డిఎస్పీ పల్లె శ్రీనివాసులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు తమ ప్రయాణాన్ని సమయానికి అనుగుణంగా ప్రణాళిక చేసుకొని రావాలని సూచించారు. సాయంత్రం 7 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లోయలోకి అనుమతి ఇవ్వబడదని హెచ్చరించారు. జాతర ముగింపు రోజైన శుక్రవారం (ఏప్రిల్ 3) భారీగా రద్దీ ఉండే అవకాశం ఉన్నందున భక్తులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం సలేశ్వరం లోయలో అధిక జనసందోహం కారణంగా ఆక్సిజన్ స్థాయిలు పడిపోతున్నాయని తెలిపారు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఈ కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు జాతరకు రాకపోవడమే మంచిదని, వారికి లోయలోకి అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. భక్తులు అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని డిఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఆధునిక లాభదాయకమైన సాగుతో రైతులు మరింత ఆర్థికంగా రాణించాలి

- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ వై. జె పద్మహర్ష



ఉమ్మడి మహబూబ్ నగర్, ఏప్రిల్ 2 (మనం బ్యూరో): నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.జె. పద్మహర్ష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అందించిన సందేశాన్ని చదివి గ్రామ ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా వై.జె. పద్మహర్ష మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలలో రైతులకు అందించిన సంక్షేమ పథకాలు, వ్యవసాయ ఆధునికీకరణలో చేసిన అభివద్ధిని ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, నూతనంగా అందించే పథకాలను సంపూర్ణంగా వివరించారు. రైతుల అవసరాలు, ముఖ్యంగా పంట మార్పిడి, మార్కెటింగ్కు సంబంధించిన అంశాలను తెలుసుకునేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, గహ జ్యోతి, రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఉపాధి హామీ పథకం వంటి పలు కార్యక్రమాల అమలు గురించి సంపూర్ణంగా అందరికీ అర్థమయ్యే విధంగా వివరించారు. నాగర్కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 1,11,297 మంది రైతులకు రూ. 947.45 కోట్ల రుణమాఫీ చేయబడినట్లు తెలిపారు. అదేవిధంగా 3,06,983 మంది రైతులకు రూ. 415.23 కోట్ల రైతు భరోసా అందించినట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ఒకే రకమైన పంటలకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఎకరాకు సుమారు రూ. 51,000 వరకు సహాయం అందిస్తున్నదన్నారు. ఇందులో మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్, నిర్వహణ ఖర్చులు, ఫామ్ పాండ్లు వంటి అంశాలు ఉన్నాయని తెలిపారు. మూడు సంవత్సరాల పాటు ఆయిల్ పామ్ సాగు చేసిన తర్వాత నాలుగో సంవత్సరం నుంచి ఆదాయం లభిస్తుందన్నారు. ఆ సమయంలో కూడా అంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం మరెంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, నాగర్కర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ, మండల స్థాయి అధికారులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, గ్రామ ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెడల్ ఇరుపు రోగంతో వరిపంటకు నష్టం



కరీంనగర్, ఏప్రిల్ 2(మనం న్యూస్ ): మెడల్ ఇరుపు రోగం తో వరిపంట కు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళనలో చెందుతున్నారు ప్రభుత్వం ఆదుకోవాలని పెదరైతు ముల్కల సత్తయ్య ప్రభుత్వాన్ని అధికారులను వేడుకొంటున్నాడు.కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లోని గంగిపెల్లి గ్రామం లో వందల ఎకరాల్లో వరి పంటకు మెడల్ ఇరుపు, మొగిలి పురుగు కారణంగా పంట నష్టపోతున్నామని పలువురు రైతులు ఆవేదన చెందు తున్నారు. గంగిపెల్లి గ్రామానికి చెందిన ముల్కల సతయ్య తనకున్న ఎకరం లో 1010 వరిపంట వేసానని తెలిపారు అలాగే పెరుమాండ్ల సంధ్య 30గుంటల్లో 1010 వరి వేయడం జరిగింది. మెడల్ ఇరుపు రోగం వచ్చి మొత్తం పంటచేతికి వచ్చే సమయం లో గోళక (సట్ట )పోయిందని, ధీంతో పెట్టిన పెట్టు బడి ఎకరాకు 25 వేలు నష్టపోతున్నామని ఆవేదనవ్యక్తం చేశారు.అధికారులు పంటను పరిశీలన చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

# వేదభవన్‌లో హనుమాన్ జయంతి వేడుకలు



కరీంనగర్, ఏప్రిల్ 2(మనం న్యూస్): కరీంనగర్ వేదభవన్ లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని 9 వ డివిజన్ కోతిరాంపూర్ బైపాస్ లో గల వేదభవనంలో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం రోజున వికాస తరంగిణి, ఆధ్యాత్మిక భక్తుల ఆద్వర్యంలో వేదభవన్ భగవత్ రామానుజాచార్యులకు వేద మంత్రోచ్చరణలతో అభిషేక పారాయణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదభవన్ లో శ్రీ సీతారాములకు, భగవత్ రామానుజాచార్యులకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ కు వేద పండితులు మంత్రోచ్చరణలతో శాలువాతో సత్కరించి... ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... కరీంనగర్ వేదభవన్లో హనుమాన్ జయంతి వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఆంజనేయ స్వామి భక్తికి, శక్తికి ధైర్యానికి నిదర్శనం. లోక కల్యాణం కోసం, కరీంనగర్ నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ సీతారాములను హనుమంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ ద్వారా వేదభవన్ కు ఎలాంటి వసతి సౌకర్యాలు ఉన్న వాటిని తీర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. వేదభవన్ భక్తులు కోరక మేరకు భగవత్ రామానుజాచార్యుల విగ్రహ ఏర్పాటు కృషి చేస్తామని తెలిపారు. ప్రధాన రహదారి నుండి వేదభవన్ వరకు నగరపాలక సంస్థ ద్వారా త్వరలో సీసీ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనసుకి ప్రశాంతతను ఇస్తాయి. వేదభవనం లాంటి పవిత్ర స్థలాల్లో ఇలాంటి పారాయణాలు నిర్వహించడం మన సంస్క ృతిని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అద్యక్షులు గౌతంరావు, వేదభవన్ భక్తులు, వేద పండితులు, అర్చక విద్యార్థులు పాల్గొన్నారు.

# డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు ప్రక్రియ పురోగతిపై సమీక్ష

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి, ఏప్రిల్ 02 మనం ప్రతినిధి: జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, జోగిపేట, పఠాన్ చెరువు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లు, సదాశివపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆభా ఖాతాల నమోదు సంఖ్యను పెంచాలని, ప్రతి రోగికి తప్పనిసరిగా ఆభా ఐడీ నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఓపీ స్లిప్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ను డిజిటల్ ప్లాట్ఫారమ్లో అప్లోడ్ చేయాలని, ఫార్మసీ సేవలను కూడా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఇంటర్నెట్ వేగాన్ని మెరుగుపరచి సేవల అందుబాటును పెంచాలని తెలిపారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుతో రోగుల ఆరోగ్య చరిత్ర, పరీక్షల వివరాలు, చికిత్స సమాచారం ఒకే వేదికపై అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన మరియు సమర్ధవంతమైన వైద్య సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ డా. కవిత, డా. శశాంక్, ఇతర వైద్యాధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికతో గ్రామాభివృద్ధికి కొత్త దిశ ముందుకు

- గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ఎంతో దోహదపడుతుంది
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ఉమ్మడి మహబూబ్ నగర్, ఏప్రిల్ 2 (మనం బ్యూరో): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ ప్రజా పాలన గ్రామసభకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ. ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను తెలుసుకుని ప్రణాళికలు రూపొందించడం ద్వారా నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కీలకంగా మారనుందన్నారు. మార్చి 6వ. తేదీ నుంచి జూన్ 12 వరకు ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 460 గ్రామపంచాయతీలు ఉన్నాయన్నారు. నాగర్ కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీల పరిధిలోని 85 వార్డుల్లో గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐదు దశల్లో అమలు చేస్తూ, ఏప్రిల్ 16న. మండల స్థాయి, మే 2న. నియోజకవర్గ స్థాయి, మే 22న. జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు. జూన్ 2న. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంతో ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నరాన్నరు. విద్య, వైద్య, వ్యవసాయం సహా పది ముఖ్య థీమ్లతో రూపొందించిన ఈ ప్రణాళిక గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణ మాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నరని వివరించారు. ప్రభుత్వ లక్ష్యం నిజమైన లబ్ధిదారులకు ఈ పథకాలు చేరేలా చూడటమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యా రంగంలో కూడా పలు మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ నుంచి 10వ. తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ప్రమాద భీమా కల్పించే ఇందిరమ్మ ఆర్థిక భీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ-సిగరెట్ల వినియోగంపై పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటి వల్ల విద్యార్థులు, కుటుంబాలకు కలిగే నష్టాన్ని గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై ఈ 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. ఈ ప్రణాళిక ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమై, గ్రామాల పచ్చదనం , ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, మండల స్థాయి అధికారులు, తర్నికల్ గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, ఉపసర్పంచ్, గ్రామ వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎవరెస్ట్‌పై రూ.186 కోట్ల స్కామ్..



## రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేసి..!
## సొమ్ము చేసుకుంటున్న ముఠా
## నేపాల్ పోలీసుల అదుపులో 32 మంది

**ఖాట్మండ్, ఏప్రిల్ 2:** ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరంగా ప్రఖ్యాతిగాంచిన మౌంట్ ఎవరెస్ట్ పర్వతారోహకులకు సంబంధించిన సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. వారు ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు తీసుకొనే ఆహారాన్ని రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేస్తున్నారట. కొందరు ఒక నెట్‌వర్క్‌గా ఏర్పడి.. ఈ కుట్రకు పాల్పడుతున్నారని, అత్యవసర పరిస్థితిని సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారని నేపాల్ పోలీసులు అభియోగాలు మోపారు.

దర్యాప్తు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎవరెస్ట్ పర్వతారోహకులు తీసుకొనే ఆహారంలో బేకింగ్ సోడా మోతాదును పెంచుతున్నారు. దాంతో వారు జీర్ణకోశ సమస్యలకు గురవుతున్నారు. అయితే ఎత్తు కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయని ట్రెక్కర్లను నమ్మిస్తుంటారు. అప్పుడే వారి భయాన్ని సొమ్ము చేసుకోవడం మొదలవుతుంది. వారిని అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించేందుకు హెలికాప్టర్లను రప్పిస్తారు. ఎంత డబ్బు అయినా చెల్లించేలా అప్పటికే బాధితులను ఒప్పిస్తారు. పక్కాగా జరుగుతోన్న ఈ కుట్రలో కొందరు షెర్పాలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు కలిసి పనిచేస్తున్నాయి. తర్వాత నకిలీ వైద్యం, ఫ్లైట్ పత్రాలు చూపించి బీమా సంస్థల నుంచి డబ్బులు పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు. తర్వాత బీమా సొమ్మును షెర్పాలు, హెలికాప్టర్ కంపెనీలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు, నకిలీ పత్రాలు ఇచ్చిన ఆసుపత్రులు పంచుకుంటున్నా యని వెల్లడించారు. ఈ మోసం విలువ 20 మిలియన్ డాలర్లు (సుమారు రూ.186 కోట్లు) అని అంచనా వేశారు. పర్వతాల్లో సహాయక చర్యలు చేపట్టే సంస్థలకు చెందిన ఆరుగురు ఎగ్జిక్యూటివ్లను ఈ ఏడాది జనవరిలో అరెస్టు చేసిన తర్వాత ఈ స్కామ్ గురించి వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు 32 మందిని నేపాల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ పర్యాటకంలో ఎంతో కీలకమైన, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎవరెస్ట్ ట్రెక్కింగ్ విషయంలో జరుగుతోన్న ఈ మోసాన్ని అక్కడి న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ నెట్వర్క్‌లో భాగమైన వారికి భారీ స్థాయిలో జరిమానా విధించాలని డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి. కాగా.. పర్యాటకుల విషయంలో ఇలాంటి స్కామ్లు వెలుగుచూడటం ఇది తొలిసారేం కాదు. అందుకే ఈ మోసాల కారణంగా పలు అంతర్జాతీయ బీమా సంస్థలు ఎవరెస్ట్ విజిటర్లకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఇవ్వడం నిలిపివేశాయి. ఈ ఘటనలపై అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. కఠిన శిక్షలు లేకపోవడమే నేరాలు పెరగడానికి కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# నా చేతుల్లో ఏం లేదు
## అధికారులను నిర్బంధించడంపై దీదీ



**కోల్‌కతా, ఏప్రిల్ 2 :** పశ్చిమబెంగాల్‌లో 'సర్' విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించడంపై తీవ్ర దుమారం రేగుతోంది. దీనిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ.. అధికారుల నిర్బంధం విషయం తనకు తెలియదన్నారు. ప్రస్తుతం పరిపాలన తన చేతుల్లో లేదని వ్యాఖ్యానించారు. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడుతూ.. 'దీనికి బాధ్యులు ఎవరో నాకు తెలియదు. దీని గురించి నాకు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. పరిపాలన నా చేతుల్లో లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తుంది. వారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట వింటున్నారు. అధికారులందరినీ మార్చేశారు' అని అన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సమగ్ర సర్వేపై ప్రజలు కోపంగా ఉన్నారని మమతా వ్యాఖ్యానించారు. మాల్దాలో జరిగిన ఘటన బీజేపీ కుట్రలో భాగమని ఆరోపించారు. వారిని ఓటమి భయం వెంటాడుతుందన్నారు. అందుకే.. అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ భావిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘంపైనా ఆమె విరుచుకుపడ్డారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో వారు విఫలమయ్యారన్నారు. కాగా ఈ విషయంపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ఘటనపై సీబీఐ లేదా ఎన్ఐఏతో దర్యాప్తు చేసేందుకు ఈసీకి అనుమతిచ్చింది.

# ఇరాక్‌లో కిడ్నాపైన అమెరికా జర్నలిస్టు
## కతైబ్ హెజ్బొల్లాపై అనుమానాలు



**బాగ్దాద్, ఏప్రిల్ 2:** అమెరికాకు చెందిన మహిళా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షెల్లీ కిటెల్సన్‌ను మంగళవారం ఇరాక్‌లో దుండగులు అపహరించడం కలకలం రేపుతోంది. బాగ్దాద్‌లోని ఓ హోటల్ వెలుపల ఆమెను కిడ్నాప్ చేశారు. ఈ అపహరణ వ్యవహారంలో ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. అతడికి ఇరాన్తో సన్నిహితంగా ఉండే కతైబ్ హెజ్బొల్లా బృందాలతో సంబంధం ఉన్నట్లు తెలిపింది. కిటెల్సన్ గత వారం సిరియా నుంచి ఇరాక్‌లోకి ప్రవేశించే ప్రయత్నం చేశారని, అయితే అప్పుడు ఆమెను వెనక్కి పంపించామని ఇరాకీ అధికారులు తెలిపారు. ఆ తర్వాత 60 రోజులు చెల్లుబాటయ్యే సింగిల్ ఎంట్రీ వీసాతో ఆమె ఇరాక్‌లో ప్రవేశించినట్లు వెల్లడించారు. కిటెల్సన్ సీనియర్ జర్నలిస్ట్. చాలా ఏళ్లు ఆమె ఇరాక్, సిరియాల్లో పనిచేశారు.

# ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం
## ఎల్డీఎఫ్ మ్యానిఫెస్టోను ప్రకటించిన విజయన్



**తిరువనంతపురం, ఏప్రిల్ 2 :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి విజయం సాధిస్తే.. ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కేటాయిస్తామని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) పార్టీ ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. విస్తృత సంక్షేమం, అభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యంగా 60 పాయింట్లతో రెండు వాల్యూమ్‌లుగా దీన్ని రూపొందించారు. నెలవారీ పింఛన్ రూ.3 వేలకు పెంపు..అత్యంత పేదరికంలో ఉన్న ఐదు లక్షల కుటుంబాలను ఆదుకోవడం..బలహీన వర్గాలపై ప్రత్యేక దృష్టి.. వృద్ధులకు, మంచానపడిన రోగులకు మెరుగైన సంరక్షణ.. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కల్పించడం, నైపుణ్య శిక్షణ ప్రోగ్రామ్‌లు విస్తరించడం, 'బ్యాక్ టూ క్యాంపస్' పేరుతో ఉద్యోగం లేని వారికి నైపుణ్యాలు అందించడం..50 శాతం ఉద్యోగాలు మహిళలకు కేటాయింపు.. మహిళలు ఉద్యోగాలు చేసుకునేందుకు వీలుగా సురక్షిత ప్రయాణం, శిశు సంరక్షణ, నైపుణ్యాల్లో శిక్షణ ఇప్పించడం విద్యావంతులైనవారు చేపట్టే వ్యాపారాలకు వడ్డీ లేని రుణాలు అందించడం వంటివి మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు, సంక్షేమ పింఛను రూ.3,000కు పెంపు, కళాశాల విద్యార్థినులకు రూ.1,000 వంటివి ఉన్నాయి. దీంతోపాటు ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల బీమా కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

# దుస్సాహసానికి పాల్పడితే..!
## పాకిస్థాన్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక



**తిరువనంతపురం, ఏప్రిల్ 2 :** ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్‌ను భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరోక్షంగా హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన ఉగ్ర చర్యలపై గతంలో దీటుగా బదులిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఏడాది ఏప్రిల్లో పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న వేళ రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ''ప్రస్తుత పరిస్థితుల్లో మన పొరుగు దేశం ఏవైనా కవ్వింపు చర్యలకు పాల్పడవచ్చు. ఒకవేళ అదే జరిగితే.. భారత ప్రతిస్పందన ఊహించని రీతిలో, నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది'' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టులో డొనాల్డ్ ట్రంప్
## జన్మతః పౌరసత్వం రద్దు కేసు విచారణకు హాజరు



**వాషింగ్టన్, ఏప్రిల్ 2 :** అక్రమ వలసదారుల సంతానానికి, తాత్కాలిక నివాసితులకు పుట్టిన పిల్లలకు జన్మతః హక్కుగా లభించే దేశ పౌరసత్వాన్ని నిరాకరిస్తూ అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల చెల్లుబాటుపై అమెరికా సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. బుధవారం జరిగిన విచారణకు ట్రంప్ స్వయంగా హాజరయ్యారు. దాదాపు గంట సమయంపాటు కోర్టులో ఉండి వాదనలు విన్నారు. పౌరసత్వంపై విధించిన పరిమితులను న్యూహ్యాంప్‌షైర్ న్యాయస్థానం కొట్టివేయగా...ట్రంప్ అప్పీలు దాఖలు చేశారు. దేశంలోని పలు దిగువ కోర్టులు కూడా జన్మతః పౌరసత్వ హక్కు రద్దును తప్పుపట్టడంతో పాటు అధ్యక్షుడి ఉత్తర్వుల అమలును నిలిపివేశాయి. వీటిని సవాల్ చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ అప్పీల్ దాఖలు చేశారు. అధికారంలో ఉండగా అమెరికా సర్వోన్నత న్యాయస్థానం విచారణకు హాజరైన తొలి అధ్యక్షుడిగా ట్రంప్ నిలిచారు. దేశాధ్యక్షులకు అనుకూలమైన నిర్ణయాలను సుప్రీంకోర్టు గతంలో వెలువరించినప్పటికీ...గత తీర్పులకు విరుద్ధంగా కార్యనిర్వాహక అధికారాలను వినియోగించిన ట్రంప్‌నకు ఈ విచారణ ఓ పరీక్షగా నిలవనుంది.

## 85 వేల హెచ్1బీ వీసాల ఎంపిక ప్రక్రియ పూర్తి




**వాషింగ్టన్, ఏప్రిల్ 2 :** కొత్త ఆర్థిక సంవత్సరం 2027కు సంబంధించి నిర్దేశిత కోటా ప్రకారం 85 వేల హెచ్1బీ వీసాలకు లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు అమెరికా పౌరసత్వం, వలస సేవల సంస్థ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. అలాగే సాధారణ, ఉన్నత డిగ్రీల ఎంపిక లాటరీలను కూడా పూర్తిచేసినట్లు తెలిపింది. లబ్ధిదారులు పనిచేసే సంస్థలకు ఈ జాబితాను అందించామని, వారు హెచ్1బీ వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. ఏప్రిల్ 1 నుంచి 90 రోజుల్లోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు కొత్తగా విడుదల చేసిన ఐ-129 ఫారమ్‌ను ఉపయోగించాలని స్పష్టం చేసింది. అమెరికాలోని సాఫ్ట్‌వేర్ సంస్థలు, ఆసుపత్రులు ఎక్కువగా హెచ్1బీ వీసాల సాయంతో భారత నిపుణులను నియమించుకుంటాయి. ఇటీవల తీసుకొచ్చిన కొత్త విధానం ప్రకారం జీతం, నైపుణ్యం ఆధారంగా వీసా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. వేతనం ఎక్కువగా ఉండి, విశేషమైన నైపుణ్యాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఉంటుంది. తద్వారా మరీ అవసరమైతే తప్ప ఎక్కువ ఉద్యోగాల్లో అమెరికన్లను నియమించుకోడానికే సంస్థలు ఆసక్తి చూపిస్తాయని వీసా దుర్వినియోగం తగ్గుతుందని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది.

# ఓటరు లిస్టులో తొలగించారు..
## పోలింగ్ డ్యూటీకి పిలిచారు!
## 'సర్'లీలకు ఉద్యోగులు బలి



**కోల్‌కతా, ఏప్రిల్ 2:** పశ్చిమ బెంగాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాపై ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. ఈ జాబితా నుంచి తన పేరు తొలగించారని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆరోపించాడు. అయితే, అతడికి మరికొన్ని రోజుల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొనాలని, ఇందుకు సంబంధించిన శిక్షణకు హాజరు కావాలని ఆదేశాలు రావడం గమనార్హం.

మాల్దా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మోతాబారి గ్రామానికి చెందిన మహ్మద్ తౌసిఫ్ జమాల్.. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనరల్ డ్యూటీ అటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. పోలింగ్ ఆఫీసర్‌గా శిక్షణకు హాజరు కావాలని ప్రభుత్వం నుంచి మార్చి 19న ఆయనకు సమాచారం వచ్చింది. ఇదే సమయంలో ఎస్ఐఆర్ అనుబంధ జాబితాను విడుదల చేయగా.. అందులో జమాల్ పేరు లేదు. ఇదే విషయాన్ని శిక్షణా కేంద్రంలో ఉన్న ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరైన సమాధానం రాలేదని సమాచారం. 2017లో తనకు ఉద్యోగం వచ్చిందని, ఆ తర్వాత ఐదుసార్లు ఎన్నికల విధులు నిర్వర్తించానని జమాల్ పేర్కొన్నాడు. తాను అర్హుడైన ఓటరును కాకుంటే.. ఎన్నికల విధుల్లో ఎలా నియమిస్తారని, ఈసీ తమతో అన్యాయంగా వ్యవహరిస్తోందని వాపోయాడు.

# 'జననాయగన్' విడుదల విషయంలో కుట్ర: టీవీకే సారధి విజయ్



**చెన్నై, ఏప్రిల్ 2 :** కోలీవుడ్ నటుడు విజయ్ నటించిన సరికొత్త చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా విడుదల విషయంలో కొంతకాలంగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ సినిమా విడుదలను ఉద్దేశించి ఆయన కీలక ఆరోపణలు చేశారు. విడుదల విషయంలో కుట్ర జరుగుతోందన్నారు. తనకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు.

''కరూర్ ఘటన ఒక ఉమ్మడి కుట్ర అని చాలామంది చెబుతున్నారు. మీకు న్యాయం జరగాలని నేను ఎలా అయితే కోరుతున్నానో.. నాకు కూడా న్యాయం కావాలని కోరుతున్నా'' అని విజయ్ అన్నారు. తన సినిమా 'జననాయగన్' విడుదల విషయంలో ఏదో జరుగుతోందని ఆరోపించారు. ఎల్పీజీ సిలిండర్ల కొరతపై స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. ''తన కుటుంబానికి ఏదైనా సమస్య వస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే ఢిల్లీ విమానం ఎక్కేస్తారు.

ఎల్పీజీ సిలిండర్ల సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఆయన దేశ రాజధానికి వెళ్లరా?'' అని ప్రశ్నించారు. నటుడిగా ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్న విజయ్ తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని స్థాపించి.. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నారు. తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గంలో గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు.

# అధికారుల నిర్బంధం..
## చీఫ్ జస్టిస్ ఫోన్ చేసినా సాయం ఆలస్యం?
## సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం



**ఢిల్లీ, ఏప్రిల్ 2 :** పశ్చిమ బెంగాల్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ 'సర్' విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ఘటనపై సీబీఐ లేదా ఎన్ఐఏతో దర్యాప్తు జరిపించాలని ఎన్నికల సంఘానికి అత్యున్నత న్యాయస్థానం సూచించింది.

పశ్చిమబెంగాల్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సర్వే పేరుతో పెద్దఎత్తున ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మాల్దా జిల్లాలో బుధవారం ఆందోళనలు జరిగాయి. ఇక్కడ సర్ విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆందోళనకారులు నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని జ్యుడీషియల్ అధికారులను రక్షించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నిర్బంధానికి గురైన వారిలో ముగ్గురు మహిళా అధికారులు కూడా ఉన్నారు.

### కేంద్ర బలగాలను మోహరించండి: సుప్రీం

ఈ పరిణామలపై సుప్రీంకోర్టు గురువారం స్పందిస్తూ తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. న్యాయవ్యవస్థను అడ్డుకునేందుకు ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యేనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహించారు. ''జ్యుడీషియల్ అధికారుల మనోధైర్యాన్ని దెబ్బకొట్టి 'సర్' ప్రక్రియను ఆపేందుకు కుట్రపూరితంగా ఈ ఘటనకు పాల్పడ్డారు. ఆందోళనకారుల ఘెరావ్ గురించి మధ్యాహ్నమే సమాచారం అందినా రాష్ట్ర అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సాయం కోసం స్వయంగా కలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ హోం సెక్రటరీ, డీజీపీకి ఫోన్ చేయాల్సివచ్చింది. వారి నుంచి ఆదేశాలు అందినా జిల్లా సీనియర్ అధికారులు ఘటనా స్థలానికి రాలేదు. రాత్రి 11 గంటల వరకూ వారికి ఎలాంటి సాయం అందలేదు. ఈ ఘటనలో రాష్ట్ర అధికారుల ప్రవర్తన అత్యంత విచారకరం. ఇది కోర్టు అధికారాన్ని సవాల్ చేసినట్లే. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడానికి మేం ఎన్నటికీ అనుమతించబోం'' అని సుప్రీంకోర్టు మండిపడింది. బెంగాల్లో ప్రతిఒక్కరూ రాజకీయ భాషే మాట్లాడుతున్నారని సీజేఐ అసహనం వ్యక్తంచేశారు. ''తప్పు ఎవరు చేస్తున్నారో మాకు తెలియదనుకుంటున్నారా? ఈ ఘటనను నేను తెల్లవారుజామున 2 గంటల వరకు పర్యవేక్షిస్తూనే ఉన్నా. ఇది చాలా దురదృష్టకరం'' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై పలువురు రాష్ట్ర అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జ్యుడీషియల్ అధికారుల భద్రత కల్పించడంతో పాటు 'సర్' ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ ఘటనపై సీబీఐ లేదా ఎన్ఐఏతో దర్యాప్తు చేసేందుకు ఈసీకి అనుమతిచ్చింది.

# హర్మూజ్ను తెరిచేందుకు 40దేశాల ప్రయత్నాలు.. భారత్కూ ఆహ్వానం

**ఢిల్లీ, ఏప్రిల్ 2 :** హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు బ్రిటన్ నేతృత్వంలో ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందుకు మార్గాలను అన్వేషించేందుకు ఓ సమావేశం ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 40కిపైగా దేశాలను ఆహ్వానించగా.. ఆ జాబితాలో భారత్ కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ధ్రువీకరించిన కేంద్ర ప్రభుత్వం.. భారత్ తరఫున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఇందులో వర్చువల్గా పాల్గొంటారని తెలిపింది.ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం అనేక దేశాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్న విషయం తెలిసిందే. అయితే సమావేశంలో అమెరికా పాల్గొనడం లేదు.
మరోవైపు, జలసంధిలో నౌకలు నిరాటంకంగా, సురక్షితంగా వెళ్లేలా చూసేందుకు ఇరాన్ సహా అనేక దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నామని భారత్ పేర్కొంది. ఇది సత్ఫలితాలనిస్తోందని విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ వెల్లడించారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యత నాదే

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ, ఏప్రిల్ 2 (మనం ప్రతినిధి ):** ప్రతి ఎకరాకు సాగునిరు అందించే బాధ్యత నాదే అని రాష్ట్ర రోడ్డు భవనాలు మరియు సినిమాటోగ్రాఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక సభ తిప్పర్తి గ్రామ సర్పంచ్ బద్దం రజిత సుధీర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మరియు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ లు ముఖ్యతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకొని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవడం, అలాగే గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై చర్చ జరిగింది.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, తిప్పర్తి మండల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజల వినతులను స్వీకరించి, సత్వర పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు.కనగల్ తిప్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 52 కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత ప్రతి ఇంటికి రెండు వందల యూనిట్ల కరెంట్ ను ఉచితంగా అందిచడం జరిగిందన్నారు.

ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు లు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రతి లబ్ది దారునికి ఐదు లక్షలు రూపాయలు మంజూరు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వ దే అన్నారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్ రెవిన్యూ డి విజినల్ అధికారి అశోక్ రెడ్డి తహసీల్దార్ రాచకొండ రామకృష్ణ ఇంచార్జి ఎంపీడీఓ జానయ్య మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి డీసీసీ ఉపాధ్యక్షుడు చితకుంట్ల రవీందర్ రెడ్డి సర్పంచ్ లు ఏనుగు సతీష్ రెడ్డి ముత్తినేని శ్యామసుందర్ కోన వెంకన్న మాజీ సర్పంచ్ లు గుండా సత్యనారాయణ జాకటి మోష రొట్టెల రమేష్ మాజీ ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య మాజీ కో ఆప్షన్ మెంబెర్ సోహెల్ అన్సారీ అధికారులు వార్డు మెంబర్లు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ మహిళా కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



**కోదాడ, ఏప్రిల్ 02(మనం న్యూస్):** స్థానిక కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ తెలిపారు. హైదరాబాద్ కు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఐన బజాజ్ ఫింసెర్వ్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బజాజ్ ఫింసెర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ మానవ వనరుల నిర్వహణ అధికారి మధు రిక్రూట్మెంట్ హెడ్ నిఖిల్, మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపిక లలో కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థినులు 20 మంది ఎంపిక అయ్యారు. ఎంపిక అయిన విద్యార్థి నులకు వార్షిక వేతనం 250000 రూపాయలు ఉంటుందని కంపెనీ మానవ వనరుల అధికారులు మధు, రిక్రూట్మెంట్ హెడ్ నిఖిల్, మాధవి తెలిపారు. ప్రాంగణ ఎంపికలకు ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ చరవాణి ద్వారా అభినందించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళపల్లి గాంధీ, డైరెక్టర్ డాక్టర్ నాగార్జున రావు, టీపీవో పుష్ప లత, అధ్యాపకులు అభినందించారు.



## ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మందుల సామేలు

**తిరుమలగిరి ఏప్రిల్ 02 (మనం న్యూస్):** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం తిరుమలగిరి మున్సిపాలిటీలోని ఐదు, ఆరు ఏడు వార్డులలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభను నిర్వహించారు. ఈ సభలో సామేలు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చాక ఎన్నో రోజుల నుండి ఇవ్వకుండా పెండింగ్ లో ఉన్న రేషన్ కార్డులను తిరుమలగిరి నుండే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందించడం జరిగిందని చెప్పారు. ప్రతి రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామన్నారు. తొండ గ్రామంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూలును ఏర్పాటు చేసుకుంటున్నామని అది పూర్తయినట్లయితే ఈ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. విద్యార్థులకు కాస్మోటిక్ మెస్స్ చార్జీలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందన్నారు. రైతుల సన్నధాన్యానికి తిరుమలగిరి మండలంలో ఒక కోటి 93 లక్షల రూపాయల బోనస్ అందించడం జరిగిందని చెప్పారు.

## వీ-హబ్ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

- మహిళలు నైపుణ్యాలు పెంచుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- వీ-హబ్ ద్వారా మహిళలకు వ్యాపార నైపుణ్యాల శిక్షణ
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఏప్రిల్ 02 (మనం ప్రతినిధి):** వీ-హబ్ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం పెద్దపల్లి వీ-హబ్ నైపుణ్యాల శిక్షణా కేంద్రంలో సెర్ప్ సంస్థకు చెందిన ఏపీఎంలు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు, మండల సమాఖ్య అధ్యక్షులకు వీ-హబ్ కార్యక్రమాల పై నిర్వహించిన టీఓటీ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని స్వశక్తి సంఘాల మహిళలకు కొత్త వ్యాపార నైపుణ్యాలు నేర్పించి పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి పెద్దపల్లి జిల్లాలో వీ-హబ్ నైపుణ్యాల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే మహిళలకు బ్యాంకుల నుండి రుణాలు పొందడం, ఉత్పత్తులకు బ్రాండింగ్, లేబులింగ్ చేయడం, మార్కెట్లో స్థిరపడడం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ ఇక్కడ అందిస్తున్నామని అన్నారు.ఇప్పటికే చిన్న స్థాయిలో వ్యాపారం చేస్తున్న మహిళలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు కూడా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. డిగ్రీ, బీటెక్ వంటి ఉన్నత చదువులు అభ్యసిస్తున్న యువతులకు ఉద్యోగ అవకాశాల కోసం అవసరమైన ఇంటర్వ్యూ నైపుణ్యాలు కూడా ఈ కేంద్రంలో అందిస్తున్నామని చెప్పారు.జిల్లాలోని స్వశక్తి సంఘాల మహిళలందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగేందుకు సెర్ప్ సిబ్బంది, మండల సమాఖ్య అధ్యక్షులు సమిష్టిగా కృషి చేయాలని, విహబ్ అధికారులు ఈ దిశగా ప్రత్యేకంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. మన జిల్లాలోని వీ-హబ్ సాధించే విజయాల పరిశీలించి ఇతర జిల్లాలో కూడా వీహబ్ కేంద్రం ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఇతర జిల్లాలకు ఆదర్శవంతంగా నిలిచే విధంగా మన విహబ్ కేంద్రం విజయవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ కాలిందిని, అదనపు డిఆర్డిఓ బి. రవీందర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, వీ-హబ్ డైరెక్టర్ జైహింద్, అసోసియేట్ డైరెక్టర్ ఉష, ప్రోగ్రాం మేనేజర్లు తాజ్, అబిద్, శివ తదితరులు పాల్గొన్నారు.



## మండల కేంద్రంలో బడిబాట నిర్వహణ

**పాలకీడు, ఏప్రిల్ 02 (మనం న్యూస్):** మండల పరిధిలోని బత్తుల పాలెం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, మంచి అర్హత అనుభవం కలిగి న ఉపాధ్యాయులచే విద్యను అభ్యసిస్తారని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఇష్టపడి చదువుకుంటారని దానివలన విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాగరాజు, రామయ్య, నాగయ్య, సునీత, శేఖర్, మాధవి, వినీత, తదితరులు పాల్గొన్నారు.

## తాటిపాములలో ఘనంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికసభ



**తిరుమలగిరి ఏప్రిల్ 2 (మనం న్యూస్):** తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామపంచాయతీ కార్యాలయంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభను సర్పంచ్ బోయపల్లి కిషన్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేస్తూ పేద ప్రజలకు అందిస్తుందని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ 6000 లు అందిస్తుందని, ఇందిరమ్మ ఇండ్లు ఒక్కొక్క ఇంటికి ఐదు లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం అందిస్తుంది.మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం అందిస్తుందని, సన్న రకం వడ్లను కొనుగోలు చేసి రైతులకు బోనస్ ఇవ్వడా, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు అందిస్తుంది. కల్యాణ లక్ష్మి షాది ముబారక్ ద్వారా లక్ష 16 రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుందని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు కుటుంబంలో కొత్తగా సభ్యులు చేరని వారి కి కూడా రేషన్ కార్డులో చేర్చడం జరిగిందని, ప్రతి రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం అందిస్తుందని చెప్పారు. స్థానిక సర్పంచ్ కిషన్ మాట్లాడుతూ గ్రామంలోని ఇప్పటికే అన్ని బజార్లకు సిసి రోడ్లు ఏర్పాటు చేశామని,మహిళలు సమావేశం ఏర్పాటు చేయడం కోసం రెండు సంఘ బంధాలకు ఒక్కో భవనానికి పది లక్షల రూపాయల చొప్పున రెండు సంఘ బంధాల భవనాలను నిర్మించడం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని చెప్పారు. తాటిపాముల గ్రామం నుండి వస్తా కొండూరు గ్రామానికి వెళ్లడానికి బిక్కేరు వాగు పైన 25 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం, చెక్ డాం నిర్మాణం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. తాటిపాముల గ్రామంలోని కొత్తపెల్లి గ్రామం వైపు వెళ్లే దారి నందాపురం వెళ్లే దారి రాయకుంటకు వెళ్లే దారి జానకిపురం వెళ్లే దారి వేసవిలో కంకరతో పటిష్టంగా రోడ్డు ఏర్పాటు చేసుకోబోతున్నామని చెప్పారు. బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి గ్రామంలోని పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి వార్డులో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు ఊరిలో శుభ్రం చేయడం, గ్రామంలోని ప్రతి వీధిలో రాత్రి వేళల్లో వీధి దీపాలను వెలిగిస్తున్నామని తెలిపారు. మంచినీటికి ఇబ్బంది జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రతి ఇంటికి మంచినీటి కొరత లేకుండా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఎక్కడ చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే దానిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు రానివారికి రెండో విడతగా ఇళ్లను మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తో మాట్లాడి మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హరిప్రసాద్, నాగారం సీఐ నాగేశ్వరరావు, ఎస్సై వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ బోనాసి ఎల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డ్ మెంబర్లు వివిధ శాఖల అధికారులు మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**భీమదేవరపల్లి ఏప్రిల్ 2 మనం న్యూస్:** ఎలుకతుర్తిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజ్ ప్రారంభించారు. గురువారం రోజున ఎలుకతుర్తిలో విశాల సహకార సంఘం సహకారంతో ఏర్పాటుచేసిన ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ భీమదేవరపల్లి , ఎల్కతుర్తి మండలాల పరిధిలోని గ్రామాల రైతులు కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్న పంట దిగుబడింది తీసుకొని రావాలని కోరారు. కనీస మద్దతు ధర క్వింటాకు 2400 అని, మొక్కజొన్న గింజల నాణ్యతా ప్రమాణాల బట్టి కనీస మద్దతు ధర ఉంటుందని, ఎండబెట్టి శుభ్రపరచిన, అంట దిగుబడికి నాణ్యత ప్రమాణాల అనుసరించి కనీసం మద్దతు ధర రైతులు పొందాలని విజ్ఞప్తి చేశారు. రైతులు తమ వెంట బ్యాంక్ అకౌంట్, పట్టాదారి పాసుబుక్, ఆధార్ జిరాక్సను తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, ఎల్కతుర్తి గ్రామ సర్పంచ్ కమిటీ సభ్యులు మొండయ్య, తదితర కమిటీ సభ్యులు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## అర్హులందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లు!



- వార్డు సభలో ఎమ్మెల్యే కాలే యాదయ్య భరోసా

**చేవెళ్ల ఏప్రిల్ 02 (మనం న్యూస్):** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య స్పష్టం చేశారు. చేవెళ్ల మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రగతి - ప్రణాళిక 99 రోజుల' కార్యక్రమంలో భాగంగా జరిగిన వార్డు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్ వంటి హామీలను విజయవంతంగా అమలు చేశామన్నారు. నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడతలో మరో 3,500 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలనతో పట్టణాలు పరిశుభ్రంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి
- తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు వృద్ధాప్యంలోవారి పోషణ పిల్లల బాధ్యత
- రోడ్డు ప్రమాదాలు సైబర్ మోసాలు డ్రగ్స్ వినియోగం సమాజాన్ని పీడిస్తున్న అంశాలు
- జిల్లా ఎస్పీ కే నరసింహ



**సూర్యాపేట, ఏప్రిల్ 02 (మనం ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చివ్వెంల మండలం తిరుమలగిరి గ్రామంలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ పాల్గొన్నారు. ముందుగా గ్రామ పరిపాలన అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు గ్రామం యొక్క అభివృద్ధి, గ్రామ చరిత్ర, ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల వివరాలు, ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని గ్రామ అభివృద్ధికి ప్రజలు భాగస్వామ్యం కావాలని గ్రామసభ నిర్వహణ అధికారులు గ్రామస్తులకు వివరించారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖ రూపొందించిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన ఉద్యమ కరపత్రాలను గ్రామస్తులతో కలిసి ఎస్పీ ఆవిష్కరించారు. రోడ్డు నియమ నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలుపుతూ రూపొందించిన కరపత్రాలను గ్రామస్తులకు, విద్యార్థులకు యువతకు, అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి పరణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈరోజు గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగిందని ఈ గ్రామసభ గ్రామ అభివృద్ధికి దిక్సూచిగా ఉంటుందని తెలిపారు. గ్రామాభివృద్ధికి కావలసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలను క్రింది స్థాయి గ్రామస్తుల వరకు ప్రతి పేదకు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టంగా పనిచేస్తున్నామని, ప్రజల రక్షణలో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీసులు ఉన్నది ప్రజల రక్షణ కోసమేనని మంచివారికి మిత్రులుగాను చెడ్డవారి పట్ల చట్టాన్ని అమలు చేసే వారిగాను ఉంటామని అన్నారు. ప్రజలు శాంతి సామరస్యాలతో ఉండాలని గ్రామాలలో చిన్న చిన్న సమస్యలకు గొడవలు పెట్టుకోవడం దాడులు చేసుకోవడం చేసుకోవద్దని తెలిపారు, సమస్యలను సామరస్యంగా పెద్దమనుషుల సమక్షంలో చట్ట పరిధిలో పరిష్కరించుకోవాలని కోరారు. సామాజిక అంశాల గురించి సామాజిక భద్రత గురించి పౌరుల సత్ప్రవర్తన గురించి చట్టాల అమలు గురించి జిల్లాలో పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించి సుమారు 300కు పైగా గ్రామాలలో గ్రామస్తులను చైతన్యపరిచామని తెలిపారు. ఈ పోలీసు ప్రజా భరోసా ద్వారా చెడు ప్రవర్తన కలిగిన వారిలో మార్పు తేవడానికి గ్రామాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించమని తెలిపారు. ప్రస్తుత సమాజంలో సమాజాన్ని పీడిస్తున్న అంశాలు రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వినియోగం, సైబర్ మోసాలు వీటిని నివారించాలంటే అవగాహన అప్రమత్తతే ముఖ్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నిర్మూలించి రోడ్డు ప్రమాదాలలో ఏ ఒక్క ప్రాణం పోకూడదని ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడమే లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ అనే రోడ్డు భద్రత మహా ఉద్యమ కార్యక్రమం తీసుకురావడం జరిగిందని దీనిలో భాగంగా ప్రతిరోజు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రయాణ సమయంలో డిఫెన్స్ డ్రైవింగ్ చేయాలని, రోడ్లపై ఉన్న పరిస్థితులను, ప్రమాదాలను అంచనా వేసి ముందుకు సాగాలని కోరారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని, పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు.ఈ కార్యక్రమం నందు స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, స్థానిక ఎస్సై మహేష్, గ్రామ సర్పంచ్ నగేష్, ఉప సర్పంచ్ వెంకట రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరసింహా చారి, వార్డు సభ్యులు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ దయాకర్, గ్రామ కార్యదర్శి కవిత, హౌసింగ్ ఏఈ ప్రేమలత, మెడికల్ ఆఫీసర్ మణికంఠ, గ్రామ పోలీసు అధికారి కృష్ణయ్య, గ్రామ పౌరులు, గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు ఉన్నారు.

## టీయుఎఫ్ మండల అధ్యక్షులుగా కోళ్ళూరి వెంకటేశ్వర్లు



**కోదాడ, ఏప్రిల్ 02(మనం న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యాపేట జిల్లా కోదాడ మండల అధ్యక్షులుగా కోళ్ళూరి వెంకటేశ్వర్లు ని ఏకగ్రీవంగా ఎన్నుకొని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపకులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాలతో, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అలాగే స్వతంత్ర సమరయోధులను గుర్తించినట్లుగా తెలంగాణ ఉద్యమకారులను కూడా గుర్తించాలని, వారికి గుర్తింపు కార్డులను ఇచ్చి రైలు, బస్సుల లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, 250 చ:గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇంటి ని నిర్మించాలని, ఉద్యమకారులకు పెన్షన్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఏనుగుల ఎల్లేశ్వరరావు, బాలెబోయిన ఏడుకొండలు, హసన్ అలీ, కొత్త శ్రీనివాసరావు, జిల్లా బోస్ బాబు, బట్టు నాగయ్య, బానోత్ ముని, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలుతో పేదల జీవితాలలో కాంతి వెలుగులు

## మహిళా సాధికారతకు చిహ్నం మహిళా సమాఖ్య భవనం


## ఐక్యత ప్రతిరూపంగా మహిళా సంఘాలు

## ప్రతి మహిళ మహిళా సంఘాలలో చేరాలి: మంత్రి సీతక్క



**ములుగు, ఏప్రిల్ 2(మనంప్రతినిధి):** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా పేదల జీవితాలలో వెలుగు కాంతులు వెళ్లి విరుస్తున్నాయని, మహిళా సాధికారతకు సమాఖ్య భవనాలు చిహ్నంగా ఉంటాయని, రాష్ట్రంలోని మహిళా సంఘాలు ఐక్యతకు ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని పి వి కన్వెన్షన్ హాలు లో ప్రజాపాలన ... ప్రగతి ప్రణాళిక గ్రామ సభ కు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరు అయ్యారు. రాష్ట్ర గీతం తో గ్రామ సభ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పై రాష్ట్ర ముఖ్య మంత్రి గారి ప్రసంగాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజల జీవితాలలో వెలుగులు వెళ్లి విరుస్తున్నాయని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సాధించిన విజయాలు,అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గూర్చి గ్రామాలలో ఉండే ప్రతి ఒక్కరికి తెలియజేయడం జరుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని, ఇందిరమ్మ ఇల్లు వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి పథకాలు అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 4 లక్షల 70 వేల మహిళా సంఘాల వారికి వడ్డీ లేని రుణాలను అందించి వివిధ వ్యాపారాలు చేసుకోవడానికి ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, వ్యాపారంలో భాగస్వాములైన మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు వెంకటాపూర్ గ్రామంలో శెట్టి జయ - సదానందం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమానికి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి హాజరయ్యారు. వెంకటాపూర్ మండల కేంద్రంలో ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ అంచనా విలువ ర్యూ 10 లక్షల నిధులతో మహిళా సమాఖ్య భవన నిర్మాణము పనులకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ సుగుణ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**దుగ్గొండి, ఏప్రిల్ 2 (మనం న్యూస్):** దుగ్గొండి మండలంలోని వెంకటపురం గ్రామానికి చెందిన ఏరుకొండ రాయమల్లు 24000 రూపాయలు మరియు ఊరెడి జయపాల్ 17000 రూపాయలు కు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు మాజీ సర్పంచ్ ఇంగోలి రాజేశ్వరరావు గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాటే రవి నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఏడాకుల రమణారెడ్డి వార్డు సభ్యులు ఊరేటి లింగం ఇటికాల మౌతిక్ గుండెబోయిన రాజు మంద ప్రమీల అనిల్ నాంపల్లి రాజయ్య గ్రామ నాయకులు ఏడాకుల లింగారెడ్డి బోరాల లింగమూర్తి సింగిరెడ్డి మల్లారెడ్డి సార రమేష్ ఇంగే నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సుడి గుండంలో గ్రామ సభలు

- తాగునీటి సమస్యపై ప్రజల అగ్రహం
- సీసీ రోడ్ల నిధుల కొరత, పెన్షన్ల మంజూరు కై నిలదీత




**భీమదేవరపల్లి ఏప్రిల్ 2 మనం న్యూస్:** ప్రజా సమస్యల ప్రశ్నలతో గ్రామ సభలు సుడిగుండంలో చిక్కుకున్నాయి. గురువారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గ్రామపంచాయతీలలో గ్రామ సభలు ప్రత్యేక అధికారుల సమక్షంలో ఏర్పాటు చేయగా మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు సాగినీటి సమస్యపై ప్రధానంగా ఎత్తి చూపారు. గట్ల నర్సింగాపూర్ గ్రామసభలో అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజ్ ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు జరగగా, గ్రామంలో నిధుల కొరత ఎందుకు ఏర్పడింది అభివృద్ధి పనులు జరగకపోవడం కారణం అని ప్రజలు నిలదీశారు. ఈజీఎస్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించకపోవడంతో అభివృద్ధి కుంటపడిందని స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ సమయాన్ని తీసుకొని నిధులు ఏర్పాటు చేయాలని కోరి అభివృద్ధిచేపడతామని సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ ప్రజలకు హామీ ఇచ్చారు. కొత్తకొండ గ్రామ సభలో అక్రమ పెన్షన్స్ తొలగించాలని, కొత్తగా పెన్షన్లు దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్స్ మంజూరు చేయాలని ప్రజలు కోరగా తెలంగాణ ప్రభుత్వం అర్హులైన పెన్షన్ దారులకు మంజూరు చేస్తుందని గ్రామంలో అర్హులైన అందరికీ మంజూరు సహకరిస్తామని సర్పంచ్ సిద్ధఇచ్చారమా రమేష్ హామీ ఇచ్చారు. ముస్తావాపూర్ గ్రామసభలో వాడలలో సిసి రోడ్ల ఏర్పాటుకు వివాదం చోటు చేసుకోగా సిసి రోడ్ల ఏర్పాటుకు మంజూరైన నిధులు దుర్వినియోగం కాకుండా అవసరమైన సిసి రోడ్లు వేసామని, అభివృద్ధికి సహకరించాలనిసర్పంచ్ సుజాత రఘుపతి రెడ్డి కోరారు. భీమదేవరపల్లి గ్రామ సభలో పెన్షన్ మంజూరు కై ఒంటరి మహిళ తోపాటు, వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని అధికారులను నిలదీశారు. మండల పరిధి గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, సర్పంచులు ఉప సర్పంచులు, పాలకవర్గ సభ్యులు ప్రజాప్రతినిధులు మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



**భీమదేవరపల్లి ఏప్రిల్ 2 (మనం న్యూస్):** పాడి రైతులు పశువుల ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలని మల్లారం సర్పంచ్ గూడెల్లి కల్పనా తిరుపతిరెడ్డి సూచించారు. గురువారం గాలి కుంట వ్యాధికి నివారణకు చేపట్టిన వాక్సినేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్లారం సర్పంచ్ కల్పన తిరుపతిరెడ్డి హాజరై పశువులకు గాలికుంట వ్యాధి వైరస్ల వల్ల వ్యాప్తి చెందుతుందని ఈ వైరస్ సంక్రమణ వల్ల లింక్ నో నోడ్ వాపు, జ్వరం పశువులు మేత తీసుకోవడం కష్టం కావడం వల్ల వారి తీవ్రమైతే మరణం సంభవిస్తుందని వాక్సినేషన్ ద్వారా నివారించవచ్చని తెలిపారు. అనంతరం పశువైద్యశాల సిబ్బందితో పాటు పశువులకు గాలికొండ వ్యాధి రాకుండా ఉండేందుకు వాక్సినేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవి, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై గ్రామ పంచాయతీలో గ్రామ సభ



**మహాదేవపూర్ ఏప్రిల్ 2మనం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహాదేవపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ అధ్యక్షతన ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి సమక్షంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై గ్రామసభ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిజ్ఞ ను వినిపించి సర్పంచ్ ఆహ్వానంతో రాష్ట్రీయ గీతంతో మొదలు చేసి ప్రభుత్వం అమలుచేసిన వివిధ సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించడం తో పాటు ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున కొత్త పథకాలు గురించి చర్చించడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ,రెవెన్యూ అధికారి డిప్యూటీ తహసీల్దార్, సిడిపిఓ రాధిక,ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి కల్పన , కమ్యూనిటీ కోఆర్డినేటర్ బంధం స్వామి, ఎంఈఓ పురుషోత్తం,మహిళ సంఘాలు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు, వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలన – ప్రగతి ప్రాణాలిక




**మహాదేవపూర్, ఏప్రిల్ 2 మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలలోని ఎడపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మోతే నీలరాణి సాంబయ్య ఆధ్వర్యంలో ఈరోజు గ్రామసభ నిర్వహించడం జరిగింది ప్రజా పాలనలోప్రజలనుభాగస్వాములు చేయడం కోసం ప్రభుత్వ పథకాలపై చర్చ లబ్ధిదారుల అభిప్రాయాలు అవసరాలు గ్రామ సమస్యలు పారిశుధ్యం పథకాలపై ప్రధాన చర్చప్రజాసంక్షే మపథకాలు రైతు భరోసా పథకంసన్న వడ్లకొనుగోలు బోనస్ ఇందిరమ్మ ఇల్లు జీవిత బీమమహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 500 కి గ్యాస్ సిలిండర్ చేయూత పింఛన్లు గృహ జ్యోతి కల్యాణ లక్ష్మి కొత్త రేషన్ కార్డు వెలుగు పథకం కుటుంబ భీమా పథకం గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇంటర్మీడియట్ వరకు అల్పాహారం మధ్యాహ్న భోజనం గ్రామ అభివృద్ధికై అర్హులైన వారు ప్రభుత్వపథకాలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మోతే నీలరాణి సాంబయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఏఈఓ ధర్మేందర్,జీపీఓ బౌతు రాజశేఖర్, ఉపసర్పంచ్ గోగుల రాజముద్దులకృష్ణ, గ్రామ కార్యదర్శి మహేష్,వార్డు సభ్యులు కుమ్మరి రాజమణి, కన్నూరి పద్మ, కుమ్మరి రజినికుమార్, చేకూర్తి శేఖర్ మహిళా సంఘాల అధ్యక్షురాలు చేకూర్తి సౌందర్య,విఓఏ కుమ్మరి భారతి,ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం శ్రీమంజరి, అంగన్వాడీ టీచర్లు, రేషన్ డీలర్, గ్రామ పెద్దలు చేకూర్తిమల్లయ్య, కుమ్మరిరామచంద్రం, కుమ్మరి రాజ్ కుమార్, సొన్నారి రాజ్ కుమార్, అయిల్లా సమ్మయ్య, చేకూర్తి దేవరాజ్, కన్నూరి రవి తదితరులు హాజరవడం జరిగింది.

కార్యక్రమం అనంతరం గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యర్థులను సర్పంచ్ మోతే నీలరాణి సాంబయ్య సన్మానించారు.

# ఢిల్లీ పీఠాన్ని వణికించిన పాపన్న



**భీమదేవరపల్లి, ఏప్రిల్ 2 మనం న్యూస్:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం మల్లారం గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షులు చింతరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్లారం గ్రామ సర్పంచ్ కల్పనా తిరుపతిరెడ్డి హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ గడ్డమీద వరంగల్ జిల్లాలో జన్మించిన పాపన్న గౌడ్ భూసంలో అధిపత్యాన్ని ఎండగడుతూ సామాన్యులకు భూమిని పంపిణీ చేస్తూ పోరాడిన యోధుడు అని 12 మందితో ప్రారంభించిన పాపన్న సైన్యాన్ని 12 వేలకు చేర్చి హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఆక్రమించి ఢిల్లీ పీఠాన్నివణికించిన తెలుగు తేజమని తెలంగాణ చరిత్రలో నిలిచిపోయిన నాయకుడు అని బహుజనులకు స్ఫూర్తి వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపగాని సుమన్, గౌడ సంఘ నాయకులు సభ్యులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ప్రగతి ప్రణాళిక గ్రామసభ విజయవంతం



**వరంగల్, ఏప్రిల్ 2(మనంన్యూస్):** సంగెం మండలం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ ఉపసర్పంచ్ గుగులోత్ వినోదరవీందర్ నాయక్ దంపతులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు, వివిధ సంక్షేమ పథకాలు, 99 రోజుల కార్యచరణ (ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక) గురించి గ్రామ ప్రజలకు వివరంగా తెలియజేశారు. అదేవిధంగా గ్రామంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు మరియు భవిష్యత్ కార్యాచరణపై గ్రామసభలో చర్చించి పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపించాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పాన్ని ఈ గ్రామసభ మరోసారి స్పష్టం చేసింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా ఏ పీ ఓ , ఈ జి ఎస్ శాఖ ఆఫీసర్ పాల్గొన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్, గ్రామ వార్డ్ సభ్యులు కాంగ్రెస్ నాయకులు , అంగన్వాడీ కేంద్రం నుండి టీచర్ ,ఆశవర్కర్ పాఠశాల ఉపాధ్యాయులు, ,ఎలక్ట్రికల్ లైనమెన్, మహిళా సంఘం నాయకురాలు,గ్రామ ప్రజలు నాయకులు తదితరులు హాజరయ్యారు.

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా అజ్మీర కృష్ణవేణి నాయక్



**ములుగు జిల్లా ఏప్రిల్ 2 న్యూస్:** ములుగు జిల్లా భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకురాలు అజ్మీర కృష్ణవేణి నాయక్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేయడం జరిగింది ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు అధికారికంగా ప్రకటించారు అజ్మీర కృష్ణవేణి నాయక్ గతంలో ములుగు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం మరియు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా గతంలో బాధ్యతలు నిర్వహించడం ద్వారా బిజెపి పార్టీకి విశిష్ట సేవలు అందించడం కృష్ణవేణి నాయక్ కు ములుగు నియోజకవర్గంలో మొదటి నుండి బిజెపి లోనే నిరంతరం సేవలందిస్తూ ప్రజల కోసమే అని క్షణం తపిస్తూ ఉండడం మా బంజర జాతికి సంతోషం కరమైన విషయం కావున బంజారా కుల సంఘాల తరపున బిజెపి పార్టీ తరపున కృష్ణవేణి నాయక్ కి నామినేట్ పదవి ఇవ్వాలని బంజారా సంఘాల నాయకులు కోరుచున్నారు కావున తప్పకుండా భారతీయ జనతా పార్టీ లో నామినేట్ పదవి ఇవ్వాలని బంజారా సంఘాలు కోరుచున్నారు

# వధూవరులను ఆశీర్వదించిన మాజీమంత్రి



**హనుమకొండ,ఏప్రిల్ 2(మనంన్యూస్):** హనుమకొండ జిల్లా ఏ ఆర్ ఆర్ పెద్దమ్మ గడ్డ కన్వర్షన్ హాల్ లో జరుపుల సూర్య కళ రమేష్ కుమార్తె కావేరి అమూల్య పొరిక అర్పిత ఉత్తమ్ కుమార్ కుమారుడు రోహిత్ మ్యారేజ్ ఘనంగా నిర్వహించడం జరిగింది. వివాహ మహోత్సవ నీకి హాజరైన ముఖ్య నాయకులు మాజీ మినిస్టర్ పోరిక జగన్ నాయక్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్, ప్రొఫెసర్ సురేష్ లాల్, పోరిక శ్యామల నాయక్, మూడు భారతీయ నాయక్, పోరిక విజయ్ కుమార్, వగావత్ వరుణ్ నాయక్,సజన్ నాయక్, లావుడియా పల్లవి రాజు నాయక్, భూక్య శ్రవణ్ కుమార్, పోరిక రామన్న నాయక్, పోరిక కవిత విజయ్ కుమార్, కొర్ర విమల జట్ మాల్, నారాయణ సింగ్, హనుమంతు నాయక్, సక్రు నాయక్, ధరమ్ సింగ్, రవినాథ్, బిజెపి రాజు నాయక్, హరికృష్ణ, బాలకృష్ణ, మోహన్ లాల్, ఉదయ్ సింగ్, సురేష్, యమున విష్ణు, లత వేణు, గోపాల్, సంగీత రవీంద్ర, వనిత మధుసూదన్, ప్రియతమ్ కుమార్, విజయ్ కుమార్, వేణుగోపాల్, నాయక్, ప్రమీల సమ్మయ్య, శారద సారయ్య, అమృత సమ్మయ్య, విమలాబాయి పదం సింగ్, విజయ నారాయణ సింగ్, సుజాత దేవ్ సింగ్, చంద్రకళ శ్రీనివాస్, పొరిక సునీల్ నాయక్, భరత్ కుమార్ మొదలైన వారు వివాహ మహోత్సవ నాకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం పాల్గొన్నసర్పంచ్

**వరంగల్, ఏప్రిల్ 2(మనంన్యూస్):** పెద్ద తండ గ్రామపంచాయతీలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అనంతరం మాట్లాడుతు మా గ్రామౌలో డీలర్ షాపు లేదు అందుకుతమ గ్రామంలొ ప్రస్తుతం షాపూర్ డీలర్ను ఇంచార్జి ఇచ్చిరు అందులో భాగంగా మా గ్రామం లొ రెగ్లర్ డీలర్ షాపు ఉండాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చడానికి సన్న బియ్యం పథకం తీసుకొచ్చి ఈరోజు ప్రతి పేదవాడికి కడుపునిండా అన్నం పెడుతున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెలతో మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇవ్వడం జరుగుతుంది ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము రేషన్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ ఉపసర్పంచ్ లను పెద్దతండ గ్రామంలో రేషన్ డీలర్ షాప్ తప్పకుండా శాంక్షన్ చేయించాలని సర్పంచ్ ఉప సర్పంచ్లను గ్రామ ప్రజలు విన్నపించుకున్నారు రేషన్ షాప్ తప్పకుండా ఎమ్మెల్యే మినిస్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా వచ్చేటట్టు చూడాలని సర్పంచ్ ఉప సర్పంచ్ కోరడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్స్ ప్రజలు పంచాయతీ సెక్రటరీ డీలర్స్ మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభల నిర్వహణ

**దుగ్గొండి, మనంన్యూస్):** ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి పరిష్కరించేందుకు గ్రామ సభలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ముఖ్య అతిథులుగా మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు మరియు ఎంపీడీవో అరుంధతి దుగ్గొండి మండల వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నరు. గ్రామ సభను ఉద్దేశించి ప్రజా ప్రతినిధులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి తగిన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించడం ద్వారా సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.






# కేకేఆర్ ముందు భారీ టార్గెట్!

ఐపీఎల్ 2026 సీజన్లో సన్రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు తమ ప్రతాపాన్ని చూపించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్కు దిగిన ఆరెంజ్ ఆర్మీ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 226 పరుగుల భారీ స్కోరు సాధించి, కేకేఆర్ ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచింది. వీరిద్దరూ ఇచ్చిన మెరుపు ఆరంభంతో హైదరాబాద్ స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఆ తర్వాత కూడా పరుగుల వేగం తగ్గకుండా హెన్రిచ్ క్లాసెన్ హాఫ్ సెంచరీతో రాణించారు. నితీష్ కుమార్ రెడ్డి కూడా పర్వాలేదని పించారు. వీరిద్దరి మెరుపులతో సన్రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో భారీ స్కోరును బోర్డుపై ఉంచగలిగింది. 227 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగుతున్న కోల్కతా నైట్ రైడర్స్.. హైదరాబాద్ బౌలింగ్ను ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. కోల్కతా బౌలర్లలో ముజరబాని నాలుగు వికెట్లు, వైభవ్ రెండు వికెట్లు తీయగా, త్యాగి, అనుకుల్ చెరో వికెట్ తీశారు.

# అసలైన మజా మొదలైంది

బ్యాటర్ల దూకుడుతో మొదలైన ఐపీఎల్ 2026 సీజన్ లో బౌలర్లు సత్తా చూపించడం ప్రారంభమైంది. మొదట్లో బ్యాట్ దెబ్బకు భయపడిన బంతి క్రమంగా పుంజుకొంటోంది. అయినా, ఇప్పటివరకూ జరిగిన 'తొలి' మ్యాచుల్లో బ్యాటర్లదే హవా. మరి ఇందులో ఎవరు హీరోలు అయ్యారు? ఎవరి ప్రదర్శన సూపర్ గా మారిందో ఓ లుక్కేద్దాం.



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో పది జట్లూ ఒక్కో మ్యాచ్ ను ఆడేశాయి. వరుసగా ఐదు రోజుల్లో జరిగిన పోరుల్లో ఐదు టీమ్ లు విజయం సాధించగా.. మరో ఐదు ఓటమితో మెగా లీగ్ ను మొదలెట్టాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రాజస్థాన్ రాయల్స్ (+4.171) నెట్ రన్ రేట్ తో అగ్ర స్థానంలో ఉంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (+2.907), ఢిల్లీ క్యాపిటల్స్ (+1.397), ముంబయి ఇండియన్స్ (0.687), పంజాబ్ కింగ్స్ (0.509) తమ ఖాతాలు తెరిచాయి. సరిగ్గా పది హాఫ్ సెంచరీలూ నమోదుకావడం గమనార్హం. అత్యధిక స్కోరు ముంబయి ఇండియన్స్ 224 పరుగులు చేసింది. కోల్ కతా నిర్దేశించిన 221 పరుగుల లక్ష్య ఛేదనను పూర్తి చేసింది. ఇక అత్యల్పంగా చెన్నై సూపర్ కింగ్స్ 127 పరుగులకే ఆలౌటైంది.

### అప్పుడు బ్యాటర్లదే హవా

తొలి మూడు మ్యాచుల్లో బౌలర్లపై బ్యాటర్లదే హవా. సన్ రైజర్స్ నిర్దేశించిన 202 పరుగుల టార్గెట్ ను డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ కేవలం 15.4 ఓవర్లలోనే ఛేదించింది. విరాట్ కోహ్లీ (69*) టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఇక కేకేఆర్ పై రోహిత్ శర్మ (78) విజృంభించడంతో ముంబయి గెలిచింది. సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (80) సూపర్ ఇన్నింగ్స్ ఆడినా తొలి మ్యాచ్ లో ఓటమి తప్పలేదు. ఈ మూడింట్లోనూ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. బెంగళూరు, ముంబయి మైదానాల్లో బ్యాటర్లు దూకుడు చూపించారు. గువాహటిలో అనూహ్యంగా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలూ సమంగా కీలక పాత్ర పోషించాయి. తొలుత సీఎస్కేను తక్కువ స్కోరుకే రాజస్థాన్ బౌలర్లు పరిమితం చేశారు. అదే పిచ్ పై రాజస్థాన్ బ్యాటర్లు చెలరేగిపోయి వేగంగా పరుగులు రాబట్టడం గమనార్హం.

### ఇప్పుడిప్పుడే మజా మొదలు

ప్రతి మ్యాచ్ లోనూ బ్యాటర్లదే హవా అయితే.. అభిమానుల్లో ఆసక్తి తగ్గిపోతుంది. బౌలర్లు సవాల్ విసిరితే ఆ మజానే వేరు. ఐపీఎల్ 2026 సీజన్ ఇప్పుడు అదే బాటలోకి వస్తున్నట్లు అనిపిస్తోంది. గత రెండు మ్యాచుల్లో బౌలింగ్ యూనిట్ కూడా పుంజుకుంది. పంజాబ్ కు నిర్దేశించిన 163 పరుగుల టార్గెట్ ను కాపాడుకొనేందుకు గుజరాత్ బౌలర్లు చాలా శ్రమించారు. మ్యాచ్ ను చివరి ఓవర్ వరకూ తీసుకెళ్లారు. అయితే, పంజాబ్ వన్డౌన్ బ్యాటర్ కనోలీ ఆఖరివరకు క్రీజ్ లో ఉండి తన జట్టును గెలిపించాడు. ఇక ఢిల్లీతో మ్యాచ్ లోనూ లఖ్ నవూ బౌలర్లు ఆరంభంలో అదరగొట్టారు. 26 పరుగులకే నాలుగు వికెట్లు తీసి కాస్త భయపెట్టారు. ఈ క్రమంలో స్టబ్స్-ప్రిన్స్ యాదవ్ మధ్య కాస్త టెన్షన్ వాతావరణం నెలకొంది. స్టంబ్స్ వైపు ప్రిన్స్ కాస్త సీరియస్ లుక్ ఇచ్చాడు. ఇక ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన సమీర్ రిజ్వీ (70*) అద్భుత ఆటతీరుతో ఢిల్లీకి విజయాన్ని అందించాడు. లఖ్ నవూ ఇచ్చిన 142 పరుగుల టార్గెట్ను ఢిల్లీ 17.1 ఓవర్లలో చేసి గెలిచింది. ఐదో వికెట్ కు స్టబ్స్ తో కలిసి రిజ్వీ సెంచరీ భాగస్వామ్యం నిర్మించాడు. ఇక్కడ మరొక వికెట్ పడుంటే పరిస్థితి భిన్నంగా ఉండేది.

### బ్యాటింగ్ లో వీరు.. బౌలింగ్ లో వారు

బ్యాటింగ్ విభాగంలో రికెల్టన్(81) టాప్ స్కోరర్ గా నిలిచాడు. భారత్ నుంచి ఇషాన్ కిషన్ (80) ముందున్నాడు.

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 300+ స్ట్రైక్ రేట్తో హాఫ్ సెంచరీ చేయడం విశేషం.

రికెల్టన్ (8), రోహిత్ శర్మ (6) సిక్సుల జాబితాలో ముందున్నారు. సన్ రైజర్స్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (8) ఎక్కువ ఫోర్లను కొట్టిన బ్యాటర్.

ఇక బౌలింగ్ విభాగంలో.. ఆర్సీబీ బౌలర్ జాకబ్ డఫీ, ప్రసిద్ధ్ కృష్ణ, నటరాజన్, లుంగి ఎంగిడి, విజయ్ కుమార్, శార్దూల్, రొమారియో షెఫర్డ్ మూడేసి వికెట్లు తీశారు. బెస్ట్ బౌలింగ్ మాత్రం జాకబ్ డఫీ (3/22)దే.

రాజస్థాన్ రాయల్స్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు, మోసిన్ ఖాన్ ఒక వికెట్ తీసినా.. వారిద్దరి ఎకానమీ మాత్రం చాలా బాగుంది. 4 ఓవర్ల కోటాలో కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చారు. అంటే 4.75 ఎకానమీతో బౌలింగ్ చేశారు.

# రామాయణం నుంచి పురుషోత్తముడి దర్శనం..!

భారతీయ చిత్ర పరిశ్రమలో మునుపెన్నడూ లేని విధంగా సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న 'రామాయణ' చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. హనుమాన్ జయంతి కానుకగా విడుదలైన 'రామ' గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ వీడియోలో ఒక్క డైలాగ్ కూడా లేకపోయినప్పటికీ, కేవలం విజువల్స్ ద్వారానే సినిమా స్థాయిని మేకర్స్ చాటిచెప్పారు. ముఖ్యంగా శ్రీరాముడిగా రణ్ బీర్ కపూర్ లుక్ అందరినీ కట్టిపడేస్తోంది. ఆ కళ్లలో కనిపించే ప్రశాంతత, ముఖంలో వెలిగే దైవత్వం మరియు ఆ క్యారెక్టర్ కు కావాల్సిన గాంభీర్యాన్ని రణ్ బీర్ అద్భుతంగా పండించారు. శ్రీరాముడి పాత్రలో ఆయన ఒదిగిపోయిన తీరు చూస్తుంటే, ఈ పాత్రకు రణ్ బీర్ సరైన ఎంపిక అని స్పష్టమవుతోంది.

ఈ చిత్రంలో సాయి పల్లవి సీతగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా మరియు రవితేజ దూబే లక్ష్మణుడిగా నటిస్తున్నారు. గ్లింప్స్ చివరిలో పుష్పక విమానం ఎక్కుతున్న రావణుడిగా (యశ్) చూపించిన షాట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. హన్స్ జిమ్మెర్ మరియు ఏఆర్ రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ దృశ్యాలకు ప్రాణం పోశాయి. అత్యున్నత స్థాయి VFX టెక్నాలజీని ఉపయోగిస్తూ, ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ మరియు DNEG సంస్థలు ఈ చిత్రాన్ని ఒక ప్రపంచ స్థాయి విజువల్ వండర్ గా తీర్చిదిద్దుతున్నాయి. ఐమ్యాక్స్ మరియు డాల్బీ సినిమా ఫార్మాట్లలో విడుదల కానున్న ఈ చిత్రం, ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించనుంది. నమిత్ మల్హోత్రా నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా 2026 దీపావళి కానుకగా విడుదల కానుంది. భారతీయ పురాణ గాథను వెండితెరపై ఇంత భారీ స్థాయిలో చూడటం కోసం ప్రేక్షకులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.






# మారుతితో అఖిల్ మూవీ సెట్ అయ్యేనా..?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో 'ది రాజా సాబ్' చిత్రాన్ని తెరకెక్కించాడు దర్శకుడు మారుతి. ఆ సినిమాపై బోలెడన్ని ఆశలు పెట్టుకోగా, ఆ మూవీ బాక్సాఫీస్ దగ్గర డిజాస్టర్ గా నిలిచింది. దీంతో మారుతి ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్క్రిప్టు పనుల్లో బిజీగా ఉన్న మారుతి తన నెక్స్ట్ చిత్రాన్ని అక్కినేని యంగ్ హీరో అఖిల్ తో చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అఖిల్ కు పలుమార్లు స్క్రిప్టు వినిపించిన మారుతి, ఎలాగైనా అఖిల్ తో తన నెక్స్ట్ చిత్రాన్ని లాక్ చేయాలని భావిస్తున్నాడు. దీనికితోడు గతంలో అక్కినేని నాగచైతన్యకు 'శైలజారెడ్డి అల్లుడు' సినిమాతో మంచి హిట్ అందించాడు. ఈ క్రమంలో ఇప్పుడు అఖిల్ కు కూడా అలాంటి హిట్ అందిస్తే మారుతి తిరిగి ట్రాక్ ఎక్కడం ఖాయమని పలువురు కామెంట్స్ చేస్తున్నారు. మరి నిజంగానే మారుతి అఖిల్ తో సినిమా చేస్తాడా.. అనేది ఆసక్తికరంగా మారింది.

# మరోసారి మైత్రీతో చేతులు కలుపుతున్న ప్రదీప్ రంగనాథన్..!

యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ తెలుగు, తమిళ భాషల్లో క్రేజీ ప్రాజెక్ట్ లతో దూసుకుపోతున్నాడు. గతంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో వచ్చిన 'డ్యూడ్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ప్రదీప్, ఇప్పుడు మరోసారి అదే అగ్ర నిర్మాణ సంస్థతో చేతులు కలిపాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కి సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం ఇప్పుడు టాలీవుడ్ లో చక్కర్లు కొడుతోంది.



ఈ చిత్రానికి వైవిధ్యమైన సినిమాల దర్శకుడు చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వం వహించనున్నారు. ప్రదీప్ మార్క్ యూత్ ఫుల్ ఎనర్జీకి, యేలేటి మార్క్ ఇంటెలిజెంట్ స్క్రీన్ ప్లే తోడైతే సినిమా సరికొత్తగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం చర్చలు తుది దశలో ఉన్నాయని, త్వరలోనే మైత్రీ మూవీ మేకర్స్ నుండి అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కించనున్నారు.

మరోవైపు, ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమా కోసం ఏకంగా రూ.50 కోట్ల భారీ రెమ్యూనరేషన్ డిమాండ్ చేస్తున్నారనే పుకార్లు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి. ప్రస్తుతం ఆయన విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో నటించిన 'ఔఐఓ' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ) విడుదలకు సిద్ధంగా ఉంది. వరుస విజయాలతో ఫుల్ ఫామ్ లో ఉన్న ఈ యంగ్ స్టార్, తెలుగు మార్కెట్ పై కూడా పట్టు సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి.



# అదిరిపోయిన 'పెద్ది' కొత్త పోస్టర్..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం ప్రస్తుతం టాలీవుడ్ లో మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ లలో ఒకటిగా నిలిచింది. స్పోర్ట్స్ నేపథ్యంలో గ్రామీణ వాతావరణంలో సాగే ఈ సినిమా వాయిదా పడుతుందంటూ వస్తున్న పుకార్లకు రామ్ చరణ్ చెక్ పెట్టారు. ఈ చిత్రం అనుకున్న సమయానికే, అంటే ఏప్రిల్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని ఆయన ఇటీవల స్పష్టం చేశారు. హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని, చిత్ర బృందం విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఇటీవల విడుదలైన 'పెద్ది పహిల్వాన్' గ్లింప్స్ ఆధారంగా రూపొందించిన ఈ పోస్టర్ లో రామ్ చరణ్ లుక్ పవర్ ఫుల్ గా ఉంది. ఆయన కండలు తిరిగిన దేహం మరియు నిలబడిన తీరు హనుమంతుడి రూపాన్ని తలపించేలా ఉండి అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. అయితే, ఈ పోస్టర్ లో రిలీజ్ డేట్ లేకపోవడంతో ఇప్పుడు అభిమానులు డైలమాలో పడిపోయారు.

ఈ భారీ చిత్రంలో కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్, దివ్యేందు శర్మ మరియు జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై రూపొందుతున్న ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తుండటం విశేషం. అయితే, ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో మేకర్స్ పక్కా క్లారిటీ ఎందుకు ఇవ్వడం లేదనే విషయంపై అభిమానుల్లో చర్చ సాగుతుంది.

# బైకర్‌లో నాది ఓ వారధిలాంటి పాత్ర

జయాపజయాలతో సంబంధం లేకుండా తెరపై మెరుస్తుంటుంది కథానాయిక మాళవిక నాయర్. పరిధి, ప్రాధాన్యంతో సంబంధం లేకుండా చాలా సినిమాల్లో కీలకమైన, నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేసి మెప్పించారామె. ఇటీవల 'బైకర్'లో శర్వానంద్ కు జోడీగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 3న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మాళవిక నాయర్ బుధవారం హైదరాబాద్ లో విలేకర్లతో ముచ్చటించారు.

**మీరు ఆచితూచి సినిమాలు చేస్తుంటారు. 'బైకర్' సినిమాతో మీ ప్రయాణం ఎలా మొదలైంది?**

ప్రతీసారీ ఓ కొత్త పాత్ర చేయాలన్నదే నా తపన. అలాంటి పాత్రలు వచ్చినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోను. 2024 ఏప్రిల్ లో దర్శకుడు అభిలాష్ 'బైకర్' కథ చెప్పారు. చాలా నచ్చింది. తను కథని, పాత్రల్ని తీర్చిదిద్దిన విధానంతోపాటు, ఇది భారతీయ తొలి మోటోక్రాస్ సినిమా కావడంతో ఈ చిత్రం చేయాలని నిర్ణయించుకున్నా.

**ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

కథలో ఓ వారధిలాంటి పాత్ర నాది. ఒక క్రీడాకారుడి జీవితంలో కుటుంబం పాత్ర చాలా కీలకం. ఏ నిర్ణయమైనా సరే, తన భాగస్వామితో కలిసే తీసుకుంటుంటారు. అలాంటి కీలకమైన భాగస్వామి పాత్రని ఇందులో నేను పోషించా. కథ మూడు కాలాల్ని ప్రతిబింబిస్తూ సాగుతుంది. ఎప్పటికప్పుడు పరిణతి చూపిస్తూ... నటించడానికి ఆస్కారం ఉన్న ఈ పాత్ర సినిమాపై చాలా ప్రభావం చూపిస్తుంది. ఇంతకంటే నా పాత్ర గురించి ఎక్కువ చెప్పకూడదు.

**కథానాయకుడు శర్వానంద్ తో కలిసి తెరను పంచుకున్నారు కదా. ఆయన గురించి, ఆయన నటన గురించి ఏం చెబుతారు?**

వ్యక్తిగతంగా నాకూ, శర్వానంద్ కూ చాలా సారూప్యతలు ఉన్నాయి. ఇద్దరం ఎక్కువగా మాట్లాడేవాళ్లం కాదు. నిశ్శబ్దంగా ఎవరి పని వాళ్లు చేసుకుంటూ వెళ్లిపోతుంటాం. కానీ సినిమాలో మా ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. సెట్ లో తను అక్కడికక్కడే ప్రదర్శించే టైమింగ్ నాకు చాలా బాగా నచ్చుతుంది. శర్వానంద్ తోపాటు, సీనియర్ హీరో రాజశేఖర్ తో కలిసి నటించడం మంచి అనుభవం. అంత సీనియర్ అయినా, సెట్ లో అందరితోనూ సన్నిహితంగా మెలుగుతుంటారు. తండ్రీ తనయుల మధ్య భావోద్వేగం ఈ సినిమాకి కీలకం. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఎంతో స్పష్టత ఉన్న దర్శకుడు. యు.వి. క్రియేషన్స్ సంస్థ సినిమాని ప్రేమించి చేస్తుంది.

**ఈ సినిమా ప్రయాణంలో మీకెదురైన సవాళ్లు ఎలాంటివి?**

మోటోక్రాస్ క్రీడను చిత్రీకరించడం చాలా కష్టం. మూడు కాలాల్ని ప్రతిబింబిస్తూ సాగే పాత్రకి తగ్గట్టుగా వైవిధ్యం ప్రదర్శించడమే ఈ సినిమాలో నాకెదురైన ప్రధానమైన సవాల్. యువతరానికి కావల్సినంత స్ఫూర్తితోపాటు, మనసుల్ని హత్తుకునేలా భావోద్వేగాల్ని, క్రీడల్లో సహజంగా కనిపించే థ్రిల్ ని పూర్తిస్థాయిలో పంచే చిత్రమిది. సంగీతంపరంగా, సాంకేతికంగా సినిమా మంచి కిక్ ఇస్తుంది. ప్రెట్టీ బేబీ పాట, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీని ప్రేక్షకులు మరింతగా ఆస్వాదిస్తారు.

**కథానాయికగా మీ ప్రయాణంపై సంతృప్తిగా ఉన్నారా?**

ప్రేక్షకుల కోణంలో ఆలోచించి కథల్ని ఎంపిక చేసుకుంటుంటా. అదే సమయంలో వ్యక్తిగతంగా నాకూ కనెక్ట్ అయ్యే పాత్రల్లో నటిస్తున్నా. అటు ప్రేక్షకులకూ, ఇటు నాకూ నచ్చే సినిమాలు చేయడం కంటే సంతృప్తి ఇంకేం ఉంటుంది? ఇలాగే మరిన్ని మంచి పాత్రలు చేయాలన్నదే నా కోరిక.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.